www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

ఆంధ్రజ్యోతి

పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 293

మంగళవారం | 21-1-2025

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి మ. 12.40 తదుపరి అష్టమి; నక్షత్రం: చిత్త రా. 11.37 తదుపరి స్వాతి, వర్జ్యం: శేషం ఉ.7.20, పున: తె.5.54; దుర్ముహూర్తం: ఉ.9.05-9.50, రా.10.14-11.03; అమృతఘడియలు: సా.4.23-6.11; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.00

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



విక్టరీ ర్యాలీలో ట్రంప్ డ్యాన్స్



అధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న ట్రంప్



మెలానియాను ముద్దాడుతూ..

గండరగండడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అమెరికా అధ్యక్షుడిగా ఆసీనుడయ్యారు. పలు ఎగుడుదిగుళ్లు చూసిన రాజకీయ జీవితంలో పలుమార్లు పదవీచ్యుతి ప్రయత్నాలను, పలు నేరారోపణలను, హత్యాయత్నాలను అధిగమించి మరోసారి శ్వేతసౌధం అధిపతిగా బాధ్యతలు స్వీకరించారు.

బైడెన్ నిర్ణయాలన్నీ రద్దు

కొన్ని గంటల్లోనే చేసేస్తా.. స్వర్ణయుగం ఆరంభమైంది

అమెరికా మళ్లీ గొప్ప దేశంగా మారబోతోంది.. అందుకే దేవుడు నన్ను బతికించాడు

అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమేస్తా.. మూడో ప్రపంచ యుద్ధాన్ని అడ్డుకుంటా..

దేశంలో ఇక ఆడ, మగ రెండే జెండర్లు.. డొనాల్డ్ ట్రంప్ ఉద్వేగ భరిత ప్రసంగం

47వ అధ్యక్షుడిగా రిపబ్లికన్ నేత ప్రమాణం.. ప్రపంచ దేశాల అతిరథమహారథుల హాజరు

వాషింగ్టన్ డీసీ, జనవరి 20: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథుల సమక్షంలో సోమవారం క్యాపిటల్ బిల్డింగ్‌లో జరిగిన వేడుకలో రిపబ్లికన్ నేత 47వ దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. నవంబరులో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన 78 ఏళ్ల ట్రంప్ చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు. 1861లో అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. వాషింగ్టన్‌లో తీవ్రమైన చలిగాలులు వీస్తుండటంతో కాపిటల్ బిల్డింగ్ లాన్‌లో వేడుకగా జరగాల్సిన కార్యక్రమాన్ని లోపల హాల్లోకి మార్చారు. బయట సాంస్కృతిక కార్యక్రమాలు, మిలిటరీ పరేడ్ యధావిధిగా సాగాయి. ప్రమాణస్వీకారం సందర్భంగా, అంతకుముందు

మిగతా 2వ పేజీలో...

దావోస్‌లో బాబు, రేవంత్

- జ్యూరిక్ ఎయిర్‌పోర్టులో కలిసిన తెలుగు రాష్ట్రాల సీఎంలు
- అక్కడే కొద్దిసేపు భేటీ.. పలు అంశాలపై ఇరువురి చర్చ
- ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సు ప్రారంభం
- తొలిరోజు ఘనంగా గ్రాండ్ ఇండియా పెవిలియన్



జ్యూరిక్ ఎయిర్‌పోర్టులో లోకేశ్, రేవంత్, చంద్రబాబు, శ్రీధర్‌బాబు, రామ్మోహన్

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం జ్యూరిక్ విమానాశ్రయంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడును కలుసుకున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులతో కలిసి గత నాలుగు రోజులుగా సింగపూర్‌లో పర్యటించిన సీఎం రేవంత్.. అక్కడి నుంచి దావోస్ సమావేశాల కోసం బయలుదేరి సోమవారం జ్యూరిక్ విమానాశ్రయానికి చేరుకున్నారు. మరోవైపు ఇవే సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు కూడా అదే సమయంలో

మిగతా 13వ పేజీలో...

ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారంభం

- నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో వైద్యశాఖ మంత్రి దామోదర చర్చలు సఫలం 13
- నెలవారీగా బిల్లుల చెల్లింపునకు అంగీకారం
- నాలుగైదు నెలల్లో బకాయిల చెల్లింపునకు హామీ

మద్యం కంపెనీలకు కిక్కు!



చెల్లింపు ధర 10-15% పెంపు?

త్రిసభ్య కమిటీ అధ్యయన నివేదికలో సూచన!

టీజీబీసీఎల్‌కు నివేదికను సమర్పించిన కమిటీ

బోర్డు భేటీ.. త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందజేత

సీఎం రేవంత్ స్విట్జర్లాండ్ నుంచి వచ్చాక నిర్ణయం!

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం తయారీ కంపెనీలకు చెల్లిస్తున్న ధరలను 10-15 శాతం వరకు పెంచాల్సిందిగా ఈ అంశంపై అధ్యయనం చేసిన త్రిసభ్య కమిటీ సూచించినట్లు తెలుస్తోంది. మద్యం కంపెనీలకు చెల్లించే ధరలను సమీక్షించేందుకు ప్రభుత్వం నియమించిన ఈ కమిటీ తన నివేదికను తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ (టీజీబీసీఎల్)కు ఇటీవలే సమర్పించింది. దీనిపై ఉన్నత స్థాయిలో అధికారుల చర్చలు ప్రారంభమయ్యాయి. టీజీబీసీఎల్ బోర్డు సోమవారం సమావేశమై కమిటీ నివేదికపై ప్రాథమికంగా చర్చించింది. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి వచ్చేలోపు ఈ నివేదికను టీజీబీసీఎల్ ప్రభుత్వానికి అందించనుంది. ముఖ్యమంత్రి వచ్చాక ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వాస్తవానికి మద్యం తయారీదారులకు ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలను ఎక్సైజ్ చట్టం ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి సమీక్షించాల్సి ఉంటుంది. దీనికోసం టీజీబీసీఎల్ గతంలోనే త్రిసభ్య కమిటీని నియమించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో రిటైర్డ్ ఐఏఎస్

మిగతా 3వ పేజీలో...

దిగొచ్చిన బీర్ల కంపెనీ

రాష్ట్రంలో బీర్ల ఉత్పత్తి పునఃప్రారంభిస్తాం

యునైటెడ్ బ్రూవరీస్ వెల్లడి

ధరలు పెంచాలని, బకాయిలివ్వాలని ప్రభుత్వానికి తొలుత యూబీ డిమాండ్

ఉత్పత్తులు నిలిపివేస్తున్నట్లు 8న ప్రకటన

ప్రభుత్వ కఠిన వైఖరితోనే వెనక్కి తగ్గిన సంస్థ

కొత్త కంపెనీలొస్తే వాటా పోతుందనే గుబులు

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీర్ల ధరలు పెంచాలని బెట్టు చేసి, బకాయిలు ఇస్తే తప్ప పనులు చేయలేమంటూ దాదాపు రెండు వారాల క్రితం ఉత్పత్తులు నిలిపివేసిన యునైటెడ్ బ్రూవరీస్(యూబీ) ఎట్టకేలకు దిగొచ్చింది. రాష్ట్రంలో బీర్ల ఉత్పత్తిని వెంటనే పునఃప్రారంభిస్తామని ప్రకటించింది. ఈ మేరకు బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్‌కు

మిగతా 3వ పేజీలో...



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భట్టి

రూ. 1.63 లక్షల కోట్లు ఇప్పించండి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి డిప్యూటీ సీఎం భట్టి వినతి

ఓఆర్ఆర్ టు ఆర్ఆర్ఆర్ రోడ్లకు రూ.45 వేల కోట్లు

హైదరాబాద్ మెట్రో రెండోదశకు రూ.24,269 కోట్లు

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు నిధులివ్వాలని విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1.63 లక్షల కోట్ల మేర నిధులను మంజూరు చేయించడంలో సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఒడిశాలోని కోణార్క్‌లో జరుగుతున్న 'రాష్ట్రాల గనులు, ఖనిజాల శాఖల మంత్రుల' మూడో జాతీయ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన డిప్యూటీ సీఎం.. అక్కడే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వివిధ ప్రాజెక్టుల అంచనా వ్యయాలతో కూడిన

మిగతా 13వ పేజీలో...

గనుల రంగంలో సంస్కరణలు తెచ్చాం

వేలానికి రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు అవసరం

గనుల మంత్రుల సదస్సులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

14

ప్రాణాలైనా ఇస్తాం

మైనింగ్ మాత్రం జరగనివ్వం

స్పష్టం చేసిన మైలారం గ్రామస్థులు

పురుగు మందు డబ్బాలతో ఆందోళన

సంజయ్‌రాయ్ చచ్చేదాకా జైల్లోనే..

కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం కేసులో జీవిత ఖైదు విధిస్తూ సియాల్దా కోర్టు తీర్పు

హతురాలి తల్లిదండ్రులకు రూ.17 లక్షలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

వద్దన్న తల్లిదండ్రులు.. తీర్పుపై అసంతృప్తి

మరణశిక్ష వేసే దాకా పోరాడతామని వెల్లడి

మేమే దర్యాప్తు చేస్తే ఉరిశిక్ష పడేది: మమత

దీదీ పాత్రపైనా దర్యాప్తు చేయాలి: బీజేపీ

ప్రియుడి హత్యకేసులో ప్రియురాలికి మరణశిక్ష 2

2022 నాటి కేసులో కేరళ కోర్టు తీర్పు



అమెరికాలో తెలంగాణ యువకుడి హత్య!

ఫుడ్ డెలివరీ చేసి వస్తుండగా దుండగుల కాల్పులు.. కారు, డబ్బులు ఇవ్వాలని ఘాతుకం

మృతుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసి

ఉన్నత చదువులకు వాషింగ్టన్‌కు 12

మార్చిలో ఉద్యోగం వస్తుందనగా ఘోరం

తండ్రి క్యాబ్ డ్రైవర్.. భూమినంతా అమ్మేసి ఇద్దరు పిల్లల్ని అమెరికాకు పంపిన వైనం



మార్చిలో కాళేశ్వరంపై తుది నివేదిక!

భారీ అవకతవకలను గుర్తించిన జస్టిస్ ఘోష్ కమిషన్

నేటి నుంచి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభం

ఫిబ్రవరిలో కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల విచారణ

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బ్యారేజీల నిర్మాణంపై కమిషన్ విచారణ కొలిక్కి వచ్చింది. మార్చి నెలాఖరుకల్లా విచారణపై నివేదికను ప్రభుత్వానికి అందించే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు నిర్వహించిన సుదీర్ఘ విచారణలో అవకతవకలు, అక్రమాలపై 204 పేజీలతో కమిషన్

మిగతా 12వ పేజీలో...

ఈటలకు నోటీసులా?

ఘోష్ కమిషన్ లక్ష్యమేంటి?

బీజేపీ అధిష్ఠానం ఆరా

తక్షణ నివేదిక ఇవ్వాలని రాష్ట్ర నేతలకు ఆదేశం 12

అత్యవసర నివేదిక పంపిన రాష్ట్ర నాయకత్వం

గ్రామసభలు నేటి నుంచి

24 దాకా నిర్వహణ.. 4 పథకాల కోసం అర్హుల గుర్తింపు

అర్హత ఉన్నా పేర్లు లేకపోతే మళ్లీ దరఖాస్తుల స్వీకరణ

గ్రామసభల్లో జాబితా ప్రదర్శన.. 26న పథకాల ప్రారంభం



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాలకు సంబంధించి అర్హులను గుర్తించేందుకు గ్రామసభల నిర్వహణకు వేళైంది. ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారులను గుర్తించేందుకు మంగళవారం నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. అనంతరం.. ఈ పథకాలను 26న ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది. ప్రజాపాలన దరఖాస్తులు, గతంలో మీ-సేవ కేంద్రాల్లో వచ్చిన దరఖాస్తులు, కులగణన, ప్రభుత్వం వద్ద ఉన్న పేద కుటుంబాల సమాచారం ఆధారంగా లబ్ధిదారుల తాత్కాలిక జాబితా సిద్ధం చేశారు. దాని ఆధారంగా ఆయా కుటుంబాల ద్వారా సమగ్ర సమాచారం రాబట్టారు. ఇప్పటికే గ్రామ

మిగతా 13వ పేజీలో...



40-50 కిలోమీటర్లకో టోల్‌ప్లాజా

అక్కడే రోడ్డుకు ఇరు వైపులా రెస్ట్‌రూమ్‌లు

ఐదేసి ఎకరాల్లో ప్రయాణికులకు సౌకర్యాలు

రెస్టారెంట్లు, భారీ వాహనాలకు పార్కింగ్

పెరిగే ట్రాఫిక్ దృష్ట్యా అండర్‌పాస్‌లు

సకల హంగులతో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం

189 కి.మీ.కు బదులు 200 కి.మీ. రోడ్డు

డీపీఆర్ తయారీకి సిద్ధమైన ప్రభుత్వం

ఆర్ఆర్ఆర్ కొత్త అలైన్‌మెంటుకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం ప్రయత్నం

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని సకల హంగులతో, అత్యంత భద్రతతో, సౌకర్యవంతంగా తీర్చిదిద్దనున్నారు. రహదారి నిర్మాణ ఆకృతి, రహదారి మార్గంలో విద్యుత్ స్తంభాలు, పైపు లైన్లు, టెలిఫోన్ లైన్లు తొలగించి, తిరిగి అమర్చడంపై 'సమగ్ర ప్రాజెక్టు నివేదిక'ను రూపొందించేందుకు

మిగతా 14వ పేజీలో...



12

కేసుల పరిష్కారంలో తెలంగాణ

హైకోర్టు ముందంజ

అనవసర వాయిదాలకు ముగింపు పలికాం

వీడ్కోలు సమావేశంలో సీజే అలోక్ అరాధే

ఎన్టీఆర్ ఘాట్‌కు మరమ్మతులు

పనులు చేపట్టాలన్న హెచ్ఎండీఏ కమిషనర్

దెబ్బతిన్న ఘాట్ పరిసరాలను చూసి

వర్ధంతి నాడు ఎన్టీఆర్ అభిమానుల ఆగ్రహం

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అసహనం



మళ్లీ చలి పంజా 14

ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 6.2 డిగ్రీలు

పలు జిల్లాల్లో దారుణంగా పడిన ఉష్ణోగ్రతలు

చలిగాలులతో పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు



బీఆర్ఎస్ మహాధర్నా వాయిదా

పోలీసుల అనుమతి నిరాకరణ 12

హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్

కేసును 27కు వాయిదా వేసిన కోర్టు

రైతు ఆత్మహత్యలపై 9 మందితో బీఆర్ఎస్ అధ్యయన కమిటీ: కేటీఆర్

బైడెన్ నిర్ణయాలన్నీ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

అభిమానులతో ర్యాలీలో ట్రంప్ ఉత్సాహభరితంగా ప్రసంగించారు. ఈ క్షణం నుంచి అమెరికా స్వర్ణ యుగం ప్రారంభమైందని ప్రకటించారు. మళ్లీ అమెరికా గొప్ప దేశం అవుతుందని భరోసా ఇచ్చారు. ప్రపంచం మొత్తం అమెరికాను చూసి కుళ్లుకుంటుందని మద్దతుదారుల హర్షధ్వానాల మధ్య వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా తనపై జరిగిన హత్యాయత్నాన్ని ట్రంప్ గుర్తు చేసుకున్నారు. బుల్లెట్ తన చెవిని చీల్చుకుంటూ వెళ్లిందని, అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మార్చే గొప్ప కార్యాన్ని నెరవేర్చడానికే దేవుడు తనను రక్షించాడని ట్రంప్ వ్యాఖ్యానించారు. అధ్యక్షుడిగా భారీ నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు ప్రకటించారు. వలసలపై భారీ ఎత్తున నియంత్రణలు పెడతామని, అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతామని వ్యాఖ్యానించారు. దేశంలో అక్రమంగా ఉంటున్న లక్షల మంది నేరగాళ్లను వెంటనే వెళ్లగొడతామన్నారు. చమురు తవ్వకం మీద బైడెన్ నిర్ణయాలను తిరగదోడతామని ప్రకటించారు. మెక్సికో సరిహద్దుల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తామని, సాయుధ బలగాలను మోహరిస్తామని చెప్పారు. సరిహద్దు దాటి వచ్చి ఆశ్రయం కోరేవారు ఇక నుంచి కోర్టు విచారణ తేదీ వచ్చేవరకు సరిహద్దుల్లోనే ఉండే విధంగా పాత విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న వ్యక్తులకు అమెరికా గడ్డపై పిల్లలు పుడితే ప్రస్తుతం ఆటోమాటిక్ పౌరసత్వం ఇస్తున్నారని, దాన్ని ఎత్తేస్తామని అన్నారు. మంగళవారం సూర్యుడు అస్తమించే సమయానికి అమెరికాపై జరుగుతున్న దాడి ఆగిపోతుందని వ్యాఖ్యానించారు. నాలుగేళ్ల అమెరికా పతనానికి తెర పడిందని తక్షణమే తెర పడిందని చెప్పారు. క్యాపిటల్ భవనంపై దాడికి సంబంధించిన కేసుల్లో దోషులు/అభియోగాలు ఎదుర్కొంటున్న 1500 మందికి పైగా బాధితులకు ఉపశమనం కల్పిస్తానని పునరుద్ఘాటించారు. ఓవల్ ఆఫీసులో బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోపే బైడెన్ సర్కారు తీసుకున్న మూర్ఖపు నిర్ణయాలను రద్దు చేస్తానని వెల్లడించారు. ఆయన ప్రభుత్వం తీసుకున్న ఏ నిర్ణయాలూ అమలు కాకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి ముగింపు పలుకుతానని ట్రంప్ చెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలనూ అదుపు చేస్తానన్నారు. మూడో ప్రపంచ యుద్ధంగా రాకుండా అడ్డుకుంటానని స్పష్టం చేశారు. మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనకుండా నిలువరిస్తానని ట్రంప్ చెప్పారు. దేశంలో ఆడ, మగ రెండు జెండర్‌లు మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. జాన్ ఎఫ్ కెనడీ, రాబర్ట్ ఎఫ్ కెనడీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్య కేసు ఫైళ్లను బహిర్గతం చేస్తానని తెలిపారు. ప్రభుత్వంలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు రాబోయే రోజుల్లో ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తానని వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే పాలనాపరమైన అనేక ఆదేశాలు జారీ చేస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. 250 ఏళ్ల అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడు ఎదుర్కోనన్ని పరీక్షలను తాను ఎదుర్కొన్నానని చెప్పారు.



అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ట్రంప్

భారీ ర్యాలీ.. డ్యాన్స్ చేసిన ట్రంప్!

ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు ట్రంప్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వాషింగ్టన్ డీసీలో ఆదివారం నిర్వహించిన ఈ ర్యాలీలో ట్రంప్ తన మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్(ఎంఏజీఏ) షర్టులు ధరించిన వేల మంది ట్రంప్ అభిమానులు దేశం నలు మూలల నుంచి వాషింగ్టన్‌కు వచ్చి వర్షం, మంచును లెక్క చేయకుండా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. తాను ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చుతానని ప్రకటించారు. అమెరికా వాణిజ్య విధానాన్ని ప్రక్షాళిస్తామని, ఇతర దేశాల నుంచి దిగుమతులపై పన్నులు వేసి ఆ సొమ్ముతో సగటు అమెరికన్లకు లబ్ధి కలిగేట్లు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. పనామా కాలువను స్వాధీనం చేసుకుంటామని, గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారుస్తామని చెప్పారు. మాగా ర్యాలీలో కళాకారులు వైఎంసీఏ పాటను పాడుతూ నృత్యం చేశారు. బ్యాండ్ సభ్యులు డ్యాన్స్ చేస్తుండగా.. ట్రంప్ కూడా తనదైన శైలిలో స్టెప్పులు వేశారు. బ్యాండ్ సభ్యులు ట్రంప్‌తో కరచాలనం చేశారు. 1970వ దశకానికి చెందిన డిస్కో పాట (వైఎంసీఏ)కు ట్రంప్ ప్రచారంలో భాగంగా నిర్వహించే మాగా ర్యాలీల్లో విశేష ప్రాధాన్యం దక్కింది. ఈ ర్యాలీలో ట్రంప్‌తో పాటు ఎలాన్ మస్క్ కూడా పాల్గొన్నారు. తన కుమారుడితో కలిసి వేదికపైకి వచ్చిన మస్క్.. కొన్ని శతాబ్దాల పాటు అమెరికాను పటిష్ఠ దేశంగా ఉంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చివరి గంటల్లో జో బైడెన్ క్షమాభిక్షలు

అమెరికా అధ్యక్ష పదవీకాలం మరికొన్ని గంటల్లో ముగుస్తుందనగా జోబైడెన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో ట్రంప్‌ను విమర్శించిన అమెరికా వైద్య నిపుణుడు డాక్టర్ ఆంటోనీ ఫౌచీ, రిటైర్డ్ జనరల్ మార్క్ మిల్లె తదితరులకు ముందస్తు క్షమాభిక్ష ఆదేశాలు జారీ చేశారు. వీరితో పాటు క్యాపిటల్ హిల్ దాడులపై విచారణ జరిపిన హౌస్ కమిటీ సభ్యులకూ ఉపశమనం కలిగించారు.



ట్రంప్‌కు బైడెన్ స్వాగతం

సోమవారం ఉదయమే వైట్‌హౌస్‌కు వచ్చిన ట్రంప్‌కు దిగిపోతున్న అధ్యక్షుడు బైడెన్ సాదర స్వాగతం పలికి, తేనీటి విందు ఇచ్చారు. తెలుగింటి అల్లుడు, కొత్త ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు తమిళ ఇంటి ఆడపడుచు, దిగిపోతున్న ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ సాదరస్వాగతం పలికారు. జేడీ వాన్స్ వెంట ఆయన సతీమణి ఉష కూడా ఉన్నారు. ట్రంప్ వెంట ఆయన సతీమణి మెలానియా ట్రంప్ ఉన్నారు. ట్రంప్ భార్యబుగ్గపై ముద్దు పెట్టుకొనే ప్రయత్నం చేయగా ఆమె హ్యాట్ అడ్డం రావడంతో ఆగిపోయారు. శ్వేతసౌధంలో విందు అనంతరం ట్రంప్ బైడెన్‌తో కలిసి ఒకే వాహనంలో ప్రమాణ స్వీకారానికి వెళ్లారు.





అమెరికా ఉపాధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న జేడీ వాన్స్, ఆయన పక్కన సతీమణి ఉషా చిలుకూరి

ప్రధాని ప్రత్యేక దూతగా హాజరైన జైశంకర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ ప్రత్యేక దూతగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్ హాజరయ్యారు. ట్రంప్‌ను అభినందిస్తూ ప్రధాని రాసిన లేఖను వెంట తీసుకెళ్లారు. మరోవైపు ప్రధాని మోదీ తన 'ప్రియమిత్రుడు' ట్రంప్‌నకు శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రపంచానికి మంచి భవిష్యత్తు ఇవ్వడానికి, రెండు దేశాలకు మేలు చేయడానికి, మరోసారి మీతో సన్నిహితంగా కలిసి పనిచేయాలని ఎదురు చూస్తున్నా' అంటూ ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ట్రంప్ ప్రమాణ స్వీకార వేడుకకు ఇతర మాజీ అధ్యక్షులతో పాటు బరాక్ ఒబామా హాజరైనప్పటికీ ఒబామా మిచెల్లీ ఒబామా రాలేదు. ట్రంప్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతలతో పాటు వివేక్ రామస్వామి, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్‌బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ బ్యాంక్ చేరుకున్న పాలస్తీనా ఖైదీలు

- 90 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టిన ఇజ్రాయెల్
- 69 మంది మహిళలు, 21 మంది టీనేజర్ల విడుదల

టెల్‌అవీవ్, జనవరి 20: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ ఇప్పటికే ముగ్గురు బందీలను విడిచిపెట్టగా ఇజ్రాయెల్ 90 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టింది. వీరిలో 69 మంది మహిళలు, 21 మంది టీనేజర్లు ఉన్నారు. ఇజ్రాయెల్ విడుదల చేసిన వారిలో 62 సంవత్సరాల ఖలీదా జరార్ కూడా ఉన్నారు. పాలస్తీనా విమోచనం కోసం పోరాడుతున్న లెఫ్టిస్ట్ పాపులర్ ఫ్రంట్ నాయకురాలైన జరార్‌ను ఎలాంటి కోర్టు ఆదేశాలు లేకుండానే 6 నెలలుగా నిర్బంధంలో పెట్టారని ఆరోపణలున్నాయి. రెడ్‌క్రాస్ బస్సుల్లో ఖైదీలంతా వెస్ట్ బ్యాంక్‌లోని రమల్లాకు చేరుకున్నారు. వీరి రాకతో రమల్లాలో సంబరాలు జరుపుకున్నారు. మరోవైపు, ముగ్గురు బందీలను విడిచిపెట్టిన హమాస్ వారికి గిఫ్ట్ బ్యాగులు ఇచ్చి పంపడం వివాదాస్పదమైంది. సంచిలో బందీల ఫొటోలతో కూడిన పుస్తకం, గాజా చిత్రపటంతో పాటు ఓ సర్టిఫికెట్ పంపారు. ఇది హమాస్ క్రూరత్వాన్ని తెలియజేస్తోందని ఇజ్రాయెలీలు మండిపడుతున్నారు.

యూజీసీ కొత్త రూల్స్‌ను రద్దు చేయండి: స్టాలిన్

చెన్నై, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్స్‌లర్ల నియామకంపై రాష్ట్ర గవర్నర్‌కే సంపూర్ణ అధికారాలు కల్పిస్తూ యూజీసీ జారీ చేసిన కొత్త నిబంధనల్ని తక్షణమే రద్దు చేయాలని తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. తమిళనాట ఇప్పటివరకూ వైస్‌ఛాన్స్‌లర్లను నియమించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్‌కమిటీ సిఫారసుల మేరకు, గవర్నర్ ఆమోదం పొందే పద్ధతి ఉండేదని పేర్కొన్నారు. యూజీసీ కొత్త నిబంధన ప్రకారం వీసీల నియామకం కోసం సెర్చ్‌కమిటీలను ఏర్పాటు చేసే అధికారం పూర్తిగా గవర్నర్‌కే ఉంటుందని, రాజ్యాంగానికి వ్యతిరేకమైన ఈ నిబంధనల్ని వ్యతిరేకిస్తూ శాసనసభలో తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఇదే విధంగా ఉన్నత విద్యాకోర్సుల ప్రవేశానికి దేశం మొత్తం ఒకే విధమైన ప్రవేశ పరీక్ష నిర్వహించడం సమాఖ్య విధానానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. ఇదే విధమైన లేఖను ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జమ్ము-కశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, పంజాబ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాల సీఎంలకు కూడా పంపించారు. యూజీసీ కొత్త నిబంధనల్ని వ్యతిరేకిస్తూ తమ అసెంబ్లీల్లో తీర్మానం ఆమోదించి, కేంద్రానికి పంపాలని కూడా ఈ సందర్భంగా స్టాలిన్ ఆయా సీఎంలకు విజ్ఞప్తి చేశారు.

అమిత్ షాపై ఆరోపణల కేసులో రాహుల్‌కు ఊరట

న్యూఢిల్లీ, జనవరి 20: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సోమవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనపై ఝార్ఖండ్ కోర్టులో నమోదైన పరువు నష్టం దావాపై విచారణ కొనసాగకుండా స్టే విధించింది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చాయిబాసాలో రాహుల్ ప్రసంగిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను హంతకుడని విమర్శించారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై నవీన్ ఝా అనే బీజేపీ కార్యకర్త రాంచీ మేజిస్ట్రేటు కోర్టులో పరువు నష్టం దావా వేశారు. దీనిపై రాహుల్ ఝార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ ఉత్తర్వులు ఇచ్చింది. కేసును కొట్టివేయడానికి మాత్రం నిరాకరించింది. మళ్లీ సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా మొత్తం విచారణపై స్టే విధించింది. రాహుల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపిస్తూ వ్యాఖ్యల కారణంగా నేరుగా బాధపడ్డవారే పరువు నష్టం దావాలు వేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు.

గతేడాది హైదరాబాద్‌లో 76,613 ఇళ్ల రిజిస్ట్రేషన్

న్యూఢిల్లీ, జనవరి 20: హైదరాబాద్‌లో ఇళ్లకు గిరాకీ పుంజుకుంటోంది. 2023 సంవత్సరంలో రిజిస్టర్ అయిన ఇళ్ల సంఖ్య 71,912 ఉండగా.. 2024లో వీటి సంఖ్య 7 శాతం పెరిగి 76,613 ఇళ్లకు చేరుకుంది. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా సోమవారం వెల్లడించింది. 2023లో రిజిస్టర్ అయిన ఇళ్ల మొత్తం విలువ రూ.38,395 కోట్లు ఉండగా.. 2024లో రిజిస్టర్ అయిన ఇళ్ల విలువ 23 శాతం మేర పెరిగి రూ.47,173 కోట్లకు చేరుకుంది. గత ఏడాదిలోని మొత్తం రిజిస్ట్రేషన్లలో దాదాపు 90 శాతం వాటా నివాస గృహాల విభాగానిదే. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు హైదరాబాద్ మార్కెట్ పరిధిలోకి వస్తాయి. కొనుగోలుదారుల ప్రాధాన్యతల్లో చెప్పుకోదగిన మార్పు కనిపించిందని నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్ శిశిర్ బైజల్ తెలిపారు.2023లో రిజిస్ట్రేషన్లలో రూ.50 లక్షలకన్నా తక్కువ ధర కలిగిన ఇళ్ల వాటా 68 శాతం ఉండగా..2024లో 60 శాతానికి తగ్గిందని తెలిపారు. అయితే రూ.50 లక్షలకన్నా ఎక్కువ విలువ కలిగిన ప్రాపర్టీల వాటా 32 శాతం నుంచి 40 శాతానికి పెరిగిందన్నారు.

10లక్షల టన్నుల చక్కెర ఎగుమతికి కేంద్రం ఓకే

న్యూఢిల్లీ, జనవరి 20: వచ్చే సెప్టెంబరు నాటికి 10 లక్షల టన్నుల చక్కెరను ఎగుమతి చేసేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నిర్ణయం 5 లక్షల చెరుకు సాగుదారులకు ప్రయోజనకరంగా ఉంటుందని, ధరల స్థిరత్వానికి తోడ్పతుందని తద్వారా ఆ రంగం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఎగుమతులకు అనుమతి ఇవ్వడం ద్వారా చెరుకు రైతులకు సకాలంలో చెల్లింపు జరుగుతాయని చెప్పారు. మరోవైపు, దేశంలో వంట నూనెల వినియోగాన్ని అంచనా వేయడానికి మొదటి సారిగా కేంద్ర ప్రభుత్వం ఓ సర్వేను ప్రారంభించింది. ఫిబ్రవరి 23 వరకు ఈ సర్వే జరుగనుంది. ఏ రకమైన వంట నూనెలను ఎంత పరిమాణంలో ప్రజలు వినియోగిస్తున్నారో సర్వేలో తెలుసుకోనున్నారు.

గోమూత్రంతో జబ్బులు మాయం అవుతాయన్న ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వ్యాఖ్యలపై దుమారం

చెన్నై, జనవరి 20: గోమూత్రానికి వ్యాధులను నయం చేసే శక్తి ఉందంటూ ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి కామకోటి ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఒక ప్రొఫెసర్ ఇలా మూఢనమ్మకాలను ప్రచారం చేస్తారా... అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఓ వీడియోలో మాట్లాడిన కామకోటి.. తనకు తెలిసిన ఒక సాధువు గోమూత్రం సేవించడం ద్వారా తనకు 15 నిమిషాల్లోనే తీవ్రమైన జ్వరం తగ్గిపోయిందని చెప్పాడని, దీనిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రొఫెసర్ కామకోటి మూఢనమ్మకాలను ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం విమర్శించారు. కాగా.. ఈ విమర్శలపై కామకోటి స్పందించారు. 'గోమూత్రంలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, కడుపులో మంటను నివారించే గుణాలు ఉన్నాయని శాస్త్రీయంగా నిరూపితమైందని వెల్లడించారు.



బైక్‌లపై అత్యంత ఎత్తయిన మానవ పిరమిడ్

- ప్రపంచ రికార్డు సృష్టించిన భారత ఆర్మీ డేర్‌డెవిల్స్ జట్టు

న్యూఢిల్లీ, జనవరి 20: ద్విచక్ర వాహనాలపై అత్యంత ఎత్తయిన మానవ పిరమిడ్ ఆకృతిని ఏర్పరచి భారత ఆర్మీ డేర్‌డెవిల్స్ జట్టు రికార్డు సృష్టించింది. ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో 40 మంది సభ్యులు గల డేర్‌డెవిల్స్ జట్టు 9 బైక్‌ల సాయంతో 20.4 అడుగుల ఎత్తున మానవ పిరమిడ్‌ను ఏర్పరచింది. అంతేకాకుండా అదే ఆకృతిలో నిలబడి భారత జెండాను ఎగురవేస్తూ విజయ్‌చౌక్ నుంచి ఇండియా గేట్ వరకు దాదాపు 2 కిలోమీటర్ల మేర ప్రయాణించింది. ఈ ప్రదర్శనతో భారత ఆర్మీ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు గిన్నిస్ బుక్, ఆసియా బుక్, లిమ్కాతో పాటు మొత్తం 33 ప్రపంచ రికార్డులను డేర్‌డెవిల్స్ జట్టు నమోదు చేసింది.

ప్రియుడి హత్య కేసులో యువతికి మరణశిక్ష

- కేరళ కోర్టు సంచలన తీర్పు
- 2022లో ప్రియుడికి విషమిచ్చి హత్య చేసిన 24 ఏళ్ల నిందితురాలు



షారోన్ రాజ్, గ్రీష్మ

తిరువనంతపురం, జనవరి 20: ప్రియుడికి ఆయుర్వేద టానిక్‌లో విషమిచ్చి హత్య చేసిన కేసులో కేరళలోని స్థానిక కోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. రెండేళ్ల క్రితం చోటుచేసుకున్న ఈ కేసులో దోషిగా తేలిన గ్రీష్మ (24)కు మరణక్ష శిక్ష విధించింది. హత్య కేసుకు సంబంధించి సాక్ష్యాలను నాశనం చేసిన ఆమె బంధువు ఒకరికి మూడేళ్ల జైలుశిక్ష విధించింది. అయితే ఈ కేసులో మరో నిందితురాలిగా ఉన్న గ్రీష్మ తల్లికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేనందున ఆమెను నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసుపై విచారణ జరిపిన నెయ్యాట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు.. గత వారం గ్రీష్మను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. పాల్పడిన నేరం తీవ్రత కంటే నిందితురాలి వయసును పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. చదువులో సాధించిన విజయాలు, గతంలో నేర చరిత్ర లేకపోవడం, తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కూతురు అయినందున.. శిక్ష విధింపులో కొంత దయ చూపాలని నిందితురాలు కోరింది. కాగా, కేరళలో మరణ శిక్ష ఎదుర్కొంటున్న అతి పిన్న వయస్కురాలు గ్రీష్మనే కావడం గమనార్హం. షారోన్ రాజ్, గ్రీష్మ ఇద్దరు గతంలో ప్రేమించుకొనే వారు. అయితే గ్రీష్మకు తమిళనాడుకు చెందిన ఓ ఆర్మీ వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య బంధాన్ని ముగిద్దామన్న గ్రీష్మ ప్రతిపాదనకు రాజ్ తిరస్కరించడంతో.. 2022లో ఆయుర్వేద టానిక్‌లో పారాక్వాట్ అనే కలుపు మందును కలిపి ఇచ్చింది. 11 రోజుల తర్వాత పలు ఆవయవాల వైఫల్యంతో షారోన్ మరణించాడు.

'అభయ' హంతకుడికి.. జీవిత ఖైదు!

మరణించేదాకా కారాగార శిక్ష.. సియాల్దా కోర్టు తీర్పు



కోల్‌కతా, జనవరి 20: జూనియర్ వైద్యురాలు 'అభయ'పై హత్యాచారం కేసులో దోషిగా నిర్ధారణ అయిన సంజయ్‌రాయ్‌కు మరణించేవరకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. రూ.50 వేల జరిమానా కూడా వేసింది. ఆమె తల్లిదండ్రులకు రూ.17 లక్షలు పరిహారంగా చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల-ఆస్పత్రిలో పనిచేసే అభయ (31) నిరుడు ఆగస్టు 9న ఆస్పత్రిలో ఆన్ డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వర్తించి రాత్రి సెమినార్ హాల్‌లో నిద్రిస్తుండగా.. సంజయ్ రాయ్ ఆమెపై అత్యాచారం చేసి, అనంతరం గొంతు పిసికి హత్య చేశాడు. సమీప పోలీసు స్టేషన్‌లో సివిక్ వలంటీరుగా పనిచేసే అతడిని బందోబస్తు కోసం ఆ ఆస్పత్రిలో నియమించగా ఈ దారుణానికి పాల్పడ్డాడు. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. పశ్చిమ బెంగాల్ పోలీసుల దర్యాప్తుపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో, కేసు దర్యాప్తును సుప్రీంకోర్టు సీబీఐకి అప్పగించింది. రాయ్‌పై భారత న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)లోని 64(అత్యాచారం), 66(మరణానికి కారణమవడం), 103(1)(హత్య) సెక్షన్ల కింద కేసు నమోదైంది. బెంగాల్ పోలీసుల నుంచి దర్యాప్తు బాధ్యతలు చేపట్టిన సీబీఐ.. హతురాలి శరీరంపై గాయాలు, సంఘటనాస్థలిలో రాయ్‌కు చెందిన వస్తువులు ఉండడం, బయలాజికల్ సాక్ష్యం ఆధారంగా అతడి పాత్రను నిరూపించింది. సియాల్దా అదనపు జిల్లా-సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ 162 రోజులు రహస్య విచారణ జరిపి అతడిని నేరస్థుడిగా నిర్ధారించి సోమవారం తన తీర్పు వెలువరించారు. మరణ శిక్ష విధించకపోవడాన్ని సమర్థించుకున్నారు. 'ఉరిశిక్ష విధించాలని సీబీఐ అభ్యర్థించింది. కానీ, రాయ్ చేసిన నేరం.. అత్యంత అరుదైన నేరాల కేటగిరీలోకి రాదు' అని న్యాయాధికారి తెలిపారు. 'ఆస్పత్రిలో విధుల్లో ఉండగా చనిపోయినందున.. హతురాలి తల్లిదండ్రులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉంది. మరణానికి రూ.10 లక్షలు, అత్యాచారానికి రూ.7 లక్షల చొప్పున చెల్లించాలి' అని ఆదేశించారు. ఈ తీర్పుపై కలకత్తా హైకోర్టు ముందు అప్పీలు చేసుకునే హక్కు రాయ్‌కు ఉందని ఆయన తెలిపారు. కాగా, తాను నిర్దోషినని సంజయ్ కోర్టుకు తెలిపాడు. 'నన్ను ఇరికిస్తున్నారు. ఎలాంటి నేరమూ నేను చేయలేదు. నన్ను హింసించారు. వారు (సీబీఐ) కావాలనుకున్నట్లు సంతకాలు చేయించుకున్నారు. చాలా సాక్ష్యాలను ధ్వంసం చేశారు' అని న్యాయాధికారిని ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. కోర్టు తీర్పు విన్న అనంతరం.. కోర్టు హాలులోనే ఉన్న అభయ తల్లిదండ్రులు న్యాయాధికారికి చేతులు జోడించి నమస్కరిస్తూ.. తమకు పరిహారం అక్కర్లేదని, న్యాయం కావాలని కోరారు.

తీర్పుపై సంతృప్తిగా లేం: మమత

వైద్యురాలి హత్యాచారం కేసులో తీర్పు తమకు సంతృప్తినివ్వలేదని బెంగాల్ సీఎం మమత వ్యాఖ్యానించారు. 'దోషికి మరణశిక్ష విధించాలని తొలి నుంచీ మేం డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికీ మా డిమాండ్ అదే. అయితే ఇది కోర్టు తీర్పు. మా పార్టీ టీఎంసీ అభిప్రాయం చెబుతున్నాను. ఈ దర్యాప్తును మేమే చేపట్టి ఉంటే 60 రోజుల్లో మూడు కేసుల్లోనూ మరణదండన పడేలా చూసేవాళ్లం. ఎప్పుడో మరణ దండన విధించేలా చేసే వాళ్లం. తీర్పుపై నేను సంతృప్తి చెందలేదు' అని చెప్పారు. మరోవైపు, అభయ కేసులో కోర్టు తీర్పు.. న్యాయాన్ని అపహాస్యం చేసేలా ఉందని బీజేపీ వ్యాఖ్యానించింది. 'నిందితులను కాపాడే పనిని సీఎం మమత మానుకోవాలి. ఈ కేసులో ఆధారాలను ధ్వంసం చేయడంలో ఆమెతో పాటు కోల్‌కతా కమిషనర్ పాత్రపైనా దర్యాప్తు జరగాలి' అని బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ అన్నారు. జూనియర్ డాక్టర్లు సైతం.. ఈ కేసులో ఇంకా దర్యాప్తు సాగించాలన్నారు. దీనివెనుక భారీ కుట్ర ఉందని అభయ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నందున ఇది జరగాలని స్పష్టంచేశారు.

ఇది అత్యంత అరుదైన నేరం కాదా?

తమ కుమార్తె హత్యాచారం కేసులో తమకు పరిహారం అక్కర్లేదని, న్యాయం మాత్రమే కావాలని అభయ తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. ఉరిశిక్ష కాకుండా.. మరణించేదాకా రాయ్ జైల్లో ఉండాలని, తమకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కోర్టు ఇచ్చిన తీర్పుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయం కోసం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. ఈ కేసులో నిరాసక్తంగా దర్యాప్తు చేశారని.. ఇతర నిందితులను కాపాడారని ఆరోపించారు. 'ఈ నేరం వెనుక భారీ కుట్ర ఉంది' అని అభయ తల్లి అన్నారు. తమకెలాంటి పరిహారమూ వద్దని తండ్రి స్పష్టంచేశారు.

తల్లి వద్దే అతుల్ కుమారుడు!

- బెంగళూరు టెకీ కుమారుడి ఆలనాపాలనపై సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 20: భార్య, ఆమె పుట్టింటివారి వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడిన బెంగళూరు టెకీ అతుల్ సుభాష్(34) నాలుగేళ్ల వయసున్న కుమారుడు తల్లి నిఖిత సింఘానియా వద్దే ఉంటాడని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆ బాలుడిని తమకు అప్పగించాలని కోరుతూ అతుల్ తల్లి అంజూదేవి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం వీడియో లింకు ద్వారా ఆ చిన్నారితో మాట్లాడిన అనంతరం సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. బాలుడు ఇప్పటి వరకు నానమ్మ వద్ద కొద్దిసేపైనా గడపలేదని కోర్టు గుర్తించింది. బాలుడికి పిటిషనర్(అంజూదేవి) ఎవరో అసలు తెలియదు కనుక.. ఆమెకు బాలుడిని అప్పగించలేమని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

ఫోన్ చార్జింగ్ తక్కువగా ఉంటే.. ఉబెర్ చార్జీల బాదుడు!

- ఢిల్లీ ఆంత్రప్రెనర్ ప్రయోగంలో వెల్లడి
- రెండు ఆండ్రాయిడ్, రెండు ఐఫోన్లలో ఒకేసారి ఉబెర్ ద్వారా క్యాబ్ బుకింగ్
- బ్యాటరీ తక్కువగా ఉంటే ఎక్కువ ధర

న్యూఢిల్లీ, జనవరి 20: ఉబెర్, ఓలా, జెప్టో, బ్లింకిట్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ఆధారిత యాప్‌లు.. వినియోగదారులు వాడే ఫోన్లు, వాటి ఖరీదు ఆధారంగా వస్తు/సేవల ధరలను నిర్ణయిస్తున్నాయన్న ఆరోపణలు చాలాకాలంగానే ఉన్నాయి! తాజాగా ఢిల్లీకి చెందిన రిషబ్‌సింగ్ అనే ఔత్సాహిక పారిశ్రామికవేత్త.. ఫోన్ మోడల్‌తోపాటు, మన ఫోన్‌లో ఉన్న బ్యాటరీ శాతం ఆధారంగా కూడా ఉబెర్ ప్రైసింగ్ విధానం మారిపోతోందని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. టెక్ ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించి 'ఇంజనీర్‌హబ్' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను స్థాపించిన రిషబ్‌సింగ్.. ఉబెర్ ధరల విధానంపై ఒక ప్రయోగం చేశారు. అందులో భాగంగా రెండు ఆండ్రాయిడ్ ఫోన్లు, రెండు ఐఫోన్లలో ఒకే అకౌంట్ ద్వారా, ఒకే చోటు నుంచి, ఒకే సమయంలో ఉబెర్‌లోకి లాగిన్ అయ్యారు. ఫోన్ ప్లాట్‌ఫామ్‌ను (అది ఆండ్రాయిడా, ఐఫోనా అనేదాని) బట్టి 13 నుంచి 50 శాతం దాకా డిస్కౌంట్లు వచ్చాయని.. అంతేకాక, బ్యాటరీ శాతం తక్కువగా ఉన్న ఫోన్లలో ఎక్కువ ధరలు కనిపించాయని ఆయన తన వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. తన ప్రయోగానికి సంబంధించిన ఫొటోను కూడా షేర్ చేశారాయన. అందులో నాలుగు ఫోన్లలో నాలుగు రకాల ధరలు కనిపించడం గమనార్హం. బ్యాటరీ సమాచారం ఆధారంగా ఉబెర్ ప్రైసింగ్ అల్గారిథమ్ వినియోగదారుల అత్యవసర పరిస్థితిని సొమ్ము చేసుకుంటోందని మండిపడ్డారు. ఉబెర్, ఓలా వంటి యాప్‌లు తమ ఫోన్ ప్లాట్‌ఫామ్, బ్యాటరీ స్థాయుల ఆధారంగా ధరలు నిర్ణయిస్తున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని రిషబ్‌సింగ్ అభిప్రాయపడ్డారు.

లోకం తీరు



మద్యం కంపెనీలకు కిక్కు!

(మొదటి పేజీ తరువాయి)

అధికారితోపాటు సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ సభ్యులుగా ఉన్నారు. మద్యం తయారీదారులకు చెల్లించాల్సిన ధరల పెంపుపై ఈ కమిటీ గత ఆరు నెలలుగా అధ్యయనం చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 51 మద్యం తయారీ కంపెనీలు ఉండగా.. త్రిసభ్య కమిటీ పలుమార్లు మద్యం తయారీదారులతో సమావేశమైంది. మద్యం ధరలపై వారి సూచనలు స్వీకరించింది.

చివరిసారిగా మూడేళ్ల క్రితం గత ప్రభుత్వం మద్యం తయారీదారులకు చెల్లించే మొత్తాన్ని 6శాతం పెంచింది. అయితే అప్పటితో పోలిస్తే.. ప్రస్తుతం పెరిగిన ముడిసరుకు ధరలు, ఉద్యోగుల జీతభత్యాలు, రవాణా.. ఇలా అన్ని ఖర్చులను కమిటీ సేకరించింది. ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన ధరలు పెంచకపోవడంతో నష్టాలు వస్తున్నాయనంటూ బీర్ల తయారీ కంపెనీ (యూబీ) ఈ నెల 8 నుంచి బీర్ల ఉత్పత్తులను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇతర మద్యం తయారీ కంపెనీలు సైతం ధరలు పెంచాలంటూ కొద్ది నెలలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. యూబీ నిర్ణయం తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్సైజ్ శాఖపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి.. పక్క రాష్ట్రాల మద్యం ధరలను అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా అధ్యయనం చేసిన త్రిసభ్య కమిటీ ఆ నివేదికను టీజీబీసీఎల్‌కు సమర్పించింది.

దిగొచ్చిన బీర్ల కంపెనీ!

(మొదటి పేజీ తరువాయి)



సోమవారం సమాచారమిచ్చింది. యూబీ కంపెనీ బీర్ల ఉత్పత్తిని నిలిపివేసినా ప్రభుత్వం పెద్దగా స్పందించకపోవడం, పైగా రాష్ట్రంలో బీర్లకు కొరత ఏర్పడకుండా కొత్త మద్యం కంపెనీలకు అవకాశం ఇవ్వాలని ఆదేశించడంతో యూబీ కంపెనీ పునరాలోచనలో పడింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో తీవ్రపోటీని ఎదుర్కొంటున్న నేపథ్యంలో తెలంగాణలో కొత్త కంపెనీలొస్తే బీర్ల విక్రయాల్లో పరంగా తమకున్న మెజారిటీ వాటా పడిపోతుందని ఆందోళన చెందే యూబీ ఈ నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. 2019 నుంచి బీర్ల తయారీదారులకు ప్రభుత్వం చెల్లించే ధరను పెంచలేదని, ఫలితంగా నిర్వహణ వ్యయం భారీగా పెరిగిందని, అలాగే రూ. 659 కోట్ల బకాయిలు చెల్లించడంలో సర్కారు జాప్యం చేస్తోందని ఈనెల 8న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు యూబీ తెలిపింది. అదేరోజు.. తెలంగాణలో బీర్ల ఉత్పత్తిని వెంటనే నిలిపివేస్తున్నట్లూ సమాచారమిచ్చింది. రాష్ట్రంలోని మొత్తం బీర్ల విక్రయాల్లో యూబీ కంపెనీ వాటా 70శాతం! బీరు ప్రియులు అమితంగా ఇష్టపడే కింగ్‌ఫిషర్ బీర్లు ఉత్పత్తిచేసేది ఈ సంస్థే. అయితే.. బీర్ల ఉత్పత్తిని యూబీ నిలిపివేసినా తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) వద్ద మరో 20 రోజులకు సరిపడా యూబీ బీర్ల నిల్వలు ఉండటం, ఫలితంగా బీరు ప్రియులకు ఇబ్బందులు కలిగే అవకాశాలు పెద్దగా లేకపోవడంతో ఈ విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించింది. బీర్ల ఉత్పత్తిని నిలిపివేస్తున్నట్లుగా యూబీ ప్రకటించిన తర్వాత ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆ శాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. విడతలవారీగా బకాయిలు చెల్లించాలని అధికారులను ఆదేశిస్తూనే.. బీర్ల తయారీ దారులకు చెల్లించే ధర పెంపుపై కంపెనీల ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీర్లకు కొరత ఏర్పడకుండా కొత్త కంపెనీలకు అవకాశం ఇవ్వాలని, నెలరోజుల్లో కొత్త బ్రాండ్ల ఉత్పత్తి ప్రారంభించాలనీ ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయంతో యూబీ అప్రమత్తమైంది. సీఎం సమీక్ష అనంతరం యూబీ కూడా తన నిర్ణయంపై సమీక్షించింది. ఉత్పత్తి నిలిపేస్తే ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుందని, తమ డిమాండ్లను సర్కారు వెంటనే ఆమోదిస్తుందని భావించిన కంపెనీ అంచనాలు తలకిందులయ్యాయి. రాష్ట్రంలో 70శాతం వాటాను కోల్పోతే, మొత్తం వ్యాపారంపైనే తీవ్ర ప్రభావం పడుతుందని కంపెనీ భావించింది. తెలంగాణ మెజారిటీ వాటా ఉన్న కంపెనీ.. ఇతర రాష్ట్రాల్లో మాత్రం బీర్ల విక్రయాల్లో తీవ్ర పోటీ ఎదుర్కొంటోంది. గతంలో అనేక రాష్ట్రాల్లో మెజారిటీ వాటా ఉన్నప్పటికీ.. క్రమక్రమంగా ఇతర కంపెనీలతో పోటీ పెరగటంతో యూబీ మార్కెట్ షేర్ భారీగా తగ్గింది. మెట్టు దిగకపోతే తెలంగాణలోనూ ఇలాంటి పరిస్థితే రావచ్చునని ఆందోళన చెందిన కంపెనీ, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు దిగింది. కంపెనీ ఉన్నతస్థాయి ప్రతినిధులు ఎక్సైజ్ శాఖ మంత్రితోపాటు టీజీబీసీఎల్ ఉన్నతాధికారులతో ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు. అప్పటికే ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలను కంపెనీ ప్రతినిధులకు ఉన్నతాధికారులు వివరించారు. బకాయిలు విడతలవారీగా చెల్లిస్తామని, ఉత్పత్తి నిలిపేయాలన్న నిర్ణయాన్ని సమీక్షించాలని కోరారు. ఆలస్యం చేస్తే అసలుకే మోసం వస్తుందని గ్రహించిన కంపెనీ.. ఉత్పత్తిని ప్రారంభించాలని నిర్ణయించింది. తాజా నిర్ణయంతో రాష్ట్రంలో బీర్ల కొరత తీరనుంది. రానున్న వేసవికి సరిపడా బీర్ల ఉత్పత్తికి టీజీబీసీఎల్ ప్రణాళికలు అమలుచేస్తోంది.

అప్పులు తీర్చలేక ఇద్దరు రైతుల ఆత్మహత్య

మానవపాడు, దోమ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు సరిగా పండక, ఆ అప్పులు తీర్చే మార్గం కనిపించక గద్వాల, వికారాబాద్ జిల్లాల్లో ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రానికి చెందిన రైతు బొంకూర్ చంద్రశేఖర్‌రెడ్డి (32) వ్యవసాయం కోసం బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. రెండేళ్లుగా పంటల దిగుబడి రాకపోవడంతో అప్పుల భారం పెరిగిపోయి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ తరుణంలో సోమవారం ఉదయం పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ఘటనలో... వికారాబాద్ జిల్లా దోమ మండలం అయినాపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి యాదయ్య (35) బ్యాంకులోను, ప్రైవేటు వ్యక్తుల వద్ద రుణాలు తీసుకుని నాలుగు బోర్లు వేసి, పంటలు సాగు చేశాడు. దిగుబడి సరిగా రాకపోవడంతో అప్పులు తీర్చలేక తమ పొలంలో ఉరేసుకున్నాడు.

మరింత నాణ్యంగా తిరుమల లడ్డూ!

» రిలయన్స్ రిటైల్స్ సంస్థతో టీటీడీ ఒప్పందం

తిరుమల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు ఎంతో పవిత్రంగా స్వీకరించే లడ్డూ ప్రసాదాన్ని మరింత నాణ్యంగా అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ముడిసరుకుల ఎంపికలో అనుభవం కలిగిన రిలయన్స్ రిటైల్స్ సంస్థ ఇచ్చే సూచనల మేరకు నాణ్యమైన ముడిసరుకులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఆ మేరకు రిలయన్స్ సంస్థతో టీటీడీ ఒప్పందం కుదుర్చుకుంది. ముడిసరుకుల ఎంపికలో అనుభవం కలిగిన రిలయన్స్ సంస్థ ఈ విషయంలో ఫ్రీ సర్వీస్ కింద ముందుకు రాగా, గత నవంబరులో టీటీడీ ఎంవోయూ చేసుకుంది. ముడిసరుకుల కొనుగోళ్లను చివరిదశలో ఎంపిక చేసేందుకు ప్రత్యేక నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. కాగా, పది రోజులపాటు తిరుమలలో జరిగిన వైకుంఠ ద్వార దర్శనాలు ఆదివారం అర్ధరాత్రితో ముగిశాయి. దీంతో సోమవారం వేకువజాము నుంచి భక్తులకు సాధారణ దర్శనాలు మొదలయ్యాయి.

కాకినాడ పోర్టు డీల్ 'రివర్స్'!

» వాటాలను కేవీరావుకు తిరిగిచ్చేసిన అరబిందో

» సెజ్‌ను మరిచిపోవాలంటూ కేవీరావుకు షరతు

» దీనికి బదులుగా పోర్టులో వాటాల బదిలీ

కాకినాడ (ఆంధ్రజ్యోతి): 'కాకినాడ సీ పోర్టు' మళ్లీ అసలు యజమాని కేవీ రావుకు దక్కింది. వైసీపీ హయాంలో బలవంతంగా వాటాల బదిలీ... కూటమి సర్కారు వచ్చాక దీనిపై సీఐడీకి కేవీరావు ఫిర్యాదు... ఆపై ఈడీ కూడా రంగంలోకి దిగిన సమయంలో విషయం కీలక మలుపు తిరిగింది. కేవీ రావు నుంచి బలవంతంగా లాక్కున్న వాటాలను 'అరబిందో' సంస్థ తిరిగి ఆయనకే అప్పగించింది. రెండు రోజుల కిందట వాటాల బదిలీ పూర్తయినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కాకినాడ పోర్టులో మనీలాండరింగ్‌పై ఈడీ ఆరా తీస్తుండటం... అరబిందో ప్రతిష్ఠ దెబ్బతినే పరిస్థితి తలెత్తడం... తీగలాగితే భారీగా డొంక కదిలే పరిస్థితి ఉండటంతో కాకినాడ సీపోర్ట్ డీల్ 'రివర్స్' అయ్యింది. పైస్థాయి వ్యక్తులు కొందరు రంగంలోకి దిగి.. ఇద్దరినీ కూర్చోబెట్టి కొత్త 'డీల్'కు ఓకే చెప్పించారు. అప్పట్లో... రూ.2500 కోట్ల విలువైన 2.15 కోట్ల షేర్లను జగన్ బ్యాచ్ రూ.494 కోట్లకే లాగేసుకుందని కేవీ రావు ఆరోపించారు. దీనిపై సీఐడీకి కూడా ఫిర్యాదు చేశారు. అదే సమయంలో కేవీరావుకు చెందిన... 8వేల ఎకరాలున్న కాకినాడ సెజ్ పూర్తిగా అరబిందోకు సొంతమైంది. తాజాగా... 'కాకినాడ సెజ్ గురించి మరిచిపోండి. అది అరబిందోకే! పోర్టులో మీ నుంచి తీసుకున్న వాటాలు మీకే వచ్చేస్తాయి" అని డీల్ కుదిరింది. దీని ప్రకారం... మూడురోజుల కిందట అరబిందో పేరుతో ఉన్న 2.15 కోట్ల షేర్లు కేవీరావుకు బదిలీ అయిపోయాయి. దీనికి సంబంధించి అప్పట్లో తనకు చెల్లించిన డబ్బులను కేవీ రావు అరబిందోకు తిరిగి ఇచ్చేసినట్లు తెలిసింది. దీంతో... కాకినాడ పోర్టు ఇప్పుడు పూర్తిగా కేవీరావు వశమైంది. ఇక... కాకినాడ సెజ్‌లో తన వాటాగా రూ.1104కోట్లు రావలసి ఉండగా, రూ.12 కోట్లతో సరిపెట్టారని కేవీరావు సీఐడీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోర్టు వాటాలను తిరిగి ఇచ్చేసినందున... ఇక సెజ్ గురించి మరిచిపోయేలా డీల్ కుదిరినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలుస్తోంది. అయితే... కేవీరావు మాత్రం, సెజ్‌లో తన వాటాలను వదులుకునేది లేదని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త పాలనలోకి...


అమెరికా అధ్యక్షుడుగా ప్రమాణం చేసిన డోనాల్డ్ ట్రంప్ ఓ వంద ఆదేశాలతో మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తన పాలనలో తీసుకున్న పలునిర్ణయాలను తిరగదోడబోతున్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలకు అనుగుణంగానూ, ఇంధనం, పర్యావరణమార్పు, వలసలు, పరిపాలన ఇత్యాది అంశాలతోనూ ముడిపడిన ఈ ఆదేశాలకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం అవసరం లేదు. మరోపక్క, తాను అధికారంలోకి రాగానే శత్రుసంహారం తథ్యమని, తనకు వ్యతిరేకంగా వ్యవహరించినవారి సంగతితేల్చేస్తానని కొత్త అధ్యక్షుడు ప్రకటించిన నేపథ్యంలో, పదవిదిగే కొద్దిగంటల ముందు కూడా జోబైడెన్ తన విశేషాధికారాలను వినియోగించి ట్రంప్ వ్యతిరేకులు కొందరికి ముందస్తు క్షమాభిక్షలు ప్రకటించారు. కొవిడ్ కల్లోలకాలంలో అధ్యక్షుడు ట్రంప్‌కు వ్యతిరేకంగా నిలబడిన అంటువ్యాధుల నిపుణుడు ఆంటోనీ ఫౌచీ వీరిలో ఒకరు. అజ్ఞానంతోనో, అహంకారంతోనో కరోనాకాలంలో ట్రంప్ చేసిన పలువ్యాఖ్యలు, ప్రతిపాదనలకు బుద్ధిగా తలాడించకుండా ధైర్యంగా ఎదురునిలిచి, ట్రంప్ వ్యతిరేకశక్తులకు ఈయన కేంద్రబిందువైన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రతీకారంనుంచి బైడెన్ ముందస్తుభద్రతను ప్రసాదించిన వారిలో క్యాపిటల్‌హిల్ దాడులపై విచారణ జరిపిన హౌస్ కమిటీ సభ్యులు, వారిముందు సాక్ష్యం చెప్పిన కొందరు అధికారులు కూడా ఉన్నారు. కొత్త అధ్యక్షుడి మలిరాకడను మిగతాప్రపంచం కూడా అమితాసక్తితో, భయభక్తులతో గమనిస్తోంది.

ట్రంప్ ఏలుబడిలో అమెరికాకు అపారమైన నష్టం జరగబోతున్నదని, కుబేరులు, కులీనులు కట్టగట్టుకొని దేశాన్ని దోచేసుకుంటారని బైడెన్ తన వీడ్కోలు ప్రసంగంలో చాలా హెచ్చరికలే చేశారు. అమెరికాలో సామ్రాజ్యవాదం రూపుదిద్దుకుంటోందని, అతికొద్దిమంది కుబేరుల చేతుల్లోకి అధికారం పోయి, ఏ మాత్రం జవాబుదారీతనం లేని పాలనలో సామాన్య జనం గోసపడతారని ఆయన మాచెడ్డ బాధపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో అసత్యకథనాలను వండివారుస్తారని, అమెరికా ప్రజలు తప్పుడుప్రచారాలకు బలి కావాల్సివస్తుందని, పత్రికాస్వేచ్ఛ క్షీణిస్తుందని హెచ్చరించారు. అడ్డుపడడం, ప్రశ్నించడం మరిచిపోకండన్న ఆయన హితవును అమెరికన్లు చెవినపెడతారో లేదో చూడాలి. ట్రంప్ అరాచకాలనుంచి దేశాన్ని రక్షించగలడని, మరోమారు డెమోక్రాటిక్ పార్టీని విజయపథంలో నడిపించగలడనీ నాలుగేళ్ళక్రితం జనం నమ్మి ఓటేసిన బైడెన్ ఇప్పుడు బలహీనుడుగా ముద్రపడి నిష్క్రమించాల్సి వస్తున్నది. ట్రంప్ పునరాగమనం ఒక సునామీ లాగా ఉంటుందని ఈయన ఊహించివుండడు. కమలాహ్యారిస్‌ను కాదని తానే పోటీచేసివుంటే అద్భుతంగా గెలిచేవాడినని గొప్పలకు పోతున్న బైడెన్‌కు ట్రంప్‌కు ఈ ఘనవిజయాన్ని చేజేతులా అందించింది తానేనని తెలియకపోదు. సమకాలికులు తనను కాదన్నప్పటికీ, చరిత్ర కచ్చితంగా తనకు జేజేలుపలుకుతుందని బైడెన్ చెప్పుకుంటున్నారు. అమెరికాను ఆయన ఏమేరకు ఉద్ధరించారో అక్కడి ప్రజలకు సంబంధించిన విషయం. కానీ, మిగతా ప్రపంచంతో ముడివడిన వ్యవహారాలమీద కూడా ఆయన తెలివైన నిర్ణయాలు చేసినట్టుగా కనబడదు. అఫ్ఘానిస్థాన్‌ను తాలిబాన్‌కు అప్పగించడం, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపలేకపోవడం, గాజాలో నెతన్యాహూ మారణకాండకు వత్తాసు పలకడం వంటి తప్పుడు పనులు ఆయన ఖాతాలో అనేకం ఉన్నాయి.

భారతదేశానికి సంబంధించినంతవరకూ బైడెన్ తన పదవీకాలంలో సానుకూలంగా ఉన్నమాట వాస్తవం. ట్రంప్‌తో మోదీ ఆలింగనాలు కానీ, ఆయన పక్షాన అమెరికాలో ఎన్నికల ప్రచారాలు కానీ బైడెన్‌ను ప్రభావితం చేయలేదు. ఉభయదేశాల భాగస్వామ్యం మరింత బలపడి విస్తరించింది. అనేక అంతర్జాతీయ కూటముల్లోనూ, వేదికల్లోనూ అమెరికా సరసన భారత్‌కు చోటు దక్కింది. బైడెన్ అంతటి భారత్ అనుకూల అమెరికా అధ్యక్షుడు ఇటీవలి కాలంలో ఎవరూలేరని విశ్లేషకులు అంటారు. అడపాదడపా గిల్లికజ్జాల అనుమానాలు ఉన్నప్పటికీ ట్రంప్ పునరాగమనం భారత్‌కు మేలుచేసేదే. ఎన్నికల ప్రచారంలో అమెరికన్లకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ట్రంప్ వ్యవహరించిన పక్షంలో సుంకాల పోరు, వీసాల బాధలు మనకు తప్పకపోవచ్చును. బైడెన్ మాదిరిగా చైనాతో కక్షగట్టి ట్రంప్ వ్యవహరించకపోవచ్చును కనుక, ఆ ప్రభావం కొంతమేరకు మనమీద పడవచ్చు. భారత్–అమెరికా సంబంధాలు అతివేగంగా అన్ని రంగాలకు విస్తరించి, ఆయుధవ్యాపారం నుంచి ఆలింగనాలవరకూ ఎదిగాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఎవరు పాలకుడైనా భారత్‌ను కాదనగలిగే స్థితిలో ఆ అగ్రరాజ్యం లేదు.

యూజీసీ సంస్కరణల మంచీచెడూ!

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) ఇటీవల యూజీ, పీజీ కోర్సులకు సంబంధించి 'కనీస బోధనా ప్రమాణాల' ముసాయిదా నిబంధనలు –2024ను తీసుకువచ్చింది. విద్యార్థులకు విద్యా సంబంధమైన విషయాల పట్ల మరింత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కల్పించడం, నిబంధనలను సరళతరం చేయడం, ఏకరీతిగల విద్యా ప్రమాణాలు తీసుకు రావడం, దేశీయ ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలతో అనుసంధానం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో ఈ నిబంధనలు రూపొందించారు. భారతదేశంలోని అన్ని రాష్ట్ర, కేంద్ర, ప్రైవేట్, డీమ్డ్ ఉన్నత విద్యా సంస్థలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. దేశీయ ఉన్నత విద్యా సంస్థలు ఏ మేరకు ఈ సంస్కరణలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయో, వాటివల్ల ఒనగూరే ప్రయోజనాలు, సవాళ్ళు ఏమిటో ఇప్పుడు పరిశీలించాల్సి ఉంది.



యూజీసీ ప్రతిపాదించిన ప్రగతిశీల సంస్కరణలు నిస్తేజంగా ఉన్న దేశీయ ఉన్నత విద్యారంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాయనడంలో సందేహం లేదు. అయితే ఉన్నత విద్యలో మౌలిక వసతులను అభివృద్ధి చేయకుండా, అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులను నియమించకుండా, టెక్నాలజీ వినియోగాన్ని పెంచకుండా, పరిశ్రమకు కావలసిన అంతర్జాతీయ ప్రమాణాల కరికులమ్‌ను అభివృద్ధి చేయకుండా, నూతన ఆవిష్కరణలకు దిశానిర్దేశం లేకుండా, ఇటువంటి సంస్కరణలు ఎన్ని తీసుకువచ్చినా తర్వాత సవాళ్లను అధిగమించడం కష్టమవుతుంది.

సమర్థత గల విద్యా సంస్థల కోసం ప్రతిపాదించిన 'ద్వివార్షిక ప్రవేశాలు', విద్యార్థులకు సంవత్సరానికి రెండుసార్లు విద్యాసంస్థలలో ప్రవేశం పొందే అవకాశాన్ని కల్పిస్తాయి. విద్యాసంస్థలలో పరీక్షల ఆలస్యం వలన గాని, వ్యక్తిగత, మరే ఇతర కారణాల వలన గాని ఏ విద్యార్థి అయినా విద్యా సంవత్సర ప్రారంభంలో ప్రవేశం పొందలేకపోతే అలాంటి వారికి ఈ ప్రతిపాదన ఉపయోగపడుతుంది. దేశీయ ఉన్నత విద్యాసంస్థలలోకి విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి, తద్వారా విదేశీమారక ద్రవ్యాన్ని సంపాదించడానికి ఈ చర్య ఉపయోగపడడమే గాక దేశీయ ఉన్నత విద్యా సంస్థలు మెరుగైన గ్లోబల్ ర్యాంకులు సాధించడంలో తోడ్పడుతుంది. అయితే ఉన్నత విద్యా సంస్థలు అందిస్తున్న ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు లేక సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితులలో ఈ విధానం ఏ విధంగానూ ఉపయోగం కాదు అనే విమర్శ కూడా ఉంది. ముఖ్యంగా అధ్యాపకుల పైన మరింత భారం పడే అవకాశం ఉంది.

యూజీసీ ప్రతిపాదించిన 'వికేంద్రిత విద్యార్థి హాజరు విధానం' వల్ల ఉన్నత విద్యా సంస్థలు వారు అందించే ప్రోగ్రాముల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల హాజరు విధానాలు నిర్ణయించుకునే స్వావలంబనను పొందుతాయి. ఈ విధానం వ్యక్తిగత హాజరు కంటే అభ్యాస ఫలితాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచడంలో దోహదపడుతుంది. ఈ ప్రతిపాదన వినూత్నమైన బోధన విధానాలకు వెసులుబాటు కల్పిస్తుంది. అంతేగాక, ఆన్‌లైన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ వంటి ప్రత్యామ్నాయ అభ్యాస పద్ధతులకు పెద్దపీట వేస్తుంది. అయితే, ఈ విధానం వల్ల విద్యా సంస్థల హాజరు విధానాల మధ్య సారూప్యత కొరవడి, విద్యార్థులు, యాజమాన్యాలు, తల్లిదండ్రులు గందరగోళానికి గురయ్యే అవకాశమూ ఉంది. విద్యాసంస్థలు హాజరు విధానాలు అతిసులభతరంగానో లేదా బాగా కఠినంగానో రూపొందించి ఆ విధంగా విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతీసే అవకాశం ఉంది. హాజరుకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థుల అభ్యాసం, క్రమశిక్షణ వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

యూజీసీ ప్రతిపాదిత 'బహుళ ప్రవేశ, నిష్క్రమణ విధానం' విద్యార్థులకు నిర్దిష్ట దశల వద్ద (సర్టిఫికేట్, డిప్లొమా, డిగ్రీ) ఒక ప్రోగ్రామ్ నుంచి నిష్క్రమించే అవకాశాన్ని కల్పించడమే గాక, వారి వ్యక్తిగత, ఆర్థిక, లేదా వృత్తిపరమైన అవసరాలను పూర్తి చేసుకున్న తరువాత కాలంలో తిరిగి ఆయా ప్రోగ్రాముల్లో ప్రవేశించేందుకు కూడా వీలు కల్పిస్తుంది. ఈ విధానం నిరంతర విద్యను ప్రోత్సహిస్తుంది. ఇది ముఖ్యంగా కార్మిక, పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనకరం. అయితే క్రెడిట్ బదిలీల నిర్వహణ, వివరమైన విద్యార్థి సంబంధిత రికార్డులను నిర్వహించడం, పాఠ్యాంశాలు ఏకరీతిని కొనసాగించడం వంటి అంశాలు పాలనా భారాన్ని పెంచుతాయి. గ్యాప్ తరువాత విద్యార్థులను తిరిగి సంఘటితం చేయడం కష్టం కావచ్చు. దీనికి సరిపోయే సరిసమాన కోర్సులు, మరీ ముఖ్యంగా నిష్ణాతులైన అధ్యాపకులను సమకూర్చుకోవడం తలకు మించిన భారం కాగలదు.

'భిన్న వ్యవధులు గల డిగ్రీ, పీజీ ప్రోగ్రాములు' ప్రవేశపెట్టాలన్న యూజీసీ ప్రతిపాదనను ఓ ప్రగతిశీల చర్యగా చెప్పవచ్చును. మూడు నుంచి నాలుగేళ్ళ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు, ఒకటి నుంచి రెండేళ్ళ పీజీ ప్రోగ్రాములను అందించడం ద్వారా, విద్యార్థుల విభిన్న అకడమిక్, ప్రొఫెషనల్, వ్యక్తిగత లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడంలో, విద్యార్థుల విదేశీ కలలను సాకారం చేయడంలో ఉపయోగపడతాయి. అంతేగాక, ఒక సంవత్సరపు పీజీ ప్రోగ్రాములు త్వరగా ఉద్యోగం కావాలనుకునే వారికి ఉపయుక్తంగా ఉంటాయి. ఈ విధానం విద్యార్థులు స్పెషలైజేషన్ ఎంచుకోవడంలో, బహుళశాస్త్ర విద్యాభ్యాసం చేయడంలో, పరిశోధనా అవకాశాలను అందిపుచ్చుకోవడంలో సహాయపడతాయి. అంతేగాక వృత్తి నిపుణులు, పార్ట్ టైం విద్యార్థుల వైవిధ్యమైన అవసరాలు తీర్చడంలో ఈ విధానం ఉపయోగపడుతుంది. అయితే, ఈ భిన్న వ్యవధులు గల డిగ్రీల ఉపయుక్తత ఎంత అన్నదానిపై పలు సందేహాలు ఉన్నాయి. తక్కువ వ్యవధి ప్రోగ్రాములు తక్కువ కఠినంగా కనిపించవచ్చు, ప్రత్యేకంగా ఆర్థిక లేదా వ్యక్తిగత కారణాల వల్ల వాటిని ఎంచుకున్న విద్యార్థులకు నష్టాన్ని కలిగించవచ్చు. భిన్న వ్యవధులు గల డిగ్రీ, పీజీ ప్రోగ్రాములు ప్రారంభించడానికి ముందు తగిన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాల్సి ఉంటుంది. సిలబస్ తయారు చేయడంతో పాటు, క్రెడిట్స్ వ్యవస్థను రూపొందించడం, అధ్యాపకుల పని భారం సర్దుబాటు చేయడం జరగాలి.

ఏ విద్యార్థి అయినా 'ఏక కాలంలో రెండు యూజీ లేదా పీజీ డిగ్రీలు' చదివే సదవకాశాన్ని యూజీసీ ప్రతిపాదించింది. ఈ విధానం బహుళ శాస్త్రాలు, నైపుణ్యాలను కలుపుకుంటూ, విద్యార్థుల జ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచుతుంది. గ్రామీణ, దూర ప్రాంతాల విద్యార్థులకు, పని చేసుకుంటూ చదువుకునే వారికి ఇది అత్యంత ఉపయోగకరం. అయితే, రెండు డిగ్రీలు ఏక కాలంలో చేయడం వల్ల విద్యార్థి ఏ డిగ్రీలోనూ సమగ్రమైన విజ్ఞానాన్ని, కావలసిన నైపుణ్యాన్ని సంపాదించడం సాధ్యంకాకపోవచ్చును. విద్యాసంస్థల నిర్వాహకులకు ఈ విధానం అమలు పెను సవాలుగా మారే ప్రమాదం ఉంది.

ఒక ప్రోగ్రామ్ ప్రధాన సబ్జెక్టులో 50శాతం క్రెడిట్లను సంపాదించడం విద్యార్థులకు తప్పనిసరి చేస్తూ, మిగిలిన క్రెడిట్లను నైపుణ్య కోర్సులు, అప్రెంటిషిప్, శిక్షణ, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడానికి అనుమతించే ఈ యూజీసీ ప్రతిపాదన సరళమైన విద్యా లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ప్రతిపాదన, విభాగ నైపుణ్యంతోపాటు అంతర శాఖా విద్యనూ సమతుల్యం చేస్తూ, విద్యార్థులకు సమగ్రమైన జ్ఞానంతో పాటు, విస్తృత నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు వీలు కల్పిస్తుంది. అయితే, ప్రధాన విభాగంలో క్రెడిట్లను 50 శాతానికి పరిమితం చేయడం, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి వృత్తి రంగాల్లో నైపుణ్యతను తగ్గించే అవకాశం ఉంది. ఇటువంటి సరళమైన విధానాన్ని అమలుచేయడం కోసం మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల శిక్షణ, పరిశ్రమ సహకారంలో గణనీయమైన పెట్టుబడులు అవసరం. విద్యా సంస్థల మధ్య ఏకరీతిన నాణ్యత, ప్రాముఖ్యతను నిర్ధారించడం, క్రెడిట్ బదిలీలను నిర్వహణ, పాఠ్య ప్రణాళిక అనుసంధానం పెనుసవాళ్లుగా మారతాయి.


యూజీసీ ప్రతిపాదించిన ఈ ప్రగతిశీల సంస్కరణలు నిస్తేజంగా ఉన్న దేశీయ ఉన్నత విద్యా రంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తాయనడంలో సందేహం లేదు. అయితే ఉన్నత విద్యలో మౌలిక వసతులను అభివృద్ధి చేయకుండా, అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులను నియమించకుండా, టెక్నాలజీ వినియోగాన్ని పెంచకుండా, పరిశ్రమకు కావలసిన అంతర్జాతీయ ప్రమాణాల కరికులమ్‌ను అభివృద్ధి చేయకుండా, నూతన ఆవిష్కరణలకు దిశానిర్దేశం లేకుండా, ఇటువంటి సంస్కరణలు ఎన్ని తీసుకువచ్చినా తర్వాత సవాళ్ళను అధిగమించడం కష్టమవుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

• **ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు**
మెంబర్ సెక్రటరీ & సీఈఓ
ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్

ప్రజాతంత్ర తెలంగాణతోనే సంగంరెడ్డికి నివాళి

'తెలంగాణ సోదరా తేల్సుకో నీ బతుకు, మోసపడితివా నీవు గోస పడతవు' అంటూ మేల్కొలుపు పాడిన ఆ గొంతుకు సరిగ్గా 92 ఏళ్లు. దోపిడీ, వివక్ష, అణచివేత, అవమానాలకు వ్యతిరేకంగా సాగిన మహత్తర ప్రత్యేక తెలంగాణ పోరాటంలో అగ్రగణ్యుడు సంగంరెడ్డి సత్యనారాయణ. ఓరుగల్లుకు కూతవేటు దూరంలో మూడు చెరువులు, ముప్పయి కుంటలు, మూడు వందల మోటబావులతో అలుగులుబారి అలరారిన ముచ్చర్లలో 1933 జనవరి 21న సంగంరెడ్డి నర్సయ్య, నర్సమ్మ దంపతులకు జన్మించారు. ఊరు పేరే ఆయన ఇంటి పేరుగా స్థిరపడింది. కవిగా, రచయితగా, పాత్రికేయుడిగా, గాయకుడిగా, నాయకుడిగా, ఉద్యమకారుడిగా, శాసనసభ్యుడిగా, మాజీ మంత్రిగా 1952లో నాన్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమ నేతగా, తెలంగాణ తొలిదశ–మలిదశ ఉద్యమాలకు దిక్సూచిగా ఆయన నిలిచారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ, ఆరు సూత్రాల పథకం, పెద్ద మనుషుల ఒప్పందం, వాటి నిరంతర ఉల్లంఘనలు, తెలంగాణ పట్ల వివక్ష, అణచివేత, అవమానాలు, వనరుల దోపిడీ అంతర్గత వలసపాలనతో తెలంగాణ పల్లెలు ఘొల్లుమన్న సందర్భంలో విద్యార్థి నాయకుడిగా చుట్టిన తలపాగా, కాష్టం కాలేంత వరకు తీసేయని నికార్సయిన నేత. ప్రశ్నించిన వారికి జైళ్లు, ప్రతిఘటించిన వారికి ఉరితాళ్లుగా దిగజారిన చోరస్వామ్యంపై ముచ్చర్ల నుంచే సంగంరెడ్డి జంగ్ సైరన్ ఊదారు. కళ్లు తెరవండంటూ కలానికి పదును పెట్టారు. తెలంగాణను, దామోదరం సంజీవయ్య వంటి దళితులను ఈసడించిన నీలం సంజీవరెడ్డి మీద తన కలం గళం ఎక్కుపెట్టారు. 'అయ్యయ్యో రామ రామా –సంజీవరెడ్డి మామా, పాడేంగే పాయిజామా– సంజీవరెడ్డి మామా –బందర్ కే కార్నామా' అంటూ పల్లెపల్లెనా దిక్కులు పిక్కటిల్లే విధంగా ప్రతిఘటన జెండా రెపరెపలాడించారు. తొలిదశ ఉద్యమంలో విద్యార్థుల శరీరాలను తూటాలు తూట్లు పొడుస్తున్నా నిర్లిప్తంగా కూర్చున్న తెలంగాణ కురువృద్ధులను ముల్లుగర్రతో పొడిచి లేపారు సంగంరెడ్డి సత్యనారాయణ.



సంగంరెడ్డి సత్యనారాయణ రాసి పాడిన పాటలు ప్రజలను పోరాటం వైపు ఉరికించాయి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, వివక్ష ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవి. సామాజిక వివక్షను కూడా ఆయన తన గేయాల్లో ఎండగట్టారు.

'రావోయి రావోయి మర్రి చెన్నారెడ్డి, ఇకనైనా రావోయి ఎర్రి చెన్నారెడ్డి' అంటూ సంగంరెడ్డి పాడితే చెన్నై రాజ్‌భవనే కదిలిపోయింది. ఇంద్రారెడ్డి, కేసీఆర్ వంటివారు తెలంగాణ కోసం పార్టీ పెడితే వారికి సంగంరెడ్డి దారిదీపం అయినారు. తెలంగాణ రాష్ట్రసమితి స్థాపకుడిగా, తొలి అధ్యక్షవర్గంలోని నలుగురిలో ఒకడిగా అగ్రభాగాన నడిచారు. కానీ, వ్యక్తుల ప్రవర్తన నచ్చక టీఆర్ఎస్‌కు దూరమైనప్పటికీ ఏ వర్గం వారు సభలు పెట్టినా ఏ ఆందోళన చేపట్టినా శషభిషలు లేకుండా పాల్గొన్నారు. తెలంగాణ కోసం రాజకీయ ఉద్యమానికి సమాంతరంగా సామాజిక ఉద్యమాలు కూడా నడపాలని సంగంరెడ్డి పోరాటం చేశారు. ధోతి విప్పితే, మరో ధోతి లేని; చొక్కా విప్పితే, మరో చొక్కా లేని సంగంరెడ్డి కూడా ఎన్నికల్లో పోటీ చేసే మొనగాడా? అని హయగ్రీవాచారి ఎద్దేవా చేస్తే, కసి పెంచుకుని పోటీచేసి విజయం సాధించారు సత్యనారాయణ.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం... నాటి ఒరిస్సా గవర్నర్ సయ్యద్ ఫజల్ అలీ చైర్మన్‌గా రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేస్తే సంగంరెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. రాబోయే ప్రమాదాన్ని ముందే గ్రహించిన సత్యనారాయణ 'తెలంగాణ సోదరా తేల్సుకో నీ బతుకు, మోసపోతివా నీవు గోస పడతవు' అంటూ హెచ్చరించారు. ఆయన ఊహించినట్లుగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెద్దమనుషుల ఒప్పందాన్ని, ఆరు సూత్రాలను నిర్లజ్జగా ఉల్లంఘించారు.

సంగంరెడ్డి సత్యనారాయణ రాసి పాడిన పాటలు ప్రజలను పోరాటం వైపు ఉరికించాయి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, వివక్ష ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవి. సామాజిక వివక్షను కూడా సత్యనారాయణ తన గేయాల్లో ఎండగట్టారు. 'మా పెంట మీది కోడి మీకు వంటయినప్పుడు, మేము అంటరానోళ్లం ఎట్లయితం?' అని దళిత బహుజనుల వాణిగా ముక్కుసూటిగా ప్రశ్నించారు. వరంగల్‌లో తెలంగాణ సంస్కృతిని, వంటకాలను ఈసడించిన ఆంధ్రా వ్యాపారి రత్తమ్మ హోటల్‌పై ఆయన రాసిన పాట గల్లీగల్లీలో మారుమోగింది. 'రత్తమ్మా.. రత్తమ్మా, నీ దుకాణం ఎత్తమ్మ' అని ఆయన ఘోషించారు. తెలంగాణకు వలస వచ్చి, ఇక్కడి ప్రజల భాషను, యాసను, సంస్కృతిని అవహేళన చేసే ఆధిపత్య వర్గాలను ఆయన తూర్పారపట్టారు. సత్యనారాయణ కలలుగన్న విధంగా ప్రజా పాలనగా తెలంగాణ రాష్ట్రం పరిఢవిల్లాలి. తెలంగాణలో సమైక్య పాలకులు మూసేసిన నిజాం షుగర్స్ ఆల్విన్, ఐడీఎల్, ఐడీపీఎల్, హెచ్ఎంటి, ప్రాగాటూల్స్, రిపబ్లిక్ ఫోర్జ్, డీబీఆర్ మిల్లు, నేతాజి స్పిన్నింగ్ మిల్లు, ఆజంజాహీ మిల్లు వంటి పరిశ్రమలను తిరిగి తెరవాలి. స్మశాన వాటికలుగా మారిన పారిశ్రామిక వాటికలు నాచారం, ఉప్పల్, చర్లపల్లి, సనత్‌నగర్, ఆజామాబాద్, బాలానగర్, జీడిమెట్ల, కాటెదాన్, కొత్తూరు తిరిగి సైరన్ మోతలతో, చిమ్నీల పొగతో జీవకళ నింపుకోవాలి. పారిశ్రామిక, వ్యవసాయ పునరుజ్జీవంతో, కుటీర పరిశ్రమలతో గ్రామీణ పునర్వికాసం సాధించాలి. చెరువులు, కుంటలు జలకళతో తొణికిసలాడే విధంగా, పునర్నిర్మాణాన్ని ప్రజల పర్యవేక్షణలో గ్రామపంచాయతీలకే అప్పగించాలి. ప్రజల తెలంగాణగా, ప్రజాస్వామిక క్షేత్రంగా, ఆర్థిక స్వావలంబనతో ఉత్పత్తి వ్యవస్థగా, పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా వికసించాలంటే ఉద్యమశక్తులే చోదకశక్తులుగా అంకుశం చెలాయించాలి.

అరవయ్యేళ్ల సుదీర్ఘ పోరాటంలో అమరులయిన వారి త్యాగాలను, 20 ఏళ్ల మలిదశ ఉద్యమంలో నిరంతరం శ్రమించిన యోధుల స్ఫూర్తిని ఈ సందర్భంగా స్మరించుకోవాలి. గోడమీది నుంచి గద్దె మీదికొచ్చిన పిల్లులను, రంగులు మారుస్తున్న ఊసరవెల్లులను, గుంటకాడి నక్కలను ఓ కంట కనిపెట్టాలి. ప్రకృతి విధ్వంసం కాకుండా, పేదల భూములు కార్పొరేట్ కంపెనీల పాలు కాకుండా, వనరులు రాక్షసుల పాలు కాకుండా, ప్రజలు కట్టిన పన్నులు కాంట్రాక్టర్ల పాలు కాకుండా ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా, వారి ఆత్మగౌరవమే పతాకగా తెలంగాణ పునర్నిర్మాణం ఆరంభమైతేనే సంగంరెడ్డి సత్యనారాయణ వంటి తెలంగాణ ఉద్యమకారులకు అసలు సిసలు నివాళి అవుతుంది.

• **కొండె సమ్మయ్య**
జర్నలిస్టు

(నేడు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి, రవీంద్రభారతిలో సభ)

మళ్ళీ డిటెన్షన్ 'గుదిబండే'!

ఐదు, ఎనిమిది తరగతులకు మళ్ళీ 'డిటెన్షన్' విధానం తీసుకురావాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచన... భారత పార్లమెంటు చేసిన విద్యాహక్కు చట్టం–2009కి పూర్తి విరుద్ధమయిన చర్య! ఈ చట్టంలోని కీలకమైన వయస్సు ఆధారిత తరగతి అన్న ప్రాథమిక సూత్రానికి, విద్యాహక్కుకు సైతం ఈ నిర్ణయం పూర్తి విరుద్ధం. అంతేకాదు బడుగు–బలహీన వర్గాల విద్యాభివృద్ధికి ఇది గుదిబండ.



పాఠశాలను అందుబాటులో ఉంచి నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత, వయస్సుకు అనుగుణంగా తగిన సామర్థ్యాలు విద్యార్థికి నేర్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అయితే విద్యా బాధ్యతల నుండి మన పాలకులు క్రమంగా వైదొలగుతూ వచ్చారు. విద్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు విద్యా వ్యవస్థను పరోక్షంగా ప్రోత్సహిస్తూ వచ్చారు. ప్రతి విద్యార్థికీ హక్కుగా ఉచితంగా అందవలసిన విద్యను మార్కెట్‌లో సరుకులాగా మార్చివేశారు. ప్రైవేటు పాఠశాలల నియంత్రణ గాలికొదిలేసి... ప్రత్యామ్నాయం పేరుతో, ప్రత్యేక పాఠశాలల పేరుతో పలు రకాల గురుకులాలను ఉనికిలోకి తెచ్చారు. గురుకులాల మూలంగా అప్పటివరకు ఉన్న ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ కుప్పకూలింది. వాటిలో నమోదు శాతం తగ్గిపోయింది. ప్రభుత్వ విద్యారంగంపై ప్రభుత్వాలు చూపుతున్న సవతి తల్లి ప్రేమ మూలంగానే విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. ఈ వాస్తవాన్ని మరుగుపరిచి కేవలం 'నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ)' ప్రక్రియను తప్పుపట్టి, తిరిగి తుప్పుపట్టిన పాత 'డిటెన్షన్' విధానం ప్రవేశపెట్టడం 'కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిన' విధంగా ఉంటుంది. ఈ విధానం విద్యాహక్కు చట్టంలోని వయస్సు ఆధారిత తరగతికి మంగళం పాడడమే! మళ్ళీ డ్రాపవుట్స్ పెంచి, బడుగు–బలహీన వర్గాలకు విద్యాహక్కును నిరాకరించడమే అవుతుంది.

డిటెన్షన్ ప్రతిపాదనకు విద్యా సామర్థ్యాలు తరుగుదల సాకుగా చూపుతున్న పాలకులు, విద్యాహక్కు చట్టం చూపించిన సామర్థ్యం పెంపుదల సూచనలైన 1) ఉపాధ్యాయులకు చట్టంపైన, మారిన విద్యావిధానంపైన సమగ్ర శిక్షణ ఇవ్వలేదు. ఉపాధ్యాయ విద్యలో అందుకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేయలేదు. 2) వయస్సుకు తగ్గ తరగతి సామర్థ్యాలు పొందడానికి అవసరమైన వ్యవస్థలను నిర్మించడంలో, అందుకు తగ్గ సౌకర్యాలను కల్పించడంలో విఫలమైన పాలకులు, 'ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్లు' పరీక్షా విధానం మార్చాలనడం అర్థరహితం.

తిరిగి డిటెన్షన్ విధానం ప్రవేశపెట్టడం అంటే సాంప్రదాయ పరీక్ష విధానానికి ప్రాణప్రతిష్ఠ చేయడమే. అశాస్త్రీయత వైపు అడుగులు వేయడమే. పాఠశాలల్లో డ్రాపవుట్స్ పెంచడం ద్వారా ఆశ్రిత పెట్టుబడిదారుల అవసరాలు తీర్చే చౌక ధర కార్మికులను ఉత్పత్తి చేసే కర్మాగారంగా మళ్ళీ ప్రభుత్వ పాఠశాలలను మార్చడమే. కార్పొరేట్ వ్యవసాయానికి చౌకధరకు వ్యవసాయ కార్మికులను అందించడమే. అంతేకాదు, బడుగు–బలహీన వర్గాలకు ఇచ్చే రిజర్వేషన్ ప్రక్రియకు సైతం గండికొట్టే ఆలోచన డిటెన్షన్ విధానం వెనుక దాగివుంది. కాబట్టి ఎన్నో ఏళ్ళుగా పోరాడి సాధించుకున్న విద్యాహక్కు చట్టం స్ఫూర్తిని, దాని ఆధారంగా రూపొందించుకున్న 'నిరంతర సమగ్ర మూల్యాంకనం' ప్రక్రియను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. డిటెన్షన్ ప్రవేశపెట్టడం అంటే పరోక్షంగా విద్యాహక్కు చట్టానికి తూట్లు పెట్టడమే. అంతిమంగా చట్టం దానికదే నిర్వీర్యం అయ్యేలా చేయడం అవుతుంది. పాలకులు తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి తెస్తున్న డిటెన్షన్ కుసంస్కరణను వ్యతిరేకించి, విద్యాహక్కు చట్టం–2009ని కాపాడుకోవాల్సిన కర్తవ్యం మన అందరిపై ఉంది.

○ **ఎన్. తిర్మల్**

హితవు పలికే ముందు గతం చూసుకోరా?

కల్వకుంట్ల కవిత ఆంధ్రజ్యోతిలో రాసిన వ్యాసం ('కాంగ్రెస్ దిగజారుడు రాజకీయం' –జనవరి 8) ముగింపులో 'రామన్న'పై అక్రమ కేసులు పెట్టారని, అట్టి కేసులను తెలంగాణ ప్రజలు వ్యతిరేకించాలని, రాష్ట్రాన్ని పాలిస్తున్న దగాకోర్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని హితవు పలికారు. ప్రతి ఐదేళ్ళకోసారి ఎన్నికలు వచ్చినప్పుడు తప్పక ప్రజలు ఆ పని చేస్తూనే ఉన్నారని గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రుజువు చేసిన విషయం కల్వకుంట్ల కవితకు తెలియనిదేమీ కాదు.

గత 75 సంవత్సరాల కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో అనేక మంది ముఖ్యమంత్రులు తమ పాలనలో కేవలం రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించారు. ఎన్నుకున్న ప్రజలకు దగా చేయలేదు. కల్లబొల్లి మాటలు అలవి కాని వాగ్దానాలు చేసి ఎన్నుకున్న తర్వాత ప్రజలను దగా చేయడం మన తెలంగాణ రాష్ట్రంలోనే మొదలైన విషయం కల్వకుంట్ల కవితకు గుర్తు లేదు కావచ్చు కానీ తెలంగాణ బాధిత ప్రజలు మాత్రం ఇంకా మర్చిపోలేదు.

దశాబ్దాల తరబడి రాష్ట్రం కొరకు పోరాడి ప్రాణాలు అర్పించిన కుటుంబాలకు త్యాగాలు చేసిన ఉద్యమకారులకు మొండి చేయి చూపించి అవమానపరిచి దగా చేసింది ఎవరో చరిత్రలో మిగిలే ఉంది. తెలంగాణ రాష్ట్రంలో మొదటి ముఖ్యమంత్రి దళితుడే అని వందల పర్యాయాలు వాగ్దానం చేసిన కేసీఆర్ రాష్ట్రం అవతరించిన తర్వాత వరుసగా తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగి దళితులకు దగా చేయలేదా? తెలంగాణ ప్రజల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని కుటుంబ పార్టీగా ఎలా మార్చుకున్నారో ప్రజలకు తెలియనిదా? తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సర్వం త్యాగం చేసిన అనేకమంది ఉద్దండులైన దళిత, బహుజన నాయకులను అవమానపరిచి పొగపెట్టిన ఉదంతాలు కల్వకుంట్ల కవిత మరిచిపోయినా తెలంగాణ ప్రజలు మాత్రం ఇంకా మరిచిపోలేదు.

ప్రజాస్వామ్యంలో కుటుంబ పాలన ప్రవేశపెట్టి రాష్ట్ర క్యాబినెట్‌లో కుటుంబ సభ్యులనే నలుగురిని ఉన్నతస్థాయి మంత్రి పదవులు ఇచ్చి 55శాతం జనాభా ఉన్న వెనుకబడిన కులాలకు దగా చేయలేదా? తెలంగాణ ఉద్యమకారులకు ప్రతినెల రూ.3000 పింఛను ఇస్తానని 2019 ఎన్నికల ముందు ప్రకటించి ఐదేళ్ళు గడిచినా చిల్లిగవ్వ కూడా విదిలించలేదు. భూస్వాముల దగ్గర కొనుగోలు చేసి దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న పేద, చిన్న రైతుల భూములను ధరణి పోర్టల్ ద్వారా తిరిగి దొరలకు, భూస్వాములకు పట్టా పాసు బుక్కులు అప్పచెప్పారు. రాష్ట్రానికి ఏడు లక్షల కోట్ల అప్పుచేసి ఇక కొత్త ప్రభుత్వానికి తిరిగి అప్పు దొరకకుండా చేసి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు లేకుండా చేశారు. వెనుకబడిన కులాలకు స్థానిక సంస్థలలో ఉన్న 33శాతం రిజర్వేషన్ 18 శాతానికి తగ్గించారు. పేదల విద్య వైద్య రంగాలకు నిధులు కేటాయించక అధ్యాపక, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయక నిర్వీర్యం చేశారు.

కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన కేసులను, అరెస్టులను అడ్డుకోవాలని, వాటిని వ్యతిరేకిస్తూ ప్రజలు రోడ్డున పడాలని కల్వకుంట్ల కవిత ప్రజలకు హితవు చెప్పేముందు గత పదేళ్ళలో జరిగిన అణచివేతలు, అరెస్టులు, ఆర్థిక విధ్వంసం, అవినీతి పాలనను గుర్తు చేసుకుంటే బాగుండేది.



పేద కుటుంబాలకు డబుల్ బెడ్ రూముల ఇండ్ల నిర్మాణం చేస్తామని చెప్పి మచ్చు కొరకు మీ సొంత నియోజకవర్గాల్లో పంపిణీ చేసి ఇతర ప్రాంతాల పేదలకు దగా చేశారు. కనీసం ఇళ్ల స్థలాలు కూడా పంచకుండా పట్టణ ప్రాంతాల్లోని భూములను ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని విలువైన భూములను కారు చౌకగా అమ్ముకున్నారు. ఎకరాల కొద్ది భూములను పార్టీ ఆఫీసుల నిర్మాణం కోసం వాడుకున్నారు.


కల్వకుంట్ల కవిత కనీసం ఇప్పటికైనా తమ కుటుంబ పాలనలో జరిగిన తప్పులను మర్చిపోకుండా ప్రజల ముందు లెక్కిస్తే ప్రజలు అభినందించేవారు. పదేళ్ళ విధ్వంస పాలన నుండి విముక్తి పొందాలని ప్రజలు ఎదురుచూస్తున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కూడా గత శాసనసభ ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారాన్ని హస్తగతం చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రస్తుత ప్రభుత్వం సంవత్సరానికి 32 నుండి 40 వేల కోట్ల రూపాయలు కేవలం అప్పులు, వడ్డీలు చెల్లించాల్సిందే. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు పెన్షన్‌దారులకు ప్రతి నెల 15వ తేదీ వరకు కూడా జీతభత్యాలు ఇవ్వలేని దుస్థితి నుండి ప్రస్తుత ప్రభుత్వ పాలన ప్రారంభమైన విషయం కల్వకుంట్ల కవితకు గుర్తు రావడం లేదా?

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయలేని దుస్థితిలో ప్రస్తుత ప్రభుత్వం కొట్టుమిట్టాడుతున్న విషయం విజ్ఞులైన ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ప్రజలపై ఇంకా అదనపు పన్నులు, ఎక్సైజ్ సుంకాలు, ధరల పెంపుకు అవకాశమే లేదు. పోనీ గత ప్రభుత్వం వలె ఇబ్బడి ముబ్బడిగా అప్పులు తెచ్చే అవకాశం అంతకూ లేదు. ఇప్పుడు విలువైన ప్రభుత్వ భూములు అమ్మితే ప్రజలు ఊరుకునే ప్రసక్తే లేదు. ప్రస్తుత పాలకపక్షం ఇచ్చిన అన్ని హామీలను సంపూర్ణంగా అమలు చేయలేకపోతుందని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. అలవిగాని హామీలను ఇవ్వడం అన్ని రాజకీయ పార్టీలకు వెన్నతో పెట్టిన విద్య. అందులో అన్ని రాజకీయ పార్టీలకు ఈ విద్య నేర్పింది భారత రాష్ట్ర సమితి నాయకత్వమే అంటే అతిశయోక్తి కాదేమో. గత ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలు పది సంవత్సరాల కాలంలో కూడా అమలు చేయలేదు. అందుకే శాసనసభ ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. లోకసభ ఎన్నికలలో గుండు సున్నా మార్కులు ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఐదు సంవత్సరాల పాలన పూర్తి అయ్యే నాటికి ఇచ్చిన వాగ్దానాలు, హామీలు సంపూర్ణంగా అమలుచేయకపోతే ప్రజలు చూస్తూ ఊరుకోరు. నాయకులకు ప్రజలు వాళ్ల పనితనాన్ని బట్టి మాత్రమే మార్కులు వేస్తారు.

కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన కేసులను, అరెస్టులను అడ్డుకోవాలని, వాటిని వ్యతిరేకిస్తూ ప్రజలు రోడ్డున పడాలని కల్వకుంట్ల కవిత ప్రజలకు హితవు చెప్పేముందు గత పదేళ్ళలో జరిగిన అణచివేతలు, అరెస్టులు, ఆర్థిక విధ్వంసం, అవినీతి పాలనను గుర్తు చేసుకుంటే బాగుండేది. చట్టాన్ని అతిక్రమించిన ఏ వ్యక్తికైనా విచారణ, అవసరమైతే శిక్షల పద్ధతి ఒకే తీరుగా ఉంటుంది. తమ కుటుంబ సభ్యులు అందుకు అతీతులు కాదని కవిత తెలుసుకోవాలి.

◆ **ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ**
తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ చైర్మన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





డీసీసీ బ్యాంకు మహాజన సభలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించాం..

- అన్ని వర్గాలకు బ్యాంకు సేవల విస్తరణ
- దళారీ వ్యవస్థ లేకుండా రుణాల అందజేత
- వాణిజ్య బ్యాంకులకు దీటుగా నిలిచాం
- వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

7

'భద్రకాళి' పాలక మండలికి మోక్షమెప్పుడో?

- ఆరు నెలలుగా కొనసాగుతున్న సస్పెన్స్
- రెండుసార్లు దరఖాస్తు చేసుకున్న ఆశావహులు
- రాజకీయ గ్రహణంతో 12ఏళ్లుగా కమిటీకి నోచుకోని వైనం

6

- గర్జించిన గొంతులు.. మార్మోగిన డప్పులు..



వేయిస్తంభాల గుడి వద్ద డప్పు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మందకృష్ణ మాదిగ, చిత్రంలో ఎమ్మెల్సీ మల్లన్న, అరూరి రమేష్, తదితరులు



వేయిస్తంభాల ఆలయం నుంచి ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

కమిటీల పేరుతో కాలయాపన



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మందకృష్ణ

- మాలల ఒత్తిడికి వర్గీకరణపై తలొగ్గిన కాంగ్రెస్ సర్కారు
- డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం మావైపుంది
- మా పోరాటానికి సబ్బండ వర్గాల సంఘీభావం
- హనుమకొండలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

7



సాగునీటి సంఘాలు.. మళ్లీ తెరపైకి!

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాలు మళ్లీ తెరపైకి రానున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో వీటిని ఏర్పాటు చేయగా.. ఆ తర్వాత కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ఉద్యమం కారణంగా ఎన్నికలు జరగలేదు. ఆ తర్వాత రాష్ట్ర ఆవిర్భావ జరిగి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. దాంతో పదేళ్లకుపైగా మనుగడలో లేని సాగునీటి సంఘాలను పునరుద్ధరించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి సూత్రప్రాయంగా ప్రకటించారు. రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ కోరిన మేరకు రాష్ట్రంలో మళ్లీ నీటి సంఘాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పూనుకోవడంతో ప్రతీ చెరువు కింద ప్రత్యేకంగా సాగునీటి సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పాలక మండడళ్లను నామినేషన్ వి ధానంలో భర్తీ చేయాలా? లేక ఎన్నికల విధానంలో నియమించాలా? అనే దానిపై సమాలోచన జరుపుతోంది. దీనితో జిల్లాలో మళ్లీ సాగునీటి సంఘాలు ఏర్పాటు కానున్నాయి.

రైతు కమిషన్ సూచన మేరకు..

ఇటీవలే ఆంధ్రప్రదేశ్‌లో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సాగునీటి వినియోగదారుల సంఘాల వ్యవస్థను పునరుద్ధరించడం వల్ల సాగునీటి వనరులను సక్రమంగా వినియోగించుకోగలుగుతామని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ అభిప్రాయ పడింది. వాటి బాగోగులు ఎప్పటికప్పుడు చూడగలుగుతామని ప్రభుత్వానికి నివేదించింది. సాగునీటి సంఘాల ఏర్పాటుకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నేతృత్వంలోని బృందం ఇప్పటికే ప్రాథమిక నివేదికలను ప్రభుత్వానికి సమర్పించింది. వీటిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిన క్రమంలో సాగునీటి సంఘాల ఏర్పాటుపై రైతుల్లో ఆసక్తి నెలకొంది. కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులను చేయడానికి ఈ సాగునీటి సంఘాలకు ప్రభుత్వం నిధులు ఇవ్వనున్న దృష్ట్యా వీటి వినియోగంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు మార్గదర్శకాలను పకడ్బందీగా రూపొందించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

- ఏర్పాటు దిశగా సర్కారు కసరత్తు
- చెరువులు, ఆయకట్టు వివరాల సేకరణకు చర్యలు
- ప్రతిపాదనలు రూపొందిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు
- హనుమకొండ జిల్లాలో 898 చెరువులు, 24 చెక్ డ్యాంలు
- ఎస్ఆర్ఎస్పీ కాకతీయ ప్రధాన కాలువ, దేవాదుల ద్వారా సాగునీరు
- గతంలో టీడీపీ హయాంలో సంఘాల ఏర్పాటు
- మిషన్ కాకతీయ పేరుతో పదేళ్లకు పైగా ఆటకెక్కించిన బీఆర్ఎస్

898 చెరువులు.. 24 చెక్ డ్యాంలు

హనుమకొండ జిల్లాలో చిన్నవి, పెద్దవి కలిపి మొత్తం 898 చెరువులున్నాయి. వీటిలో 100ఎకరాలపైన ఆయకట్టు కలిగిన చెరువులు 151, వంద ఎకరాల కన్నా తక్కువ ఆయకట్టు కలిగిన చెరువులు 747 చెరువులున్నాయి. వీటితో పాటు 24 చెక్‌డ్యాంలు కూడా ఉన్నాయి. వీటి కింద మొత్తంగా 2,16,000 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో చెరువులు, కుంటలు, చెక్ డ్యాంల కింద 66,000 ఎకరాలు సాగవుతుండగా, ఎస్సారెస్పీ కాలువ కింద 80వేల ఎకరాలు, దేవాదుల కింద మరో 70వేల ఎకరాలు సాగవుతోంది. జిల్లాలో ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట నుంచి ఎస్సారెస్పీ, కాకతీయ ప్రధాన కాలువ మొదలై వరంగల్ ఆటోనగర్ వద్ద ముగుస్తుంది. జిల్లాలో డిస్ట్రిబ్యూటరీలు 13 వరకు ఉన్నాయి. డీబీఎం 21 నుంచి డీబీఎం 30, డీబీఎం 37ద్వారా సాగునీరు రైతులకు అందుతోంది. ఇందులో డీబీఎం 24, డీబీఎం 37, డీబీఎం 31 పెద్దవి. జిల్లాలోని వివిధ గ్రామాలకు కాకతీయ కాలువకు అనుబంధంగా ఉపకాలువలను నిర్మించి నీరు సరఫరా చేస్తున్నారు. ఒక్కో డిస్ట్రిబ్యూటరీకి అయకట్టును బట్టి ఎడమ, కుడి వైపులకు మరో 70 వరకు చిన్న కాలువలు ఉన్నాయి. సంబంధిత కాలువల ద్వారా సాగునీరు పంట పొలాలకు అందించాల్సి ఉంటుంది.

గతంలో...

దేవాదుల ప్రాజెక్టు, ఎస్ఆర్ఎస్ కాలువ పరిధిలో 13 డిస్ట్రిబ్యూటరీలు, 315 సాగునీటి సంఘాలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉండేది. ప్రస్తుతం ఏవీ ఉనికిలో లేనందు వల్ల వాటిని తిరిగి తీసుకువచ్చి సాగునీటి వనరులను కాపాడటంలో రైతులను భాగస్వాములను చేయాలని కోరుతూ రైతు సంక్షేమ కమిషన్ కోరడంతో సాగునీటి సంఘాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. వీటి ఏర్పాటు వల్ల ఎప్పటికప్పుడు కాలువలను, చెరువు లను బాగు చేసుకుంటూ నీటి విడుదల విషయంలో రైతులను భాగస్వాములను చేసినట్లవుతుంది. ఆయా నీటి వనరుల కింద నిర్దేశించిన ఆయకట్టుకు నీరు అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

1996లో చట్టం..

సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసి నీటి వనరులను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు యాజమాన్య చట్టాన్ని 1996లో నాటి టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. అందులో నీటి ప్రాజెక్టులకు నీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలు ఏర్పాటు చేసింది. అదే విధంగా చెరువులక సంఘాలను ఏర్పాటు చేశారు. వీటి ఎన్నికల విషయంలో రకరకాల పద్ధతులు అమలు చేశారు. 2010లో ఎన్నికలు

మిగతా 8వ పేజీలో...

ఉమ్మడి జిల్లా నుంచి.. ఇద్దరికి గవర్నర్ పురస్కారాలు

7

- ఎక్సలెన్స్ అవార్డులకు ప్రొఫెసర్ పాండు రంగారావు, దీప్తి ఎంపిక
- సంస్కృతి, వారసత్వ సంపద, క్రీడా రంగాల్లో చేసిన కృషికి గుర్తింపు



ప్రొఫెసర్ పాండురంగారావు, దీప్తి

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం గణతంత్ర వేడుకల నిర్వహణపై రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్అండ్‌బీ, మునిసిపల్ తదతర శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య గణతంత్ర వేడుకల ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవ వేడుకలకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను సిద్ధం చేయాలని, వేడుకల సందర్భంగా నిర్వహించే అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వేడుకల ప్రారంభం నుంచి మొదలుకుని వివిధ కార్యక్రమాలు ముగిసే వరకు అందరూ ఉండాలన్నారు. సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఆర్‌వో వైవి గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీను, ఆర్డీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. నెక్కొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌ను ఎస్‌బీకి బదిలీ చేయగా, ఇటీవల వరంగల్ కమిషనరేట్‌కు అలాట్ అయిన ఎస్. శ్రీనివాస్‌ను నెక్కొండకు బదిలీ చేశారు. ఎస్‌బీలో ఉన్న ప్రతాప్‌ను మల్టీజోన్‌కు బదిలీ చేశారు. సీసీఆర్‌బీలో పని చేస్తోన్న ఏ.ప్రవీణ్‌ను ఎల్కతుర్తికి బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రీవెన్స్ వినతులు త్వరగా పరిష్కరించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- బల్దియా ప్రజావాణిలో ప్రజల ఫిర్యాదులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు సత్వర పరిష్కారం చూపాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు అందించాల్సిన సౌకర్యాలపై అధికారులు చొరవ చూపాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 77 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో



దివ్యాంగుడి సమస్య వింటున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 23, హెల్త్, శానిటేషన్ - 7, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 11, టౌన్‌ప్లానింగ్ - 30, తాగునీటి సరఫరా - 02, జనరల్ - 04 ఇలా మొత్తం 77 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

- తాను కంప్యూటర్‌లో తెలుగు, ఇంగ్లీష్ టైపింగ్‌తో పాటు ట్యాలీ నేర్చుకున్నానని తనకు ఎంజీఎంలో గానీ, డీఎంహెచ్‌వో కార్యాలయంలో గానీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తే కుటుంబాన్ని పోషించుకుంటానని వరంగల్ వేణురావు కాలనీకి చెందిన రుషికేష్ అనే వికలాంగుడు కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశాడు.
- వరంగల్ 18వ డివిజన్‌లో చాలా కాలనీలలో డ్రైనేజీలో చెత్తా చెదారం నిండుకుందని , గతంలో చాలా సార్లు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గబ్బెట ప్రవీణ్ అనే వ్యక్తి కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు.
- హనుమకొండ మైత్రినగర్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మించారు. కానీ బల్దియా శానిటేషన్ సిబ్బంది కాలువలు తీయక పోవడంలో జాప్యం చేస్తున్నారని కాలనీ ప్రజలు తెలిపారు. - హనుమకొండ న్యూ బృందావన్ కాలనీలో డ్రేనేజీ, సీసీ రోడ్డును నిర్మించేందుకు ఆరుమాసాల క్రితం ప్రతిపాదనలు చేసి వెళ్లారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం వల్ల ఇళ్లలో నుంచి వచ్చే నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతుందని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు.

ఆరోగ్యశాఖలో.. ఇష్టారాజ్యం!

- నియామకాల్లో అధికారుల అక్రమాలు..
- తప్పు చేసినా తప్పించుకుంటామన్న రీతిలో తీరు

6

భద్రకాళి పాలక మండలికి మోక్షమెప్పుడో?



- ఆరు నెలలుగా కొనసాగుతున్న సస్పెన్స్
- రెండుసార్లు దరఖాస్తు చేసుకున్న ఆశావహులు
- రాజకీయ గ్రహణంతో 12ఏళ్లుగా కమిటీకి నోచుకోని వైనం

వరంగల్ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతి పెద్ద దేవాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవస్థానం పాలక మండలి ఏర్పాటు జరుగుతుందా.. లేదా అనే అనుమా నాలు రేకెత్తుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు ఎలాంటి పాలకవర్గం లేకుండానే ఆలయ నిర్వహణ కొనసాగింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ఆలయం వరంగల్ పశ్చిమ నియోజక వర్గ పరిధిలో ఉండడంతో ఆలయ మాడ వీధుల నిర్మాణం వేగవంతం చేయడంతో పాటు త్వరలోనే భద్రకాళి దేవస్థానం పాలక వర్గాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని దేవాదాయ శాఖ నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. ఇలా గత ఆరు నెలల్లో రెండుమార్లు నోటిఫికేషన్ జారీ చేశారు. అయినా నేటికీ పాలక మండలి ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు. అసలు పాలక వర్గం కమిటీ ఏర్పాటు చేస్తారా చేయరా అనే అనుమానం వ్యక్తమవుతున్నాయి.

వెరిఫికేషన్ పూర్తయినా ఫలితంలేదు..

భద్రకాళి దేవాలయం పాలక మండలి సభ్యుల ఏర్పాటు కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ రెండుమార్లు నోటిఫికేషన్ జారీ చేసింది. మొదటగా గత సెప్టెంబరు మాసంలో జారీ చేయగా 27 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి ప్రొఫైల్ వెరిఫికేషన్ కూడా పూర్తయింది. అయినా కార్యరూపం దాల్చలేదు. తిరిగి 2025 జనవరి5న మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయగా 34 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించిన పరిశీలన వెరిఫికేషన్ కూడా పూర్తయింది. అయినప్పటికీ పాలక మండలి ఏర్పాటు ముందుకు సాగడం లేదు. అధికారులను సంప్రదించగా తమ పని ముగిసిందని, కమిటీ ఏర్పాటు కమిషనర్ కార్యాలయం నుంచే వెలువడుతుందని తెలిపారు.

రాజకీయ గ్రహణం..

భద్రకాళి అమ్మవారి దేవాలయం పాలక మండలి సభ్యుల ఏర్పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో బస్వరాజు సారయ్య మంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటైంది. ఆ కమిటీ కాల పరిమితి పూర్తయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ పాలన సమయంలో కమిటీ ఏర్పాటు చేయలేదు. దాదాపు 12 సంవత్సరాలుగా ఎలాంటి పాలక మండలి లేకుండానే ఆలయ నిర్వహణ కొనసాగుతోంది. రాష్ట్రంలోనే అతి పెద్ద దేవాలయం కావడంతో పాలక మండలి సభ్యుల ఏర్పాటులో పోటీ నెలకొంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు తమ అనుచర వర్గాలకు అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది పాలకమండలి ఏర్పాటుకు అడ్డుపడుతోంది. ఓ వైపు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, మరో వైపు లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడుతున్న దేవాలయానికి వెంటనే పాలక మండలి ఏర్పాటు చేయాల్సిన అవసరముందని భక్తులు కోరుతున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మామునూరు ఫోర్త్ బెటాలియన్ పోలీసులు

హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరి

- వరంగల్ డీసీపీ రవీందర్
- మామునూరులో పోలీసుల అవగాహన ర్యాలీ

ఖిలావరంగల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బైక్ నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్ట్ విధిగా ధరించాలని వరంగల్ డీసీపీ రవీందర్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం నాయుడు పెట్రోల్‌పంపు వద్ద వరంగల్ ఆర్టీఏ అధికారి జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం ప్లకార్డులు పట్టుకొని బైక్‌లపై నాయుడుపెట్రోల్ పంపు నుంచి మామునూర్ ఫోర్త్ బెటాలియన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ అధికారులు కృష్ణ, రాజ్‌కుమార్, శోభన్‌బాబు, ట్రాఫిక్ ఎస్సైలు, ఏవో నరేందర్, ట్రెయినీ ఇన్‌స్పెక్టర్లు ఉదయ్‌కుమార్, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



మిర్చి ధరకు జెండా పాట పాడుతున్న దృశ్యం

మార్కెట్‌కు భారీగా వచ్చిన మిర్చి

వరంగల్ వ్యవసాయం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం రైతులు మిర్చిని అమ్మకానికి భారీగా తరలించారు. గత వారంలో మార్కెట్‌కు సంక్రాంతి పండగ సెలవులు, సాధారణ సెలువులు ఉండడంతో సోమవారం సుమారు 12 వేల బస్తాల వరకు అమ్మకానికి వచ్చింది. ఇక ధరల విషయానికి వస్తే క్వింటాకు తేజ కొత్త మిర్చి రూ.14700లు, 341 రకం మిర్చి కొత్తది రూ. 15500లు, వండర్‌హాట్ మిర్చి రూ.12700లు పలికింది.

ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలి



డీఆర్‌డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎంయూ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ స్థాయి సంఘం చేసిన సిఫారసులకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనాలు పెంచాలని బీకేఎంయూ జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్ట రేట్‌లోని డీఆర్‌డీఏ కార్యా లయంలో డీఆర్‌డీవో మేన శ్రీనుకు బీకేఎంయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు మునిగాల భిక్షపతి, వ ర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకట్రాజం, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, నాయకులు గొల్ల మహేందర్, మునిగాల స్వామి, బిక్షపతి తదితరులు ఉన్నారు.



కలెక్టర్ సత్యశారద

గ్రామ సభలను పటిష్టంగా నిర్వహించాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు మంగళవారం నుంచి నిర్వహించే గ్రామ, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ నుంచి పథకాలు అమలు చేయనున్ననేపథ్యంలో పైనాలుగు పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. గ్రామసభల్లో అర్హుల జాబితాను ప్రదర్శించాలని, గ్రామ, వార్డు సభల షెడ్యూల్‌పై ముందస్తుగా ప్రచారం చేయాలని అన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జిల్లా నోడల్ అధికారులు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లు మహా సమాఖ్యకు అరుదైన గౌరవం

రిపబ్లిక్ డేలో పాల్గొననున్న ఇల్లంద మహిళ



అరుణ

వర్ధన్నపేట రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లు మహా సమాఖ్యకు అరుదైన గౌరవం లభించింది. జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల కు రావాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వా నం అందినట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నీలవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేర కు ఓరుగల్లు మహా సమాఖ్య తరపున ప్రస్తు త జిల్లా అధ్యక్షురాలు మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన ఎడ్ల అరుణ పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 23న సికింద్రాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాల పని తీరును, ఓరుగల్లు మహా సమాఖ్య చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి ఆ హ్వానించినట్లు తెలిపారు. ఇలాంటి గౌరవం రావడంతో గర్వంగా భావిస్తున్నామని స్పష్టం చేశారు.

సంస్థల విస్తృతిలో గ్రంథాలయాలే కీలకం

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్
- నిట్‌లో ప్రారంభమైన రెండు రోజుల సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థలు, పరిశోధనాలయాలు, ఇతర సంస్థలు, వ్యవస్థల విస్తృతిలో గ్రంథాలయాలు కీలక భూమిక పోషిస్తాయని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎండీ రియాజ్ అన్నారు. వరంగల్ నిట్‌లో నిట్ లైబ్రేరియన్లు, ప్రచురణకర్తలు- విజ్ఞాన సాధికారత అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల సదస్సు సోమవారం ప్రారంభమైంది. నిట్ ప్రాంగణంలోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ సదస్సును వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, వివిధ జాతీయోద్యమాల్లోనూ ప్రజలను చైతన్యపరిచింది గ్రంథాలయాలేనన్నారు. ఏ సంస్థ అయినా విజయవంతంగా నడవాలంటే వాటిలోని గ్రంథాలయాలే మార్గదర్శకాలుగా నిలుస్తాయని అన్నారు. గ్రంథాలయాలు అందించే విజ్ఞానంతోనే అవి మరింత ముందుకు సాగుతాయని అన్నారు. గ్రంథాలయాల నిర్వహణలో గ్రంథ పాలకులు (లైబ్రేరియను) కీలకమని ప్రశంసించారు. గ్రంథపాలకులు లేకుండా గ్రంథాలయాల నిర్వహణను ఊహించలేమని డాక్టర్ రియాజ్ అన్నారు. వరంగల్ చరిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించారు. ఈ రెండు రోజుల సదస్సు దేశంలోని నిట్‌ల గ్రంథాలయాలకు అమూ ల్యమైన ప్రయోజనాన్ని అందిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్థలకు లైబ్రరీలు ప్రాణం అన్నారు. మంచి లైబ్రరీలు మంచి సంస్థలకు మూలాధారం అన్నారు. వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిదాధర్ సుబుధి మాట్లాడుతూ.. దేశంలోని వివిధ నిట్‌ల నుంచి లైబ్రేరియన్లు ఈ సదస్సుకు రావడం సంతోషంగా ఉందన్నారు. తొలుత వరంగల్ నిట్ లైబ్రేరియన్ డాక్టర్ వై శ్రీనివాసరావు సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. లైబ్రరీ అడ్వైజరీ కమిటీ చైర్మెన్, నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ రెండు రోజుల సదస్సులో లైబ్రేరియన్లు, ప్రచురణకర్తలు వివిధ అంశాలపై తమ అనుభవాలను పంచుకోనున్నారు. మొత్తం 14 సెషన్లు జరుగుతాయి. వివిధ నిట్‌ల నుంచి సుమారు 80 మంది లైబ్రేరియన్లు పాల్గొంటున్నారు. తొలి రోజు సదస్సులో మూడు సెషన్లు జరిగాయి. భవిష్యత్ పరిశోధనా కార్యకలాపాల రూపకల్పనలో ఓఎన్‌ఓఎస్‌పై వరంగల్ నిట్ లైబ్రేరియన్ డాక్టర్ వై శ్రీనివాసరావు, పరిశోధనా కార్యకలాపాలకు ఏసీఎస్ వనరులుపై అమెరికన్ కెమికల్ సొసైటీ కస్టమర్ మేనేజర్ పియూష్ కుమార్ గుప్తా, ఉన్నత విద్యా రూపాంతరం- ఆధునిక పరిశోధనలోల అనుసంధాన వేదికల పాత్రపై దక్షిణాసియా ఎల్సేవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ వినితా సరోహ ప్రసంగించారు. అనంతరం సదస్సుకు హాజరైన ప్రతినిధులు నగరంలోని వేయిస్తంభాలగుడి, వరంగల్ కోటను సందర్శించారు.

కారుబోల్తా.. యువకుడి మృతి

- ఐదుగురికి గాయాలు
- స్నేహితులను కలిసేందుకు వెళ్తుండగా ప్రమాదం
- జనగామ జిల్లా పెంబర్తి వై జంక్షన్ వద్ద ఘటన
- మృతుడిది భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి



సిద్ధార్థరెడ్డి (ఫైల్)

జనగామ రూరల్/మొగుళ్లపల్లి జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్నేహితులను కలిసేందుకు వెళ్తూ యువకుడు అనంత లోకాలకు చేరిన ఘటన జనగామ మండలంలోని పెంబర్తి వై జంక్షన్‌కు చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల పంచాయతీ పరిధి బద్దంపల్లి గ్రామానికి చెందిన బద్దం సిద్ధార్థరెడ్డి(20) తన స్నేహితులైన కరీంనగర్ జిల్లాకు చెందిన పెద్దపల్లి అభిచరణ్, తోట అక్షిత్, గుజ్జుల నందు, అంజి, బండ గణేష్‌రెడ్డి హన్మకొండలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు.

ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఉన్న స్నేహితులను కలిసేందుకు కారులో బయల్దేరారు. సిద్ధార్థరెడ్డి కారు నడుపుతుండగా మిగతావారు ప్రయాణిస్తున్నారు. కారు సోమవారం తెల్లవారుజామున జనగామ మండలం పెంబర్తి వై జంక్షన్ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో సిద్ధార్థరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. నందు, అంజిలకు తీవ్రగాయాలు, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కొరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దామోదర్ సేఫ్!

- మావోయిస్టు తెలంగాణ చీఫ్ మృతి వదంతే..
- నాలుగు రోజులైనా స్పష్టతనీయని పోలీసులు
- ఆ లేఖ నకిలీదేననే ప్రచారం
- స్పందించని మావోయిస్టు పార్టీ నాయకత్వం



మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ క్షేమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెల 16న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు హతమైనట్టు ఆ రాష్ట్ర పోలీసులు ప్రకటించారు. సంఘటన జరిగిన రెండురోజుల తర్వాత మొత్తం 18 మంది మృతిచెందారని, క్షిపణితో పోలీసులు జరిపిన దాడిలో తెలంగాణ చీఫ్ దామోదర్‌ను కోల్పోయామంటూ దక్షిణ బస్తర్ డివిజన్ కార్యదర్శి గంగ పేరిట ఓ లేఖ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. దీంతో దామోదర్ మరణించాడని అందరూ భావించారు. అయితే లేఖలో స్పష్టత లేకపోవడం, ఆయన మృతిని పోలీసులు నిర్ధారించకపోవడంతో అంతా సందిగ్ధంలో పడ్డారు. రూ.50లక్షల రివార్డును కలిగి ఉండి గత రెండున్నర దశాబ్దాలుగా తెలంగాణ పోలీసులకు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్న దామోదర్ ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే ఆ శాఖకు అతిపెద్ద విజయంగా భావించవచ్చు. యాంటీ నక్సల్ ఆపరేషన్‌లు, సమాచారం ఇచ్చిపుచ్చుకునే విషయాలలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన డీజీపీ ర్యాంకు అధికారులు సరిహద్దు ప్రాంతాలలో తరుచూ సమావేశమవుతూ ఉంటారు. అలాంటిది ఒకవేళ దామోదర్ మరణించినట్లయితే మన రాష్ట్రానికి చెందిన పోలీసు ఉన్నతాధికారులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి నిర్ధారించుకునే అవకాశముంది. కానీ, ఎన్‌కౌంటర్ జరిగి ఐదురోజులు గడిచినా పోలీసు వర్గాల నుంచి స్పష్టత లేకపోవడంతో ఆయన సేఫ్‌గా ఉన్నట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శి స్థాయి నేతకు భారీ భద్రత ఉంటుంది. కనీసం మూడంచెల రక్షణ వలయంలో.. 20మందికి తగ్గకుండా అంగరక్షకులు అతని చుట్టూ ఉండే అవకాశముంది. 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో ఎక్కువమంది మిలీషియా సభ్యులే కాగా ఆస్థాయి వారిని స్టేట్ చీఫ్ సెక్యూరిటీకి నియమించే అవకాశం లేదు. లేఖలో పేర్కొన్నట్లుగా ఒక వేళ దామోదర్ చనిపోయినా ఆయన అంత్యక్రియలు ఎలా జరిగాయోననే సమాచారం లేదు. ఫొటోలు కూడా రాలేదు. క్రితం మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ కరోనా బారిన పడి మరణిస్తే అడవిలోనే ఆయనకు అంతిమ సంస్కారాలు జరిపించినట్లు పార్టీ ప్రకటించింది. కానీ, దామోదర్ విషయంలో ఇవేమీ లేవు. మావోయిస్టుల పేరిట లేఖ, దామోదర్ మృతి ప్రచారం అంతా పోలీసుల మైండ్‌గేమ్‌లో భాగమనే చర్చ జరుగుతోంది. సూక్ష్మస్థాయిలో మావోయిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం కోసమే వదంతులకు ఊతమిచ్చారని తెలుస్తోంది. గతంలో అనేక పర్యాయాలు ఇలాగే దామోదర్ ఎన్‌కౌంటరయ్యాడంటూ ప్రచారం జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాల దాడులు ముమ్మరం కావడంతో ఇటీవలి కాలంలో వందలమంది మావోయిస్టులు మరణించారు. పార్టీని కాపాడుకోవాలంటే తెలంగాణ అభయారణ్యాలను సేఫ్‌జోన్‌గా భావిస్తూ అన్నలు తిరిగి స్వరాష్ట్రానికి వస్తున్నట్లు నిఘా వర్గాలకు ఉప్పందింది. అర్బన్ ప్రాంతంలో రహస్యంగా తిష్టవేసి రిక్రూట్‌మెంట్లను పెంచుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా పసిగట్టారు. ఈ క్రమంలో సరిహద్దుపై నిఘా పెంచిన తెలంగాణ పోలీసులు మావోయిస్టుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. ఇదే సమయంలో కమ్యూనిస్టు భావజాలం ఉండి అజ్ఞాతంలోకి వెళ్లాలనుకునే వారి మనో ధైర్యాన్ని దెబ్బతీసే వ్యూహంలో భాగంగా దామోదర్ మృతిచెందాడని పోలీసులే ప్రచారం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. తద్వారా నూతన చేరికలకు అడ్డుకట్ట వేయడం ఖాకీల ఎత్తుగడగా స్పష్టమవుతోంది. ఏదేమైనా ఇటు పోలీసులు కానీ, అటు మావోయిస్టు అగ్రనాయకత్వం కానీ స్పష్టమైన ప్రకటన చేస్తేనే తప్ప దామోదర్ మృతి వార్తలపై నెలకొన్న సందేహాలు తొలిగిపోయేలా లేవు.

ఆరోగ్యశాఖలో.. ఇష్టారాజ్యం!

- పలు నియామకాల్లో అధికారుల అక్రమాలు..
- తప్పు చేసినా తప్పించుకుంటామన్న రీతిలో తీరు



వరంగల్ మెడికల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటికే అవినీతికి.. అక్రమాలకు నిలయంగా మారిందన్న హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అధికారిగా ఎవరు బాధ్యతలు నిర్వహించినా 'అంతా ఇష్టారాజ్యం' అన్నచందంగా కనిపిస్తోంది. అవినీతిపై కథనాలు వస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తెరవెనుక ఉండి నడిపించే పరిపాలన సిబ్బందిలోనూ ఏమాత్రం జంకు కనిపించడం లేదు. ఇక అక్రమాలపై విచారణ జరపాల్సిన జిల్లా ఉన్నతాధికారులు మౌనం వహించడం వెనుక పలు అనుమానాలకు తావిస్తోంది. ఇలా ఇటీవల కాలంలో పలు నియామకాలు, నోటిఫికేషన్ల విషయాలు వివాదాలకు దారి తీశాయి.

మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ నియామకాలు..

ఎంఎల్‌హెచ్‌పీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ నియామకాల్లో ప్రస్తుతం 10 ఖాళీలున్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న వారంతా పీజీకి వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఫిబ్రవరి 4వ తేదీ 2025 దాటితే కొత్త నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. ఈలోపు భర్తీ చేయాలంటే పాత నోటిఫికేషన్‌లోని మెరిట్‌లో ఉన్న తదుపరి అభ్యర్థులతో భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని అదనుగా భావించిన కార్యాలయ అధికారులు కొత్త బాగోతానికి తెరలేపారు. గత ఏడాది ఇచ్చిన నోటిఫికేషన్.. వచ్చేనెల 4న లాప్స్ అవుతుంది. ఈ క్రమంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి 'మీకు ఉద్యోగాలు రావాలంటే మాకు రూ.4లక్షలు ఇవ్వాల్సిందే' అంటూ కొందరు కార్యాలయ సిబ్బంది కాల్స్ చేసి చెబుతున్నట్టు బహిరంగ సత్యమేనన్న చర్చ జరుగుతోంది.

పిల్లల వైద్య నిపుణుల ఎంపికపై అనుమానాలు

వారం రోజుల క్రితం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో పిల్లల వైద్య నిపుణుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆ ఇంటర్వ్యూ ఫలితాలను ప్రకటించకుండా వైద్యులతో బేరసారాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇంటర్వ్యూలు జరిగిన వెంటనే ఫలితాలు ప్రకటించకుండా జాప్యం చేయడం వెనుక మర్మమేంటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టర్ అనుమతితోనే చేస్తున్నామంటూ మాటలు..

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో పలు నియామకాలు, అక్రమ డిప్యూటేషన్లపై అనేక ఆరోపణలు వెల్లువెత్తినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇవన్నీ షరా మాములే అన్నట్టుగా సాగుతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే తాము కలెక్టర్ అనుమతితోనే ఇవన్ని చేస్తున్నామంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆరోపణలు వస్తున్నా కలెక్టర్ మౌనం వహించడం వెనుక వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి, ప్రజాప్రతినిధులు గాడిలో పెట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2387	2160
పల్లికాయ (సూక)	6310	5600
పల్లికాయ (పచ్చిది)	4450	4100
కందులు	7156	5560
పెసళ్లు	6352	4570
పత్తి	7220	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14700	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్ 341 కొత్తది	14500	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కమిటీల పేరుతో కాలయాపన

మాలల ఒత్తిడికి వర్గీకరణపై తలొగ్గిన కాంగ్రెస్ సర్కారు

- డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం మావైపుంది
- మా పోరాటానికి సబ్బండ వర్గాల సంఘీభావం
- హనుమకొండలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



వేయిస్తంభాల దేవాలయం నుంచి ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

వడ్డేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, మాలల ఒత్తిడికి తలొగ్గిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేల గొంతులు.. లక్ష డప్పుల సన్నాహక సాంస్కృతిక ప్రదర్శనను సోమవారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం వద్ద ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్‌లతోకలిసి ప్రారంభించారు. తొలుత వేయిస్తంభాల దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మహా సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం తమ వైపు ఉందని అన్నారు. రెడ్ల కాంగ్రెస్‌ను మాల ఎమ్మెల్యేలు శాసిస్తున్నారని పేర్కొన్నారు. మాదిగల ధర్మ పోరాటానికి సబ్బండ వర్గాలు సంఘీభావం తెలుపుతున్నాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలే అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని, దీన్ని తొలుత రాష్ట్రంలోనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని మంద కృష్ణ మాదిగ గుర్తు చేశారు. కేవలం వర్గీకరణను వివేక్ వెంకటస్వామి కుటుంబమే అడ్డుకుంటోందని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ కట్టుబడి ఉందని రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాలల ఎమ్మెల్యేల మెప్పుకోసమే తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. మాదిగ జాతి కోసం బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అన్ని పార్టీలు కలిసి వచ్చినా కేవలం కమిటీల పేరుతో కాలయాపన చేయడం విడ్డూరమని విమర్శించారు. ఇప్పటికే దేశంలోని తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో ముమ్మరమైందని మంద కృష్ణ మాదిగ వివరించారు. మాలల ఒత్తిడి తలొగ్గితే మాదిగల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికావలసి వస్తోందని హెచ్చరించారు. ఒకే కుటుంబంలో మూడు పదవులు పొందిన వివేక్, వినోద్, వంశీకృష్ణలు తమ ధన ప్రభావంతో 30 ఏళ్ల వర్గీకరణ పోరాటానికి అడ్డుపడుతున్నారని అన్నారు. వర్గీకరణ చేస్తే కాంగ్రెస్‌ను ఉపేక్షిస్తాం కానీ మాల కులస్థులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని వచ్చే ఎన్నికల్లో మాదిగలు చైతన్యవంతులై వారిని ఓడించడం ఖాయమని మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ సామాజిక వర్గంలోని 59 కులాలలో వర్గీకరణకు 58 కులాలు అనుకూలంగా ఉన్నాయని కేవలం మాలలే అడ్డు తగలడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కవి, రచయిత సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ మంద కృష్ణ చేపట్టిన వర్గీకరణ ఉద్యమం న్యాయమైందని దీనికి సబ్బండ వర్గాలు మద్దతు తెలుపుతున్నాయని అన్నారు. మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ సామాజిక వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. కవి, గాయకుడు, రచయిత మిట్టపెల్లి సురేందర్ అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సన్నాహక సభలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు, గాయకులు వరంగల్ శ్రీనివాస్, ఏపూరి సోమన్న, రేలారే రేల గంగా, పాటమ్మ రాంబాబు, దరువు ఎల్లన్న, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, రాష్ట్ర నేతలు పుట్ట భిక్షపతి మాదిగ, అక్కనకుంట వెంకటస్వామి, ఆరెపల్లి పవన్, బొక్కల నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఆధ్యాత్మికం

వృత్తి ఆధ్యాపకం.. ప్రవృత్తి ఆధ్యాత్మికం

- తన తాత బాటలో నడుస్తున్న సంస్కృత పండితుడు
- టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక సేవలు
- 12 ఏళ్లుగా పాశురాలపై తేటతెలుగులో ప్రవచనాలిస్తున్న డాక్టర్ క్రిష్ణమీనన్



ధనుర్మాసం సందర్భంగా ప్రవచనం చేస్తున్న డాక్టర్ క్రిష్ణమీనన్

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆయన వృత్తి రీత్యా అధ్యాపకుడు. ప్రవృత్తి రీత్యా ఆధ్యాత్మిక వేత్త. ఓ వైపు కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే మరో వైపు ధార్మిక సేవను కొనసాగిస్తున్నారు. ప్రజల్లో సన్మార్గంలో పెట్టేందుకు గాను.. వారిలో ధర్మచింతను పెంపొందించడానికి మూడు దశాబ్దాలుగా విశేషంగా కృషి చేస్తూ.. ప్రత్యేక గుర్తింపు పొందారు ఉభయ వేదాంత డాక్టర్ క్రిష్ణమీనన్. ప్రముఖ సంస్కృత పండితులు, కవి శతాబ్ది కేసరి ఉభయవేదాంత నల్లాన్ చక్రవర్తుల రఘునాథా చార్యుల మనవడైన క్రిష్ణమీనన్ తాత చూసిన బాటలో నడుస్తూ ధార్మిక ప్రవచనాలు చేస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. 12ఏళ్లుగా ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ద్వారా తిరుప్పావై ప్రవచనాలు చేస్తున్న ఆయన.. ధనుర్మాసంలో వివిధ ఆలయాల్లో గోదాదేవి పాశురాలపై చేస్తున్న ప్రవచనాలు ఎందరిలోనో భక్తిభావాన్ని పెంపొందిస్తున్నాయి. తిరుప్పావై విష్ణువును కీర్తిస్తూ గోదాదేవి మూలద్రావిడలో గానం చేసిన ముప్పై పాశురాల గీతమాలిక పన్నిద్దరాళ్వార్లు రచించిన నాలాయిర దివ్యప్రబంధంలో ఒక ముఖ్యభాగమై తమిళ సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది. ఈ పాశురాలను డాక్టర్ మీనన్ తేటతెలుగులో సులభమైన శైలిలో అందరికి అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. ఇక 20ఏళ్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ ఆలయాల్లో ధార్మిక ప్రవచనాలను కొనసాగిస్తున్నారు. ఇలా ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు కృషి చేయడంతో పాటు సంస్కృత అధ్యాపకుడిగా సంస్కృతం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని, అభిరుచిని పెంచేందుకు శ్రమిస్తున్నారు.

పండిత ప్రకర్ష..

డాక్టర్ క్రిష్ణమీనన్ ఉస్మానియా యూనివర్సిటీలో సంస్కృతంలో ఎంఏ ఎంఫిల్, కాకతీయ విశ్వవిద్యాలయలో తెలుగులో ఎంఏ టీపీటీ, తెలుగు వర్సిటీలో ఎంఏ ఆస్ట్రాలజీ చేశారు. తన తాత రఘునాథాచార్యుల వద్ద సంస్కృత వ్యాకరణ ఆధ్యాత్మిక గ్రంథాలను అభ్యసించారు. డాక్టర్ మీనన్ తల్లిదండ్రులు నరసింహాచార్యులు, వెంకటలక్ష్మమ్మ కాగా 30 సంవత్సరాలుగా సంస్కృత ఆధ్యాపకులుగా పని చేస్తున్న ఆయన ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. 25 ఏళ్లుగా హనుమాన్ జ్యోతిషాలయాన్ని కూడా నిర్వహిస్తున్నారు. డాక్టర్ మీనన్ ప్రస్తుతం ఆల్ఫోర్స్ కళాశాలలో సీనియర్ సంస్కృత అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.



ఆలయంలో ఆశేషంగా హాజరైన మహిళా భక్తులను ఉద్దేశించి తిరుప్పావై పాశురాలపై ప్రవచనం చేస్తున్న డాక్టర్ క్రిష్ణ మీనన్

పురస్కారాలు..



మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న క్రిష్ణ మీనన్

ఆధ్యాత్మిక రంగంలో చేస్తున్న విశేషమైన కృషికి గుర్తింపుగా పలు సంస్థలు డాక్టర్ మీనన్‌ను సత్కరించాయి. పలు పురస్కారాలను ప్రదానం చేశాయి. అబ్దుల్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుతో సన్మానించింది. బిర్లా ఫౌండేషన్ జ్యోతిష విభూషణ్ అవార్డును ప్రదానం చేసింది. విశ్వవిజ్ఞాన జ్యోతిష సంస్థ గౌరవ డాక్టర్‌తో, కేన్యూస్ చానెల్ ఉగాది పురస్కారంతో సత్కరించింది. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థలతో అనుబంధం కలిగి ఉన్న డాక్టర్ క్రిష్ణమీనన్ ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర సంస్కృత భారతి ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం వరంగల్ సంస్కృత అధ్యాపకుల సంఘం గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి.. ఇద్దరికి గవర్నర్ పురస్కారాలు

- ఎక్స్‌లెన్స్ అవార్డులకు ప్రొఫెసర్ పాండురంగారావు, దీప్తి ఎంపిక
- సంస్కృతి, వారసత్వ సంపద, క్రీడా రంగాల్లో చేసిన కృషికి గుర్తింపు



హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసినవారికి ప్రతిష్టాత్మకమైన గవర్నర్ ఎక్సెలెన్సీ అవార్డులను అందజేస్తారు. ఈ ఏడాది ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఈ పురస్కారాలకు ఇద్దరు ఎంపికయ్యారు. వీరిలో ఒకరు ప్రొఫెసర్ పాండురంగారావు కాగా మరొకరు పారా అథ్లెటిక్ జీవంజి దీప్తి. సంస్కృతి, వారసత్వ సంపద కేటగిరీలో పాండురంగారావుకు ఈ అవార్డురాగా దీప్తికి క్రీడారంగంలో ప్రతిభ చాటినందుకుగాను దక్కింది. రాష్ట్రంలో మొత్తం 8 మందికి ఈ అవార్డులు రాగా వీరిలో ఇద్దరు ఉమ్మడి వరంగల్ వారే కావడం విశేషం. ప్రధానంగా నాలుగు రంగాలు- పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, కల్చర్‌లో విశేషమైన కృషి చేసినందుకు గుర్తిం పుగా గవర్నర్ చేతుల మీదుగా ఈ ఎక్సెలెన్స్ అవార్డుల ప్రదానం జరగనుంది. ఈ అవార్డు కోసం గత నవంబరులో దరఖాస్తులను కోరగా 594 మంది దాఖలు చేశారు. అవార్డుల కమిటీ వడపోత తర్వాత ఎనిమిది మంది ఎంపికయ్యారు. ఈ అవార్డు కింద రూ.2లక్షల నగదు, ప్రశంసా పత్రం అందజేశారు.

వారసత్వ పరిరక్షణలో పాండురంగారావు కృషి

కాజీపేట సిద్ధార్థనగర్‌లో నివాసముంటున్న వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాకతీయుల వారసత్వ సంపద, ప్రాచీన కట్టడాలు, అలనాడు వారు నిర్మించిన గొలుసుకట్టు చెరువులను కాపాడడంలో విశేషంగా కృషి చేశారు. విద్య, వైద్య రంగాల్లోనూ ఆయన విస్తృతమైన సేవలు అందించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ (జియాలజీ), ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ చేశారు. ప్రొఫెసర్ పాండురంగారావు చదువుల్లోనే కాకుండా ఆటల్లోనూ మేటి అనిపించుకున్నారు. వరంగల్ నగరంలో 1972, 1973 సంవత్సరంలో తీవ్రమైన కరువు ఏర్పడి తాగునీటి సమస్య తలెత్తినప్పుడు దాని శాశ్వత పరిష్కారానికి కృషి చేశారు. 1984లో తాను పని చేస్తున్న ఆర్ఈసీ (ప్రస్తుతం నిట్)లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నప్పుడు త్రీ డైమెన్షనల్ మోడల్ ప్రాజెక్టులో భాగంగా శ్రీరాం సాగర్ వరద నీటిని వాడుకోవడంతో పాటు ఫ్లడ్‌ఫ్లో కెనాల్, మిడ్‌మానేర్ డ్యాం డిజైన్‌లో కీలక భూమిక పోషించారు. అలాగే కాకతీయుల కట్టడాలు, నీటిపారుదల ప్రాజెక్టులపై విస్తృతమైన పరిశోధన చేశారు. జియో టెక్నికల్ అప్రేజల్ అండ్ ఎవాల్యూషన్ ఆఫ్ కాకతీయ మాన్యుమెంట్స్ పేరుతో భారత పురావస్తు శాఖ చేపట్టిన రీసెర్చ్ ప్రాజెక్టుకు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఏడేళ్లపాటు సుదీర్ఘంగా అధ్యయనం చేసి సమగ్రమైన నివేదికను సమర్పించారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడి ఆవరణలో శిథిలావస్థకు చేరిన కల్యాణ మండపాన్ని పునర్నించడంలో ప్రొఫెసర్ పాండురంగారావు చేసిన కృషి అమూల్యం. 30సంవత్సరాలుగా ఇంటాక్ కన్వీనర్‌గా ఆయన అనేక కాకతీయ కట్టడాల పునరుద్ధణకు కృషి చేశారు. 2009లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీవీ పాపారావుతో కలిసి ఏర్పాటు చేసిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ద్వారా కాకతీయుల వారసత్వ సంపద, వారు నిర్మించిన గొలుసుకట్టు చెరువుల ప్రాముఖ్యతను విశేషంగా ప్రచారంలోకి తీసుకువచ్చారు. చారిత్రకంగా సుప్రసిద్ధమైన రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడంతో ప్రొఫెసర్ పాండురంగారావు ఎంతగానో శ్రమించారు. రామప్పపై ప్రత్యేకంగా ఒక డోజర్‌ను రూపొందించడం ద్వారా యునెస్కో ప్రతినిధులను ఒప్పించడంలో కీలకంగా వ్యవహరించారు. నగరంలోని ఎంజీఎం, సీకెఎం ఆసుపత్రుల అభివృద్ధికి శ్రమించారు. హెరిటేజ్, కల్చర్, విద్య, వైద్య రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా ప్రొఫెసర్ పాండురంగారావు అనేక పురస్కారాలను అందుకున్నారు. తాజాగా గవర్నర్ ఎక్సెలెన్స్ అవార్డు కూడా వరించింది.

వైకల్యాన్ని జయించి..అవమనాలను అధిగమించి..

పేదరికాన్ని లెక్కచేయకుండా.. వైకల్యాన్ని జయించి.. అవమానాలను అధిగమించి.. రికార్డుల రారాణిగా సత్తా చాటి ప్యారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పారా ఒలింపియన్ జీవంజి దీప్తికి మరో ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన ఆమె ఇటీవలే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అర్జున అవార్డును అందుకోగా... తాజాగా గవర్నర్ ఎక్స్‌లెన్స్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆమె రూపం గురించి ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదురైనా క్రీడల్లో రాణించి పారా ఒలింపిక్స్‌లో అర్జున పురస్కారాన్ని అందుకున్న తొలి తెలుగు పారాలింపియన్‌గా నిలిచారు.

వేగంగా జరుగుతున్న షెడ్ నిర్మాణం



24న కొండపర్తికి గవర్నర్

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి అధికారుల సన్నాహాలు



తాడ్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో కొండపర్తి గ్రామానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నారని సమాచారం. గవర్నర్ దత్తత గ్రామం కొండపర్తిని మోడల్ గ్రామంగా రూపొందించే దిశగా అధికారులు పలు అభివృద్ధి పనులు ప్రాంభించారు. ఈ నెల 24న గవర్నర్ కొండపర్తికి వచ్చే అవకాశం ఉన్నందున అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలో షెడ్ నిర్మాణాలు, పాఠశాల మరమ్మతు, ప్రారంభం రోజు కొమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాల ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయి. 23వ తేదీలోగా కుట్టు మిషన్లు, ప్యాకింగ్ మిషనరీ, ప్లేట్ల తయారీ మిషన్లు గ్రామానికి చేరుకోనున్నాయి.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో మొదలైన మినీ సంబురం

ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో వనదేతలకు ముందస్తు మొక్కులు ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా సోమవారం సుమారు 10వేల మందికి పైగా భక్తులు మేడారం చేరుకున్నారు. సమ్మక్క సారలమ్మల గద్దెలకు పూజలు చేసి పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారెలు కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించుకున్నారు. యాట మొక్కులను చెల్లించుకొని కోరికలు తీరాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ పరిసరాలు, అడవి ప్రాంతాలు, వసతి భవనాల్లో విడిది చేసి సేద తీరారు.

రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించాం..

- అన్ని వర్గాలకు బ్యాంకు సేవల విస్తరణ
- దళారీ వ్యవస్థ లేకుండా రుణాల అందజేత
- కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా నిలిచాం
- వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 20 : డీసీసీ బ్యాంకు ఆర్థిక ప్రగతి సాధనలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని సాధించామని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రతీ సంవత్సరం టర్నోవర్ లక్ష్యం పెంచుకొంటూ ఆ మేరకు ఫలితాలు సాధిస్తూ వచ్చామన్నారు. రూ. 2 వేల కోట్ల టర్నోవర్‌ను సాధించడం ఆనందంగా ఉందన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పాలకవర్గం మహాజన సభ జరిగింది. డీసీసీ బ్యాంకు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన జరిగింది. సభను ఉద్దేశించి రవీందర్‌రావు మాట్లాడారు. బ్యాంకు సేవలు, ఆర్థికాభివృద్ధి, రుణాలు, రైతు రుణమాఫీ, రుణాల రికవరీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మల్టీ సర్వీసు సెంటర్ల నిర్వహణ తదితర అంశాలను రవీందర్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభకు వివరించారు.

రూ.2 వేల కోట్ల టర్నోవర్

రూ.860 కోట్ల నుంచి రూ. 2 వేల కోట్ల టర్నోవర్ దశకు బ్యాంకు చేరడం మాములు విషయం కాదన్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యుల సమష్టి కృషే కారణమన్నారు. తమ పాలకవర్గం ఏర్పడిన సమయంలో రూ.860 కోట్ల టర్నోవర్‌తో బ్యాంకు ఉందన్నారు. ప్రతీ సంవత్సరం టర్నోవర్ లక్ష్యం పెంపు ప్రణాళికను రూపొందించుకున్న సమయంలో అనేక అవరోధాలు ఏర్పడ్డాయన్నారు. అయితే బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకు సాగామన్నారు. ఈ ప్రయాణంలో రూ.1160 కోట్ల టర్నోవర్‌కు చేరడం మాకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.

కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా నిలిచిందని చైర్మన్ రవీందర్‌రావు పేర్కొన్నారు. ఒకప్పుడు డీసీసీ బ్యాంకు అంటే రైతులకు పరిమితమని భావన ఉండేదన్నారు. కానీ ఇప్పుడా పేరే లేదన్నారు. కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడీ సేవలు అందుతున్నాయన్నారు.

అన్ని వర్గాల విశ్వాసాన్ని పొందాం...

బ్యాంకు సేవలను విస్తరించడం వల్ల రైతులకే కాకుండా అన్ని వర్గాల విశ్వాసాన్ని పొందగలిగామని రవీందర్‌రావు వెల్లడించారు. పంట రుణాలతో పాటు వ్యాపార, విద్య, స్వయం ఉపాధి రంగాలకు సైతం బ్యాంకు రుణాలను విస్తరించడంతో పాటు ప్రజల ఆదరాభిమానాలను బ్యాంక్ చూరగొంటుందన్నారు. ముఖ్యంగా దళారీ వ్యవస్థ లేకుండా రైతులు ఇతర వర్గాలకు రుణాల అందజేత జరిగిందన్నారు. రుణాల మంజూరిని అన్ని వర్గాలకు విస్తరించడంతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ జీవితాల్లో ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌హెచ్‌జీలకు కోట్లలో రుణాల కల్పన జరుగుతుండడంతో మహిళలు ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నారని తెలిపారు.

ఏ గ్రేడ్ సాధనతో బాధ్యత మరింత పెరిగింది...

రాష్ట్రంలోనే వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ అన్ని విభాగాల్లో ఉన్నత ఫలితాలను సాధిస్తోందని రవీందర్‌రావు వెల్లడించారు. గతంలో నాబార్డ్ ప్రకటిత ర్యాంకుల్లో వరంగల్ చివరలో ఉండేదన్నారు. కానీ ఈ సారి 'ఏ' గ్రేడ్‌ను సాధించిన ఘనతను దక్కించుకుందన్నారు.

తొలి సారిగా మల్టీ సర్వీసు సెంటర్ల ఏర్పాటు

డీసీసీ బ్యాంకు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో మల్టీ సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పీఏయస్‌లు ఈ సెంటర్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా వృద్ధిని సాధిస్తున్నాయన్నారు. మల్టీ సర్వీసు సెంటర్ల ఏర్పాటులో భాగంగా పీఏసీయస్ ఆధ్వర్యంలో గోదాంల నిర్మాణం, నిర్వహణ, పెట్రోల్ బంకులు, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్ తదితర వ్యాపార సంస్థలు ఏర్పడ్డాయన్నారు. వీటి ద్వారా లభించే ఆర్థిక వనరులతో పీఏసీయస్‌లు స్వయం ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నాయన్నారు. బ్యాంకు టర్నోవర్ ప్రగతితో పాటు అనేక విభాగాల్లో ఉన్నతి ఫలితాలను సాధించడం పట్ల చైర్మన్ రవీందర్‌రావును బ్యాంకు అధికారులు, సభ్యులు అభినందించారు.

డీసీవోల తీరుపై మండిపాటు

సమావేశంలో పాలకవర్గ సభ్యులు పలువురు డీసీవోల తీరుపై మండిపడ్డారు. కొందరు డీసీవోలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బ్యాంకు సేవలను రైతులు ఇతర వర్గాలకు అందచేయడమే లక్ష్యంగా తాము పని చేస్తుంటే డీసీవోలు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ పద్ధతిని మార్చుకోని పక్షంలో తమ ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, బ్యాంకు వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరిప్రసాద్, మురళీధర్, రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, రంజిత్, గోపాలరావు, శ్రీనివాస్, నరేందర్, రవిరాజా, సంజీవరెడ్డి, డీజీయం అశోక్, నాబార్డ్ డీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభలకు ఏర్పాట్లు చేయండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- నేటి నుంచి బల్దియా పరిధిలో వార్డు సభల నిర్వహణ

వరంగల్ కార్పొరేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో మంగళవారం నుంచి నిర్వహించే వార్డు సభలకు అన్ని రకాల పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని బల్ది యా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం బల్దియా కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు వెల్లడించాలని తెలిపారు. కాగా, కాశిబుగ్గ సర్కిల్ వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో మంగళవారం నుంచి 12, 36, 37, 40 వార్డులలో వార్డు సభలు జరుగుతాయని ఆమె తెలిపారు. ఇంకా వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజక వర్గంలోని 11, 16వ వార్డులలో సభలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే వర్ధన్నపేట అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని 14వ వార్డులో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా కాజీపేట సర్కిల్ పరిధిలో 1, 7, 47, 51, 52, 53, 59, 61, 66 వార్డులలో సభలు జరుగుతాయని సిబ్బంది అక్కడ కావలసిన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ తెలిపారు.

మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ షురూ

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పరస్పర బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారంనుంచి వరంగల్, హనుమకొండ జిల్లాల డీఈవో కార్యాలయాల్లో పరస్పర బదిలీలకు దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయుల నుంచి అండర్‌టేకింగ్ సర్టిఫికెట్లు, వివరాలు సేకరిస్తున్నారు. మంగళవారం కూడా కొనసాగనున్న ప్రక్రియలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల వివరాలను డీఈవోలు పరిశీలిస్తున్నారు.

ప్రకాశ్‌కు ఉత్తమ పర్యావరణవేత్త అవార్డు

కాజీపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాజీపేటకు చెందిన పర్యావరణ వేత్త ప్రకాశ్‌కు రోటరీ క్లబ్ ఉత్తమ పర్యావరణ వేత్త, వేకేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందించింది. ఈ మేరకు ఆదివారం రాత్రి వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు వి.రమేశ్, శరత్‌బాబు, రాజగోపాల్ చేతుల మీదుగా ప్రకాశ్ ఈ అవార్డు తీసుకున్నారు.

బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా

హసన్‌పర్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ పరిధి బృందావన్ కాలనీకి చెందిన పాలకుర్తి భాగ్యలక్ష్మి గతేడాది విద్యుతాఘాతంతో మృతి చెందింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే నాగరాజు చేతుల మీదుగా సోమవారం తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖ నుంచి అందించిన రూ.5 లక్షల పరిహారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఏ కె.రాజు, లైన్ ఇన్‌స్పెక్టర్లు మొగిలయ్య, డివిజన్ నాయకులు గడ్డం శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఇన్‌స్పెక్టర్

కాజీపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను సోమవారం కాజీపేట ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి ఎస్ఆర్‌వీ రావు పాల్గొని పోటీలను ప్రారంభించారు. డీఎల్ఎస్ కాజీపేట, ఈఎల్ఎస్ కాజీపేటల మధ్య జరిగిన పోటీలలో డీఎల్ఎస్ జట్టు విజయం సాధించింది. అనంతరం ఆర్పీఎఫ్ కాజీపేట, ట్రాక్‌మెకానిక్ కాజీపేటల మధ్య పోటీలలో ఆర్పీఎఫ్ జట్టు విజయం సాధించింది. రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్,సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, అందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం నేపథ్యంలో వివిధ కార్యక్రమాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో జాతీయ ఓటర్ల దినోత్సవానికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు నారాయణ, రాథోడ్ రమేష్, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్ కుమార్, డీఈవో వాసంతి, ఇతర శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి సమాజసేవ శిక్ష

కాజీపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిని ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి కె.రాజశేఖర్ రెడ్డి విచారించి దేవర సది, ఎ.కుమారస్వామి, మల్లేశం, ఎస్.రాకేశ్‌లకు సమాజసేవ చేయాలని శిక్ష విధించారు. వీరిని కాజీపేట సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషన్‌కు ఎదుట హాజరుపర్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. నాగబాబు తెలిపారు.

జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌కు దేవకి ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28నుంచి 30 వరకు కలకత్తా లోని సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయస్థాయి జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు హనుమకొండ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ హాస్టల్‌కు చెందిన కందికొండ దేవకి ఎంపికైనట్లు జిల్లా డీవైఎస్‌వో అశోక్‌కుమార్ తెలిపారు. ఈనెల 11న హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో దేవకి అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు అశోర్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన దేవకిని సోమవారం డీఎస్‌ఏ కార్యాలయంలో అశోక్‌కుమార్‌తో పాటు ఎస్‌జీఎఫ్‌ఐ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

హెడ్ కానిస్టేబుల్ జయరాజ్‌కు అవార్డు

మడికొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్, వరంగల్ వారి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ వారు సోమవారం వరంగల్‌లో నిర్వహించిన ఒకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు సెర్మనీ-2024-25లో పలు విభాగాలలో ప్రజలకు సేవలందించిన 20 మందికి అవార్డులు ప్రకటించారు. ఇందులో భాగంగా మడికొండ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ రక్తదానం, నిరుపేద కుటుంబాల ప్రజలకు ప్రతీనెల నిత్యావసర సరుకుల పంపిణీ, సైకిల్ తొక్కుతూ పర్యావరణ పరిరక్షణ, కళ్ళు, శరీరదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ సేవలను గుర్తించి రోటరీ క్లబ్ వారు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్‌ను శాలువా కప్పి మెమోంటోతో సత్కరించారు.

గణిత కాన్ఫరెన్స్‌లో రామన్ విద్యార్థుల ప్రతిభ



రామన్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రాజేష్‌కుమార్

హనుమకొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మైసూర్ వేదికగా జరిగిన అంతర్జాతీయ గణిత కాన్ఫరెన్స్‌లో రామన్ విద్యార్థులు పవర్ పాయింట్ ప్రదర్శనలో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ప్రతీ సంవత్సరం గణిత శాస్త్ర జాతీయ స్థాయిలో మేధావుల సమావేశంలో వివిధ గణిత శాస్త్ర అంశాలపై సమావేశం నిర్వహించి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులను గణిత శాస్త్ర అంశాలపై ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. దేశ నలుమూలల నుంచి గణితంలో పాల్గొన్న సమావేశంలో హనుమకొండ రామన్ స్కూల్ విద్యార్థులు సిరిచందన, యుక్తశ్రీ, విద్యార్థులు ఫ్రం శేఫ్టు సొల్యూషన్ - జామెట్రిక్ ఇన్ సైట్స్ ఇన్ ఇంటు ఆన్ ఈక్వేషన్, 10 వ తరగతి విద్యార్థులు ప్రణయ్, సాయి, శ్రీకర్‌లు ఎక్స్ ప్లోరింగ్ ఏ ట్రయాంగిల్ ప్రా బ్లం-అనలైజింగ్ మోడిఫికేషన్స్ , సూర్య వైష్ణవి, లాస్యా విద్యార్థులు ఇన్వెస్టిగేటింగ్ ద అనా మలస్ బిహేవియర్ ఇన్ ఏ జామెట్రిక్ సీక్వెన్స్ ఆఫ్ పోలీగోన్స్, మోహిత్ రమణీత్‌లు మాస్టరింగ్ ద బేస్ 3 నంబర్‌సిస్టం - ఏ ఫన్ అండ్ బై 7 అను అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్స్ ఇచ్చి గణిత శాస్త్ర పండితుల మన్ననలను పొందారని తెలిపారు. తదుపరి జరిగిన క్విజ్ పోటీలో గణిత ఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో పాల్గొని జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రదర్శనతో ప్రథమ , ద్వితీయ, తృతీయ బహుమతిని పొందినట్లు తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌కుమార్ , రామినేని , డైరెక్టర్ పురుషోత్తం తీర్థాల మడికొండ ప్రిన్సిపల్ స్రవంతి, హనుమకొండ ప్రిన్సిపల్, విద్యార్థులను అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం

- నగర మేయర్ గుండు సుధారాణి
- మహిళా కార్పొరేటర్లకు క్రీడాపోటీలు షురూ



బ్యాడ్మింటన్ ఆడుతున్న కమిషనర్ అశ్విని, మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా ఇండోర్ స్టేడియంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా కార్పొరేటర్లకు వివిధ విభాగాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం క్రీడాకారులకు, క్రీడలకు ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. క్రీడాపాలసీ రూపొందించడానికి చర్యలు చేపడుతున్నారని గుర్తు చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సీఎం కప్ నిర్వహించడం జరిగిందని అన్నారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో మేయర్ సుధారాణితో పాటు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. తర్వాత మహిళా కార్పొరేటర్లకు చెస్, క్యారమ్స్, కబడ్డీ, మ్యూజికల్ చైర్, టాగ్ ఆఫ్‌వార్ పోటీలను నిర్వహించారు. ఇంకా పురుష కార్పొరేటర్లకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

ఈకార్యక్రమంలో అరుణకుమారి, శిభారాణి, పద్మ, చందన, వసంత, రాధికరెడ్డి, శిరిషా, తేజశ్వి, విజయశ్రీ, జక్కుల రజిత, దివ్యారాణి, అనిత, మానస, లోహిత, డీఎఫ్‌వో తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫార్మసీ విభాగంలో అంతర్జాతీయ వర్క్‌షాప్

కేయూ క్యాంపస్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల నేతృత్వంలో కేయూ సెనెట్ హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు ఒక రోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరడి ప్రసాద్ సోమవారం తెలిపారు. 'డ్రగ్ డిస్కవరీ ఇన్నోవేషన్స్ అండ్ డెవలప్‌మెంట్'(డీడీఐడీ-2025) అనే అంశంపై సదస్సు ఉంటుందని తెలిపారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, బీవోఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ జె.కృష్ణవేణి, అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి న్యూ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఫార్మసీ శాస్త్రవేత్త, కేయూ అల్యూమిని డాక్టర్ డి.సాంబరెడ్డి కీలక ఉపన్యాసం చేస్తారని వివరించారు. ప్లీనరీ స్పీకర్‌గా యూఎస్‌కు చెందిన ఫార్మసీ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్‌రెడ్డి, స్పెషల్ స్పీకర్‌గా హైదరాబాద్ డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎ.రామ్‌కిషన్, హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ జి.రాంధన్, ఇన్‌వైట్ స్పీకర్‌గా హైదరాబాద్ క్రిస్టల్ ఓవర్సీస్ అండ్ క్లీన్ పార్మెడ్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ డాక్టర్ మహేశ్ అరుందులు వ్యవహరిస్తారని తెలిపారు. ఫార్మసీ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులందరూ హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

సాగునీటి సంఘాలు.. మళ్లీ తెరపైకి!

(5వ పేజీ తరువాయి)

జరగాల్సి ఉన్నా నాటి తెలంగాణ ఉద్యమ తీవ్రత కారణంగా నిర్వహించలేదు. అప్పటికే ఉన్న పాలకవర్గాలనే కొనసాగిస్తూ ప్రత్యేక జీవోలు తీసుకువచ్చారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిన తరువాత సాగునీటి సంఘాలను ప్రభుత్వం పట్టించుకోలేదు. చెరువులను సాగునీటి సంఘాల ద్వారా కాకుండా మిషన్ కాకతీయ పేరుతో అధికారులతోనే అభివృద్ధి చేసే కార్యక్రమం తీసుకున్నారు. దీంతో సాగునీటి సంఘాలు పూర్తిగా ఉనికిని కోల్పోయాయి.

నేతలకు పదవులు

నీటి వనరులను కాపాడుకోవటంతో పాటు ఉత్సాహవంతమైన నాయకత్వ లక్షణాలున్న నాయకులకు ఈ పదవులు ఇవ్వడం వల్ల కొంత మేరకు రాజకీయ నిరుద్యోగిత తీరుతుందన్న అభిప్రాయం ఉంది. వివిధ హోదాల్లో నాయకులు ఉండటం వల్ల వారు పార్టీ అభివృద్ధికి కృషి చేసే అవకాశం ఉంటుంది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో నీటి సంఘాల పదవులు అందుబాటులోకి వస్తాయి.

సాగునీటి సంఘాలంటే..

రైతుల సమూహాలు సాగునీటి అవసరాలను సమన్వయం చేసుకొని, నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు కలిసి పనిచేయడానికి, నీటి పంపిణీ, కాలువల నిర్వహణ, నీటి నాణ్యతా పరిరక్షణకు ఉద్దేశించి ఏర్పాటు చేసేవి సాగునీటి సంఘాలు. నీటి నిర్వహణలో ఈ సంఘాల పాత్ర ఎంతో ఉంటుంది. అందరికి సమానంగా నీరు అందేలా చూడడం, నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా నీటి వృథాను తగ్గించడం, కాలువలను శుభ్రంగా ఉంచడం, వాటికి ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయడం, నీటి నాణ్యతను కాపాడడానికి చర్యలు తీసుకోవడం, నీటి వినియోగంలో రైతుల మధ్య సహకారాన్ని పెంపొందించడం సాగునీటి సంఘాల ప్రధాన విధులు. సాగునీటి సంఘాలు ఏర్పాటయితే అవి నీటి నిల్వలు, పంపిణీ షెడ్యూల్ నిర్వహణను పకడ్బందీగా అమలు చేస్తాయి. నీటి నాణ్యతను పరీక్షించడంతో పాటు ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని, నీటి అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలలో పాలుపంచుకుంటాయి. రైతు సంఘాల ఏర్పాటు తర్వాత ప్రభుత్వం వాటికి అవసరమైన ఆర్థిక సాయం, శిక్షణ, సాంకేతిక సహాయం అందిస్తుంది. సాగునీటి సంఘాలు రైతుల జీవనాధారమైన వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడతాయి. ఈ సంఘాలను బలోపేతం చేయడం ద్వారా నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు.

హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన మూఖలను శిక్షించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శంభునిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్, కాజీపేటలోని ఉర్సుదర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ... దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే సమాజంలో ఉపాధ్యాయుడికి గౌరవ మర్యాదలు సన్నగిల్లుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్‌పాల్, మక్బూల్, రమాదేవి, వీరాచారి, ప్రవీణ్‌కుమార్, జ్యోతి, శ్రీనివాస్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

'మల్లికాంబ'కు ఎల్లవేళలా సహాయం అందిస్తాం : కడియం

- మానసిక దివ్యాంగులకు రూ.లక్ష ఆర్థిక సహాయం



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో దివ్యాంగ చిన్నారులతో కడియం శ్రీహరి దంపతులు

హనుమకొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మల్లికాంబ మనోవికాస కేంద్రంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి దంపతులు వివాహ వార్షికోత్సవ వేడుకలను మానసిక దివ్యాంగులతో కలిసి సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, దివ్యాంగులకు కడియం శ్రీహరి దంపతులు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ మనోవికాస కేంద్రంలోని దివ్యాంగులు తన కుటుంబ సభ్యులన్నారు. దివ్యాంగుల మధ్య వివాహ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మల్లికాంబ మనోవికాస కేంద్రంలో నిర్వాహకులు అందిస్తున్న సేవలు గొప్పవని వారికి కడియం శ్రీహరి అభినందనలు తెలిపారు. మల్లికాంబ మనోవికాస కేంద్రానికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కడియం ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం ఫౌండర్ రామలీల, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

- టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థ పటిష్ఠంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మాస్టర్జీ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడారు. దేశంలో ప్రభుత్వఉద్యోగాలలో అతి పవిత్రమైనది ఉపాధ్యాయ వృత్తి అన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 317 జీవో వల్ల వేలాది మంది ఉపాధ్యాయ కుటుంబాలు స్థానికతను కోల్పోయి కుటుంబాలకు దూరమై అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే కేజీబీవీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ముందుండి పోరాడుతానన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తానని, ఉపాధ్యాయుల సమస్యలపై చట్టసభలలో కొట్లాడి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, పలువురు యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

మీరా సంగీత మండలి ఆధ్వర్యంలో వాగ్గేయకారుల వారోత్సవం

హనుమకొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మీరా సంగీత మండలి ఆధ్వర్యంలో సోమవారం వాగ్గేయకారుల వారోత్సవం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని సామ జగన్ మోహన్‌రెడ్డి హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ , మీరా సంగీత మండలి వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలం గాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్, డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీరా సంగీత మండలి అధ్యక్షుడు గుమ్మడి జనార్ధన్ , సభ్యులు కూనూరు శ్రీనివాస్, పోతనాచారి హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరుగల్లు ఉత్తమ ఫ్లూటిస్టు ఈగ సాంబయ్యకు కార్యక్రమంలో ఉత్తమ కళాకారుడిగా కూనూరు సుగుణ స్మారక పురస్కారం అందించారు. పురస్కారంతో పాటు రూ.10వేలు, కూనూరు శ్రీనివాస్ అందజేశారు. స్థానిక, స్థానికేతరుల కళాకారులచే గాత్ర కచేరీలు, ప్రారంభ నృత్యం, ప్రముఖ కూచిపూడి కళాకారిణి కూనూరి హిమతేజ ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, మీరా సంగీత మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు నరహరి వేణుగోపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఫారెస్టు అధికారి పురుషోత్తం, ఎ.జగన్మోహన్‌రావు, వనం లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల పోరాట ఫలితమే వర్గీకరణ

- వేయిస్తంభాల ఆలయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



రుద్రేశ్వరుడికి అభిషేకం చేస్తున్న మాదిగ దండోరా నేతలు

హనుమకొండ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు చొరవతో ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శివప్రీతికర సోమవారం ఆయన ఎమ్మార్పీఎస్ నేతలు మంద కృష్ణ మాదిగ, ప్రముఖ రచయిత మిట్టపెల్లి సురేందర్ తదితరులతో కలిసి ఆయన రుద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ వారిచే ప్రత్యేక పూజల అనంతరం ఆలయ నాట్యమండపంలో శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీంలో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిననాడే అసెంబ్లీలో వర్గీకరణ ఆమోదింపజేస్తామని చెప్పడం హర్షించదగ్గ పరిణామమని చెప్పారు. కోర్టుఆదేశానుసారం ముఖ్యమంత్రి తప్పక ఈ నిర్ణయం అమలు చేస్తారన్నారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ తమకు వర్గీకరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను ఆమోదింపజేయాలని కోరారు. బీసీల పక్షాన, బ్రాహ్మణులు, ఆర్యవైశ్యులపక్షాన కూడా అవసరానికి తాము ముందు నిలబడతామని చెప్పారు. ఇది మాల మాదిగల యుద్ధం కాదని సమాజ శ్రేయస్సు కోసమని చెప్పారు. బీజేపీ నాయకులు కోడెం శ్రీధర్, అరూరి రమేశ్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను కలిసిన టీఎన్‌జీవోలు

హనుమకొండ కలెక్టరేట్ : హనుమకొండకు వచ్చిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సోమవారం టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మల్లన్నను కలిసిన వారిలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు రామునాయక్, లక్ష్మీప్రసాద్ తదితరులు ఉన్నారు.

తీన్మార్ మల్లన్న.. సుందర్‌రాజ్‌యాదవ్ భేటీ

హనుమకొండకు సోమవారం వచ్చిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో టీచర్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ తన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్ తీన్మార్ మల్లన్నకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఇరువురు కాసేపు విజయభేరిసభ గురించి చర్చించుకున్నారు.

కొత్తూర్‌లో చైన్‌స్నాచింగ్

- ఆరు గంటల్లో ఛేదించిన సీసీఎస్ పోలీసులు

వరంగల్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పీఎస్ పరిధిలోని కొత్తూర్ జెండా ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం చైన్ స్నాచింగ్ చేసిన నిందితుడిని సీసీఎస్ పోలీసులు 6 గంటల్లో పట్టుకుని సుమారు 3 లక్షల విలువ చేసే 5 తులాల బంగారం గొలుసును స్వాధీనం చేసుకున్నారు.. వివరాల్లోకి వెళితే కొత్తూర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన మెండి లక్ష్మీ సోమవారం మధ్యాహ్నం సుమారు 12.30 ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా మాతా బార్ వెనుకాల ఓ యువకుడు ఆమెను వెంబడించి మెడలోని 5 తులాల బంగారం తాడును లాక్కొని పరారైయ్యాడు. సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు 6 గంటలు శ్రమించి నిందితుడిని పట్టుకున్నారు. కాగా, నర్సంపేట ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడే ఈ స్నాచింగ్‌కు పాల్పడ్డట్లు తెలుస్తోంది. గత నెల రోజులుగా కొత్తూర్ జెండాలో ఉంటూ రెక్కీ నిర్వహించి స్నాచింగ్‌కు పాల్పడినట్లుగా సమాచారం.

నగరంలో సీపీ ఆకస్మిక తనిఖీ

వరంగల్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సోమవారం తెల్లవారుజామున నగరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వరంగల్ రైల్వే స్టేషన్‌తో పాటు ఏటీఎం సెంటర్లను సీపీ సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. రాత్రి సమయాల్లో పోలీస్ సిబ్బంది పని తీరును గమనించేందుకు హనుమకొండ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు.

చోరీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్టు

- రూ.8.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతన్న దంపతులను హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రూ.8.50 లక్షల విలువైన సుమారు 100 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటారం గ్రామానికి చెందిన సత్యనారాయణ కూలిపనులు చేస్తుండగా ఆయన భార్య చెల్ల స్వప్న దివ్యాంగురాలు కావడంతో ఇంటివద్దే ఉండేది. ఈ క్రమంలో వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని చోరీలు చేస్తూ సులభంగా డబ్బులు సంపాదించేందుకు అలవాటు పడ్డారు. గత సంవత్సరం ఫిబ్రవరి, మార్చి, డిసెంబరు మాసాల్లో హనుమకొండ బస్టాండ్‌లో ఇద్దరు మహిళల మెడలో నుంచి పుస్తెల తాడును దొంగిలించారు. మరోసారి అదే బస్టాండ్‌లో ఓ మహిళ సైడ్‌బ్యాగుతో పాటు మరో ఇద్దరి వద్ద బంగారు ఆభరణాలు మాయం చేశారు. ఈ వరుస సంఘటనలపై ఫిర్యాదు అందుకున్న హనుమకొండ పోలీసులు టెక్నాలజీని ఉపయోగించి కేసు దర్యాప్తు చేపట్టారు. సోమవారం హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లో సదరు దంపతులు చోరీ చేసిన ఆభరణాలను విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులను ఆదుపులోకి తీసుకొని విచారించగా హనుమకొండ కుమార్‌పల్లిలో అద్దెకు ఉంటూ బస్టాండ్‌లో చోరీలు చేసినట్లుగా ఒప్పుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ పోలీసులను ఏసీపీ అభినందించారు.

కలెక్టరేట్ ఎదుట గీత కార్మికుల నిరసన

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గీతకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌వో వైవి గణేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య, బుర్రశ్రీనివాస్, సుధాకర్, గంగాధర, నాగరాజు, వీరస్వామి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య డాక్టర్

9

మంగళవారం • 21 జనవరి 2025



గర్భిణి | ఆరోగ్యం

గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా...

కడుపు నిండా తినలేని చిత్రమైన పరిస్థితిని గర్భిణులు ఎదుర్కొంటూ ఉంటారు. కొద్దిపాటి భోజనంతోనే పొట్ట నిండిపోతూ ఉంటుంది. కాబట్టి తీసుకునే కొద్దిపాటి ఆహారం పోషకభరితంగా ఉండేలా చూసుకోవాలి. అందుకోసం ఈ నియమాలు పాటించాలి.

- గర్భిణి సాధారణం కంటే 300 క్యాలరీలు అధికంగా తీసుకోవాలి. ఇందుకోసం తక్కువ ఆహారంలో ఎక్కువ క్యాలరీలు ఉండేలా, పోషకభరిత పదార్థాలనే ఎంచుకోవాలి.
- గర్భిణి తీసుకునే క్యాల్షియం మీదే కడుపులో పెరిగే బిడ్డ ఎముకల దృఢత్వం ఆధారపడి ఉంటుంది. కాబట్టి గర్భిణులు తప్పనిసరిగా పాలు, పెరుగు, జున్ను లాంటివి తీసుకుంటూ ఉండాలి.
- ఐరన్ సమృద్ధిగా శరీరానికి అందడం కోసం ప్రతి రోజూ ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలి. నట్స్, డ్రై ఫ్రూట్స్, పండ్ల రసాలు తీసుకోవాలి.
- వాంతుల సమస్య వేధిస్తున్నా, కడుపు నిండిన భావనతో ఆకలి మందగిస్తున్నా అశ్రద్ధ చేయకుండా వైద్యులను కలవాలి. ఒకేసారి భారీ భోజనం చేయకుండా, తక్కువ పరిమాణాల్లో ఎక్కువసార్లు ఆహారం తీసుకునే ప్రయత్నం చేయాలి.
- ఫోలేట్ కోసం కమలా పండ్లు తరచుగా తింటూ ఉండాలి. ఈ పండ్లు తినడం వల్ల సాధారణంగా గర్భిణులను వేధిస్తూ ఉండే మలబద్ధకం దరి చేరకుండా ఉంటుంది.
- చిగుళ్ల వాపు, దంత సమస్యలు లాంటి చిన్నాచితకా ఆరోగ్య సమస్యలు గర్భిణుల్లో సహజం. అయితే వాటికి చిట్కాలు పాటించడం మాని, వైద్యుల సూచన మేరకు నడుచుకోవాలి. అలాగే స్వీయ చికిత్సలో భాగంగా యాంటీబయాటిక్ మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదు.

మీకు | తెలుసా?

చక్కెర మారువేషాల్లో...

ఆహారంలో చక్కెరను పూర్తిగా మానేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దక్కుతాయి. అయితే మనం చక్కెరతో తయారయ్యే తీపి వంటకాలను మాత్రమే చక్కెరగా చూస్తాం తప్ప చక్కెర మారువేషాలు కోకొల్లలు. కాబట్టి వాటి పట్ల కూడా అవగాహన పెంచుకోవాలి.



సుక్రోజ్, ఫ్రక్టోజ్, మాల్టోజ్... ఇవన్నీ చక్కెర మారువేషాలు. చెరకు రసం కూడా చక్కెర పాకమే! ఇవే కాకుండా....

- కెచప్, సలాడ్ డ్రెస్సింగ్స్, బార్బెక్యూ సాస్
- బ్రెడ్, మఫిన్స్
- రెడీమేడ్ సిరీల్స్, కార్న్ ఫ్లేక్స్
- గ్రనోలా బార్స్, ప్రొటీన్ బార్స్ పీనట్ బటర్
- పండ్లు, పండ్లరసాలు
- ప్యాకెట్లలో దొరికే చిరుతిళ్లు

ప్రారంభంలో చక్కెరను పూర్తిగా మానేయడం సాధ్యపడకపోవచ్చు. కాబట్టి మొదట్లో చక్కెర బదులుగా తక్కువ మోతాదుల్లో తేనె, బెల్లం వాడుకోవచ్చు. చక్కెర పూర్తిగా మానేసిన తర్వాత తీపి తినడానికి ఖర్జూరాలను ఎంచుకోవచ్చు.

క్యాన్సర్ | రక్ష

అండాశయాలకు క్యాన్సర్ సోకితే?

కొన్ని వ్యాధుల లక్షణాలు ఆందోళన కలిగించేంత తీవ్రంగా ఉండవు. కొన్ని లక్షణాలు ఇతరత్రా సాధారణ రుగ్మతలను పోలి ఉంటాయి. దాంతో అంతర్గతంగా వ్యాధి ముదిరిపోయే వరకూ కనిపెట్టలేకపోతూ ఉంటాం! అలాంటి వ్యాధుల కోవకు చెందినదే 'అండాశయ క్యాన్సర్'!



రొమ్ము క్యాన్సర్‌కు మాదిరిగా ముందస్తు వ్యాధినిర్ధారక పరీక్షలు లేకపోవడం మూలంగా అండాశయ క్యాన్సర్ మరణాలు పెరుగుతున్నాయి. అయితే ఈ క్యాన్సర్‌కు మూల కారణాన్ని కనిపెట్టే వీలు లేకపోయినా, సరైన సమయంలో లక్షణాలను గుర్తించి, వెంటనే చికిత్స మొదలుపెట్టగలిగితే క్యాన్సర్‌ను నిర్మూలించడం కష్టమేమీ కాదు. ఇందుకోసం లక్షణాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అవేంటంటే...


- కడుపు ఉబ్బరం, కడుపులో ఒత్తిడి, నొప్పి
- తిన్న వెంటనే కడుపులో ఇబ్బందికరంగా ఉండడం, ఆకలి మందించడం
- తరచూ మూత్ర విసర్జన చేయాలని అనిపించడం
- అజీర్తి, మలబద్ధకం
- విపరీతమైన వెన్ను నొప్పి, ఛాతీలో మంట
- అస్తవ్యస్థ రుతుక్రమం

ఈ లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే స్త్రీల వైద్యులను సంప్రతించాలి.

ఎవరికి రావచ్చు?

క్యాన్సర్ సంక్రమించడానికి పలు కారణాలు ఉంటాయి. అయితే కొందరికి ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. వారు ఎవరంటే...

- అండాశయ క్యాన్సర్ వచ్చిన రక్తసంబంధీకులు కలిగినవారు
- కాలక్రమేణా మార్పు చెందిన అండాశయ క్యాన్సర్‌కు చెందిన జన్యువులు కలిగి ఉన్న వారు
- రొమ్ము, పెద్దపేగు, మూత్రాశయ క్యాన్సర్లకు గురయినవారు
- ఊబకాయం కలిగినవాళ్లు
- పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన చికిత్సలు, హార్మోన్ చికిత్సలు తీసుకున్నవారు
- జీవితకాలంలో గర్భం దాల్చని మహిళలు




పెద్ద వయసులో దంత సమస్యలు సహజమే! అయితే వాటిని సరిదిద్దడానికి దవడల అరుగుదల, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు అడ్డుపడొచ్చు. వీటన్నిటినీ అధిగమించి, పలువరసను పక్కాగా చక్కదిద్దే దంత చికిత్సలు అందుబాటులోకొచ్చాయని భరోసా కల్పిస్తున్నారు వైద్యులు. వాటి గురించి తెలుసుకుందాం!

దంత | శిరి

ఖాళీగా వదిలేస్తే...

ఊడిపోయిన దంతాల స్థానంలో కొత్త దంతాలను అమర్చుకోవడం కూడా తప్పనిసరి. లేదంటే దవడలు హెచ్చుతగ్గులకు లోనై దవడ కీళ్ల మీద ఒత్తిడి పెరుగుతుంది. ఆహారం తినే సమయంలో కూడా ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి ఉన్న దంతాల ఆసరాతో ఖాళీలను భర్తీ చేసే సెరామిక్ లేదా జెర్కోనియం బ్రిడ్జెస్‌ను అమర్చుకోవలసి ఉంటుంది. ఇంప్లాంట్ ప్రాస్థటిక్స్... సెరామిక్, జెర్కోనియం లేదా అక్రిలిక్‌లతో తయారవుతాయి. స్థోమతను బట్టి తగినదాన్ని ఎంచుకోవచ్చు. ఈ కృత్రిమ దంతాలన్నీ 10 నుంచి 20 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉంటాయి. నోట్లో అమర్చే మొత్తం పళ్ల సెట్టు (కంప్లీట్ డెంచర్స్) ఐదు నుంచి ఆరేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది.



పెద్దల పలువరస పక్కాగా...

'వయసైపోయింది కాబట్టి, దంతాలు ఊడిపోవడం సహజమే! ఇక ఈ వయసులో కొత్త దంతాలు కట్టించుకోవలసిన అవసరం ఏముంది?' అనే నిర్లిప్తత ఎక్కువ మంది పెద్దల్లో ఉంటుంది. కొందరికి కొన్ని దంతాలు ఊడిపోయి, కొన్ని మిగిలిపోతూ ఉంటాయి. ఇంకొందరికి దంతాలన్నీ ఊడిపోయి, నోరు బోసిపోతుంది. ఇంకొందరికి దంతాల మూలాలు పుచ్చిపోతూ ఉంటాయి. ఎక్కువ మందికి దంతాలన్నీ అరిగిపోతూ ఉంటాయి. సున్నితత్వ సమస్య తీవ్రంగా ఉండి చల్లని, వేడి పదార్థాలు తీసుకున్నప్పుడు దంతాలు జివ్వుమంటూ ఉంటాయి. ఇవన్నీ తప్పనిసరిగా సరిదిద్దుకోవలసిన సమస్యలే! ఎందుకంటే.. పెద్ద వయసులో ఆరోగ్య వ్యవస్థల సామర్థ్యం ఎంతో కొంత సన్నగిల్లి ఉంటుంది. మధుమేహం, అధిక రక్తపోటు మొదలైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటాయి. అలాగే ఎముకల అరుగుదల, బలహీనతలు ఉంటాయి. ఈ సమస్యలన్నిటికీ మందులతో పాటు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం అవసరం. కానీ పోషకాల అవసరత ఎక్కువగా ఉండే పెద్ద వయసులోనే దంత సమస్యలు కూడా ఎక్కువవుతాయి. దాంతో ఆహారాన్ని పూర్తిగా నమిలి తినలేకపోవడం, పాక్షికంగా నమిలి మింగేయడం చేస్తూ ఉంటారు. ఫలితంగా పోషకలోపాలు తలెత్తడం, దాంతో శరీరం బలహీనపడి, ఆరోగ్య సమస్యలు తీవ్రమవడం... ఇలా మొత్తంగా ఆరోగ్యం క్షీణించే పరిస్థితి తలెత్తుతుంది. కాబట్టి పెద్దలు దంత సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

కొత్త దంతాలు ప్రయోజనకరం

పెద్దల్లో ఊడిపోయిన దంతాల స్థానంలో కొత్త దంతాలు అమర్చడం వల్ల మూడు రకాల ప్రయోజనాలుంటాయి. దంతాలు లేవనే ఆత్మన్యూనతతో నలుగురిలో కలవడానికి వెనకాడే పెద్దల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచవచ్చు. ఆహారాన్ని చక్కగా నమిలి తినగలిగే సౌలభ్యాన్ని అందించవచ్చు. దంతాల లోపంతో స్పష్టంగా మాట్లాడలేని పెద్దలకు చక్కగా మాట్లాడే సామర్థ్యాన్ని పెంచవచ్చు. ఈ మూడు ప్రయోజనాలు కీలకమైనవే! వీటితో పెద్దలు, మానసికంగా, శారీరకంగా... రెండు విధాలా కోలుకుంటారు. ఆత్మవిశ్వాసం పెరిగి, కుటుంబంతో అనుబంధాన్ని బలపరుచుకోగలుగుతారు, నలుగురితో కలవగలుగుతారు. నమిలి తినే ఇబ్బంది తొలగిపోతుంది కాబట్టి పోషకాహార లోపం సమస్య పరిష్కారమైపోయి, ఆరోగ్యం కూడా పుంజుకుంటుంది. కాబట్టి పాక్షిక దంత లోపాలు, దంతాలు, దంతాల మూలాలు పుచ్చిపోవడం లాంటి సమస్యలను రూట్ కెనాల్, ఫిల్లింగ్స్‌తో సరిదిద్దుకోవచ్చు. అలాగే దంతాలు లేని వాళ్లకు తీసి పెట్టుకోగలిగే లేదా శాశ్వతంగా అమర్చగలిగే కృత్రిమ దంతాలను ఆశ్రయించవచ్చు.

> కొన్ని హైపర్ టెన్షన్, హృద్రోగ ఔషధాలు చిగుళ్లను దెబ్బతింటూ ఉంటాయి. కాబట్టి ఈ మందుల వాడకం మొదలుపెట్టిన తర్వాత తరచూ చిగుళ్ల సమస్యలు తలెత్తుతూ ఉంటే, సంబంధిత వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి. అలాగే దంత చికిత్సలను ఆశ్రయించే హృద్రోగులు, రక్తాన్ని పలుచన చేసే మందులను తాత్కాలికంగా ఆపవలసి వస్తుంది. కాబట్టి ఆ సందర్భంలో వైద్యుల సలహా తీసుకోవడం తప్పనిసరి. పెద్దల్లో నోరు పొడిబారిపోయే సమస్య కూడా ఎక్కువే! ఈ సమస్య కూడా దంత సమస్యలను పెంచుతుంది. ఈ సమస్య ఉన్న పెద్దలు కృత్రిమంగా లాలాజలాన్ని ఉత్పత్తి చేసే మౌత్ వాష్‌లు వాడుకోవాలి.

కృత్రిమ దంతాలు ఇలా...

తీసి పెట్టుకోగలిగే దంతాలకూ, శాశ్వత దంతాలకూ వ్యత్యాసం ఉంటుంది. సాధారణంగా పెద్దల్లో దవడ ఎముకలు అరిగిపోయి ఉంటాయి. కొందర్లో ఇంప్లాంట్ బిగించడానికి వీలు లేనంత పలుచగా ఉంటాయి. దాంతో, వాళ్లు తీసి, పెట్టుకోగలిగే దంతాలను ఎంచుకుంటే, ఆ డెంచర్ దవడ మీద సక్రమంగా ఇమడకుండా కదులుతూ ఉంటుంది. అలాగే మాట్లాడేటప్పుడు డెంచర్ ఊడిపోతూ ఇబ్బంది పెడుతూ ఉంటుంది. అయితే ఇంప్లాంట్ డెంటిస్ట్రీ అభివృద్ధి సాధించినప్పటి నుంచీ, తీసి, పెట్టుకునే దంతాలతో పాటు శాశ్వత దంతాలను అమర్చే అధునిక చికిత్సలు ఊపందుకున్నాయి. దవడ ఎముక పలుచగా ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించే వైద్యపరమైన వెసులుబాట్లు వాడుకలోకొచ్చాయి. అరిగిపోయిన పై దవడలోకి



బిగించే 'టెరిగాయిడ్ డెంటల్ ఇంప్లాంట్స్', బుగ్గ ఎముకల్లోకి బిగించే 'జైగోమ్యాటిక్ డెంటల్ ఇంప్లాంట్స్', వ్యక్తి నోటి నిర్మాణానికి తగిన ఇంప్లాంట్స్ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఇంతకు ముందు వరకూ దవడలోకి స్క్రూలు బిగించే ఇంప్లాంట్స్ అందుబాటులో ఉండేవి. కానీ వాటి కోసం దవడ ఎముక దృఢంగా, సరిపడా మందంగా ఉండాలి. పెద్దల్లో దవడ ఎముక అరుగుదల సమస్య ఉంటుంది కాబట్టి ఆ రకమైన ఇంప్లాంట్స్ బిగించడం సాధ్యపడదు. బదులుగా ఆధునిక ఇంప్లాంట్స్‌ను అభివృద్ధి చేయడం జరిగింది.

ఆధునిక ఇంప్లాంట్స్ ఇలా...

దంతాలున్నంత వరకే దవడ ఎముకలు దృఢంగా ఉంటాయి. దంతాలు ఊడిపోయినప్పటి నుంచి వాటికి ఆసరా అందించే దవడ ఎముకలు అరిగిపోవడం మొదలుపెడతాయి. అయితే అలా దవడ ఎముకలు అరిగిపోయినా, బుగ్గ ఎముకలు మాత్రం దృఢంగానే ఉంటాయి. కాబట్టి పొడవాటి ఇంప్లాంట్‌ను బుగ్గల ఎముకల్లోకి అమర్చి, వాటి ఆధారంగా కృత్రిమ దంతాలను అమర్చవచ్చు. అలాగే పై దవడ ఎముక చివరన ఇంప్లాంట్స్‌ను అమర్చవచ్చు. ఇలా ఇంప్లాంట్స్ అమర్చడానికి లోకల్ అనస్థీషియా సరిపోతుంది. అలాగే ఇలాంటి ఇంప్లాంట్స్ అమర్చిన తర్వాత, ఎక్కువ కాలం ఆగకుండా వెంటనే కృత్రిమ దంతాలను బిగించుకోవచ్చు. అయితే ఎవరికి ఎలాంటి ఇంప్లాంట్స్ అవసరమన్నది తెలుసుకోవడం కోసం కోన్ బీమ్ సిటి స్కాన్ చేయవలసి ఉంటుంది. ప్రత్యేకించి నోట్లోని ఎముకల కోసం ఉద్దేశించిన ఈ సిటి స్కాన్‌లో రేడియేషన్ కూడా తక్కువగా ఉంటుంది. ఈ స్కాన్ ఆధారంగా ఏ ఎముకలో ఇంప్లాంట్ అమర్చుకోవచ్చు అన్నది వైద్యులు నిర్ణయిస్తారు. అయితే తక్కువ ఖర్చులో కృతిమ దంతాలు పెట్టించుకోవాలనుకునేవాళ్లకు తీసి, పెట్టుకునే పళ్ల సెట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే పైదవడలో ఇమిడిపోయినంత మెరుగ్గా కింది దవడ మీద పళ్ల సెట్టు ఇమడకపోవచ్చు. ఇలాంటప్పుడు కింది దవడలో రెండు ఇంప్లాంట్స్‌తో సరిపెట్టి, ఇంప్లాంట్ సపోర్టెడ్ ఓవర్ డెంచర్‌ను అమర్చుకోవచ్చు. స్నాప్ బటన్‌ను పోలిన, తీసి పెట్టుకోగలిగే ఈ కృత్రిమ సెట్టు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అలాగే కింది దవడ అరిగిపోయి, ఎత్తు తగ్గిపోతుంది కాబట్టి ఇంప్లాంట్‌ను ఏటవాలుగా అమర్చే పద్ధతిని కూడా వైద్యులు అనుసరిస్తూ ఉంటారు.

డాక్టర్ సి. శ రత్ బాబు
ప్రోస్థోడాంటిస్ట్ అండ్ ఇంప్లాంటాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్



ఆహారం | ఆరోగ్యం

వ్యాధినిరోధకశక్తి పెరగాలంటే?

వ్యాధినిరోధకశక్తిని పెంచే ఆహారం ఏది? వెనువెంటనే శక్తిగా మారే ఏ పదార్థమైనా వ్యాధినిరోధకశక్తిని పెంచేదే! ఏ ఆహారమైతే జీర్ణాగ్నిని కుంటుపరుస్తుందో అది వ్యాధినిరోధకశక్తిని తగ్గిస్తుంది. పరిపూర్ణంగా జీర్ణమవడం మూలంగా అందే శక్తి మంచి ఆరోగ్యానికి, సమతుల భావోద్వేగాలకు, వ్యాధినిరోధకశక్తికీ తోడ్పడుతుంది. సులభంగా జీర్ణం కాని ఆహారం తీసుకోవడం వల్ల ఒరిగే ఫలితం ఇందుకు విరుద్ధంగా, రోగనిరోధకశక్తిని కుంటుపరిచేలా చేస్తుంది. కాబట్టి ఆహారనియమాల పట్ల కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

తెలివిగా... తేలికపాటి ఆహారం!

పళ్లు, కూరగాయలు, పొట్టుతో కూడిన ధాన్యాలు, పప్పుదినుసులు, పాల ఉత్పత్తులు తేలికగా జీర్ణమవుతాయి. పొట్టు తీయకుండా, పాలిష్ పట్టకుండా ఉన్న పరిపూర్ణ ధాన్యాలు ఆహారంగా తీసుకున్నప్పుడు తేలికగా అరిగి త్వరిత శక్తినిస్తాయి. పాలిష్ పట్టిన, నిల్వ ఉంచిన, కృత్రిమ రుచులు జోడించిన పదార్థాలు అజీర్తిని కలిగించి శరీరంలో అగ్నిని రాజేస్తాయి. శక్తిని కణాలకు చేరకుండా చేస్తాయి. ఫలితంగా వ్యాధినిరోధకశక్తి సన్నగిల్లుతుంది. పురుగు మందులు, ఎరువులు వేయకుండా పండించిన సేంద్రీయ పంటల్లో ఖనిజలవణాలు, విటమిన్లు, పీచు పుష్కలంగా ఉంటాయి. వృక్షసంబంధ మాంసకృత్తులు పరిపూర్ణంగా ఉంటాయి. ఇంట్లో తయారుచేసిన జున్ను, పాలు, పప్పుదినుసులు (కందిపప్పు, మినుములు, పెసలు), కూరగాయలు (చిక్కుళ్లు, పచ్చిబఠాణీ) శక్తిని అందిస్తాయి.

దినుసుల ద్వారా...

ఆహారంలోని పోషకాలను నష్టపరచని దినుసులను వంటల్లో జోడించాలి. ఇందుకోసం మరీ ఘాటైనవి కాకుండా తేలికపాటి దినుసలను ఆహారానికి జోడించడం ద్వారా ఆహారం తేలికగా అరిగి త్వరిత శక్తిని అందించగలుగుతుంది. మంచి రుచికి దినుసులు తోడైతే, తేలికగా జీర్ణమవడంతోపాటు పోషకాలను శరీరానికి తేలికగా అందే మార్గం సుగమమవుతుంది. మనం ఆహారంలో పసుపు, కారం, జీలకర్ర, మెంతులు... ఇలా ఎన్నో రకాల దినుసులను జోడిస్తూ ఉంటాం. వీటిలో పసుపుకు రోగనిరోధకశక్తిని ఇనుమడింపజేసే గుణం ఉంటుంది. పసుపు శరీరంలోని విషాలను హరించడంతోపాటు రోగనిరోధకశక్తికి సంబంధించిన కణాలకు శక్తినిస్తుంది. జీలకర్ర వేడిని చంపుతుంది. నల్ల మిరియాలు శరీర కణజాలాలకు శక్తి నేరుగా అందేలా చేస్తాయి.

శక్తిని పెంచే ఆహారం!

యాపిల్ పళ్లలో రోగనిరోధకశక్తికి దోహదపడే యాంటీఆక్సిడెంట్లు, సుఖ విరోచనానికి అవసరమయ్యే పీచు పుష్కలంగా ఉంటాయి. తీయగా ఉండి, రసంతో కూడిన మామిడి, అనాస పళ్లు త్వరగా శక్తి రూపం దాలుస్తాయి. ఫలితంగా వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. అవే పళ్లు చెట్టుకు పండినవైతే శక్తి మరింత త్వరితంగా అందుతుంది. దానిమ్మరసం, దానిమ్మ గింజల పచ్చడి, పిత్త దోషం పెరగకుండా చేస్తూనే, జీర్ణశక్తిని పెంచుతాయి. కాబట్టి పరోక్షంగా రోగనిరోధకశక్తి కూడా పెరుగుతుంది. మధ్యాహ్న భోజనం తర్వాత బొప్పాయి తింటే జీర్ణశక్తితోపాటు రోగనిరోధకశక్తి కూడా పెరుగుతుంది. ఆవ ఆకులు, పాలకూరల్లో ఉండే ఐరన్, క్యాల్షియం, ఇతర పోషకాలు శక్తిని పెంచడంతోపాటు పొట్టను ఆరోగ్యంగా ఉంచుతాయి. క్యాబేజీ, కాలిఫ్లవర్‌లలోని యాంటీఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు కూడా రోగనిరోధకశక్తికి దోహదపడేవే! బార్లీ, తోటకూర విత్తనాలు, క్వినోవాలలో వ్యాధినిరోధకశక్తిని పెంచే పోషకాలు ఉంటాయి. శక్తి ప్రభావాన్ని పెంచే పదార్థాల్లో పాలు, నెయ్యిలు ప్రధానమైనవని ఆయుర్వేదం సూచిస్తోంది. కాబట్టి చిటికెడు యాలకుల పొడి వేసి కాచిన పాలు తాగాలి. భోజనానికి రెండు గంటల ముందు లేదా తర్వాత తాగడం వల్ల పోషకాలు సక్రమంగా శరీరానికి అందుతాయి. నెయ్యి ఇంట్లో తయారుచేసినదై ఉండాలి.



వండే విధానం!

వండి తినడం వల్ల ఆహారం అరిగే వేగం పెరుగుతుంది. అలాగని ఆహారాన్ని అవసరానికి మించి ఉడికిస్తే వాటిలోని రోగనిరోధకశక్తి వృద్ధి కారకాల నష్టం జరుగుతుంది. ఆహారం నమలడానికి, తినడానికి, మింగడానికి మెత్తగా ఉండాలికానీ సాగకూడదు.

సమయపాలన పాటించాలి!

ఆహారవేళలు నియమబద్ధంగా సాగాలి. ప్రధాన భోజనం మధ్యాహ్నం, సూర్యుడు నడినెత్తి మీద ఉన్నప్పుడు తినాలి. ఈ సమయంలో జీర్ణశక్తి అమోఘంగా, బలంగా ఉంటుంది. రాత్రివేళ జీర్ణశక్తి బలహీనంగా ఉంటుంది కాబట్టి, తేలికపాటి అల్పాహారం తీసుకోవాలి. ఇలాంటి ఆహార, సమయ నియమాలు పాటిస్తే రోగనిరోధకశక్తి మెరుగ్గా సాగుతుందని ఆయుర్వేదం చెప్తోంది.

సరైన పరిమాణాలూ ముఖ్యమే!

శరీర తీరు, తత్వాలకు తగిన పరిమాణాల్లో ఎక్కువ, తక్కువ కాకుండా ఆహారం తీసుకోవాలి. ఆహారంతోపాటు గది ఉష్ణోగ్రతకు దగ్గర్లో ఉన్న నీరు తీసుకుంటే ఆహారం కొంత ద్రవ రూపం దాలుస్తుంది. జీర్ణశక్తికి ఇది అవసరం. పొట్టలో పావు వంతు ఖాళీ జాగా వదిలితే తేలికగా జీర్ణం జరుగుతుంది. పొట్ట నిండా తింటే అరిగే జాగా లేక అజీర్తి తలెత్తుతుంది.

అవగాహన

పండ్లు తింటే బరువు తగ్గుతామా?

బరువు తగ్గడం కోసం రాత్రి భోజనానికి బదులుగా పండ్లు తినే ధోరణి ఇటీవల ఊపందుకుంది. అయితే పండ్లతో నిజంగానే బరువు తగ్గే వీలుందా? తెలుసుకుందాం!

మధ్యాహ్నం భారీగా భోంచేసినప్పుడు, రాత్రికి అంతగా ఆకలి వేయకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో, లేదా అజీర్తి తలెత్తినప్పుడు రాత్రి భోజనానికి బదులుగా పండ్లతో సరిపెట్టుకోవడం మంచిదే! అయితే ప్రతి రాత్రీ పండ్లతో సరిపెట్టుకోవడం ఆరోగ్యకరం కాదంటున్నారు వైద్యులు. పండ్లలో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు లోపిస్తాయి కాబట్టి ఇదే అలవాటును కొనసాగిస్తే



పోషక లోపం తలెత్తే వీలుంటుంది. అలాగే రాత్రి పండ్లతో పొట్ట నింపుకోవడంతో, మరుసటి ఉదయానికి ఆకలి ఎక్కువై భారీ బ్రేక్‌ఫాస్ట్ చేసే అవకాశం ఉంటుందనీ, దాంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరిపోయే ప్రమాదం ఉంటుందని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే పండ్లలో విటమిన్లు, పీచు, ఖనిజ లవణాలతో పాటు, సహజ చక్కెరలు కూడా ఎక్కువే! ఇవి రక్తంలోని చక్కెర మోతాదులను పెంచేస్తాయి. ఇదే అలవాటును దీర్ఘకాలం పాటు కొనసాగిస్తే, ఇన్సులిన్ రెసిస్టెన్స్ తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ శక్తిని ఉపయోగించుకోలేకపోతే, కొవ్వుగా శరీరంలో పేరుకుపోతుంది. కాబట్టి ఈ సమస్యలు తలెత్తకుండా ఉండడం కోసం పండ్లను పెరుగు, నట్స్‌తో కలిపి తీసుకోవాలి. అలాగే రాత్రిపూట పండ్లను తినడానికి ఇష్టపడే వారు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే, బెర్రీస్, యాపిల్స్, బొప్పాయి, పియర్స్ మొదలైన పండ్లను ఎంచుకోవాలి.

రూ.173 లక్షల కోట్లు

2024లో ప్రపంచ బిలియనీర్లు పోగేసిన సంపద ఇది..



- రోజుకు సగటున రూ.49,305 కోట్ల చొప్పున పెరిగిన వెల్త్
- రూ.1,298 లక్షల కోట్లకు పెరిగిన వారి మొత్తం ఆస్తులు
- 2023తో పోలిస్తే మూడింతల వేగంతో పెరిగిన నెట్‌వర్త్
- గత ఏడాది నాటికి 2,769కి పెరిగిన ప్రపంచ బిలియనీర్లు
- డబ్ల్యూఈఎఫ్ వార్షిక సదస్సులో ఆక్స్‌ఫామ్ నివేదిక విడుదల

దావోస్: గత ఏడాది ప్రపంచ బిలియనీర్ల సంపద 2 లక్షల కోట్ల డాలర్ల (రూ.173 లక్షల కోట్లు) మేర పెరిగి మొత్తం 15 లక్షల కోట్ల డాలర్లకు (రూ.1,298 లక్షల కోట్లు) చేరుకుందని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ అధ్యయన నివేదిక వెల్లడించింది. 2023తో పోలిస్తే ప్రపంచ కుబేరుల ఆస్తి 2024లో మూడింతల వేగంతో వృద్ధి చెందిందని రిపోర్టు పేర్కొంది. 2024లో బిలియనీర్ల నెట్‌వర్త్ రోజుకు సగటున 570 కోట్ల డాలర్ల (రూ.49,305 కోట్లు) మేర పెరుగుతూ వచ్చిందని.. 2023లో ప్రపంచవ్యాప్తంగా 2,565 మంది బిలియనీర్లుండగా.. గత ఏడాదిలో వీరి సంఖ్య 2,769కు పెరిగిందని నివేదిక తెలిపింది. క్రితం సంవత్సరంలో ప్రపంచ టాప్-10 కుబేరుల సంపద రోజుకు సగటున 10 కోట్ల డాలర్ల (రూ.865 కోట్లు) చొప్పున పెరుగుతూ వచ్చిందని.. ఉన్నపళంగా వారు ఆస్తిలో 99 శాతం కోల్పోయినా బిలియనీర్లుగానే కొనసాగుతారని రిపోర్టు పేర్కొంది. కనీసం 100 కోట్ల డాలర్ల (రూ.8650 కోట్లు) ఆస్తి కలిగిన వారిని బిలియనీరుగా పిలుస్తారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సు ప్రారంభ రోజున ఆక్స్‌ఫామ్ ఈ నివేదికను విడుదల చేసింది. కుబేరుల సంపదలో భారీగా వృద్ధి చెందుతూ వస్తోన్నప్పటికీ, 1990 నుంచి పేదల సంఖ్యలో తగ్గుదల మాత్రం నామమాత్రంగానే ఉందని రిపోర్టు పేర్కొంది.

ఆక్స్‌ఫామ్ నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- గత సంవత్సరం ఆసియా బిలియనీర్ల ఆస్తి 29,900 కోట్ల డాలర్ల (రూ.25.86 లక్షల కోట్లు) మేర పెరిగింది. వచ్చే దశాబ్దకాలంలో కనీసం ఐదుగురు ట్రిలియనీర్లుగా (కనీసం లక్ష కోట్ల డాలర్ల సంపద కలిగిన వారు) అవతరించే అవకాశం ఉంది.
- 2024లో కొత్తగా 204 మంది బిలియనీర్లుగా అవతరించారు. అంటే, వారానికి సుమారు నలుగురు చొప్పున కొత్తగా ఈ జాబితాలో చేరారు. గత ఏడాది ఆసియా నుంచి 41 మంది కొత్త బిలియనీర్లు పుట్టుకొచ్చారు.
- 2023లో ఆర్థిక వ్యవస్థ ద్వారా ఉత్తర ప్రపంచంలోని ఒక శాతం సంపన్నులు దక్షిణ ప్రపంచం నుంచి గంటకు 3 కోట్ల డాలర్ల మేర ఆర్జించారు. వలస పాలన విధానం ఎప్పుడో ముగిసిందని చాలా మంది భావించారు. కానీ, దక్షిణ ప్రపంచ దేశాల నుంచి సంపద అధిక శాతం కుబేరులున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి ఉత్తర ప్రపంచ దేశాలకు తరలిపోతున్నది.
- ప్రపంచ సంపదలో 69 శాతంతోపాటు బిలియనీర్ల సంపదలో 77 శాతం ఉత్తర ప్రపంచ దేశాల వద్దే కేంద్రీకృతమై ఉంది. అంతేకాదు, ప్రపంచ మొత్తం జనాభాలో ఉత్తర దేశాల వాటా 21 శాతమే. కానీ, ప్రపంచ బిలియనీర్లలో 68 శాతం ఈ ప్రాంతానికి చెందినవారే.
- ప్రస్తుత బిలియనీర్లలోని 60 శాతం మందికి సంపద వారసత్వం లేదా గుత్తాధిపత్యం లేదా ఆశ్రిత సంబంధాల ద్వారా సమకూరిందే. అంటే, వీరి సంపదలో అధిక శాతం అర్హత లేని ఆర్జనేనని ఇది సూచిస్తుంది. ఆర్థిక అసమానతలను తగ్గించడంతోపాటు ధనికస్వామ్యాన్ని నిరోధించేందుకు సంపన్నులపై మరిన్ని పన్నులు విధించాలి.
- బిలియనీర్ల సంపదలో 36 శాతం వారసత్వంగా వచ్చిందే. 18 శాతం గుత్తాధిపత్యం, 6 శాతం ఆశ్రిత పక్షపాత సంబంధాల ద్వారా సమకూరిందే.
- 1,000 మందికి పైగా బిలియనీర్లు 5.2 లక్షల కోట్ల డాలర్లకు పైగా తమ సంపదను వచ్చే 2-3 దశాబ్దాల్లో వారి వారసులకు బదిలీ చేయవచ్చని యూబీఎస్ అంచనా వేసింది. ఫోర్బ్స్ అధ్యయనం ప్రకారం.. 30 ఏళ్లలోపు ప్రతి బిలియనీర్‌కు సంపద వారసత్వంగా లభించిందే.
- రోజుకు 6.85 డాలర్లు (రూ.593) అంతకంటే తక్కువ సంపాదనతో జీవితం వెళ్లదీస్తున్న వారి సంఖ్యలో 1900 నుంచి పెద్ద మార్పేమీ లేదు.

భారత్ నుంచి బ్రిటన్ దోచుకున్న సొమ్ము రూ.5,607 లక్షల కోట్లు

- అందులో సగం 10 శాతం సంపన్నుల చేతుల్లోకే..
- ఆ డబ్బుతో లండన్ ఉపరితల భాగాన్ని 50 పౌండ్ల నోట్లతో నాలుగు సార్లు కప్పేయొచ్చు..

దావోస్: శతాబ్దకాలానికి పైగా భారత్‌ను పాలించిన బ్రిటన్ మన దేశ సంపదను భారీగా కొల్లగొట్టిన విషయం అందరికీ తెలిసిందే. భారత్ నుంచి బ్రిటన్ ఎంత మేర దోచుకుందనే విషయంపై ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ బయటపెట్టింది. 1765 నుంచి 1900 మధ్య కాలంలో జరిగిన వలస పాలనలో బ్రిటన్ మన దేశం నుంచి ప్రస్తుత విలువ ప్రకారం 64.82 లక్షల కోట్లు డాలర్లు (సుమారు రూ.5,607 లక్షల కోట్లు) దోచుకుందని ఆక్స్‌ఫామ్ తాజా నివేదిక అంచనా వేసింది. అందులో 52 శాతం.. అంటే 33.8 లక్షల కోట్ల డాలర్లు (రూ.2,924 లక్షల కోట్లు) 10 శాతం సంపన్నుల జేబుల్లోకే వెళ్లిందని నివేదిక పేర్కొంది. ఆ డబ్బుతో బ్రిటన్ రాజధాని లండన్ ఉపరితల భాగాన్ని 50 పౌండ్ల నోట్లతో నాలుగు సార్లు కప్పేయవచ్చని అంటోంది. ప్రస్తుతం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని చాలావరకు కుబేర కుటుంబాల సంపద వలసపాలన సమయంలో ఆర్జించిందేనని రిపోర్టు పేర్కొంది. 1750లో ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో దాదాపు 25 శాతం వాటా భారత ఉపఖండానిదేనని, 1900 నాటికది 2 శాతానికి పడిపోయిందని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది.

విశ్వాస సూచీలో 3 స్థానానికి జారిన భారత్

ప్రభుత్వం, వ్యాపారాలు, మీడియా, ఎన్‌జీఓలపై ప్రజల నమ్మకం విషయంలో భారత్ రెండు నుంచి మూడో స్థానానికి జారుకుందని ఎడెల్‌వెన్ ట్రస్ట్ బారోమీటర్ 25వ వార్షిక నివేదిక వెల్లడించింది. దేశంలోని సంపన్న వర్గంతో పోలిస్తే అల్పాదాయ జనాభాలో విశ్వసనీయత మరింత లోపించిందని రిపోర్టు పేర్కొంది. ఈ సూచీలో చైనా, ఇండోనేషియా వరుసగా 1, 2 స్థానాల్లో నిలిచాయి. జపాన్, యూకే అట్టడుగున ఉన్నాయి. కాగా, ఇతర దేశాల ప్రజలు, దేశంలో ప్రధాన కార్యాలయం కలిగిన విదేశీ కంపెనీలను నమ్మే విషయంలో భారత్ 13వ స్థానంలో ఉంది.

'ట్రంప్' కార్డ్‌తో మార్కెట్లలో జోష్

ముంబై: ప్రపంచ మార్కెట్ల పటిష్ఠ సంకేతాల నడుమ బ్యాంకింగ్, ఫైనాన్షియల్, పవర్ విభాగాల షేర్లలో కొనుగోళ్లు జోరుగా సాగడంతో ఈక్విటీ మార్కెట్ సోమవారం లాభాల బాట పట్టింది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో తాను టెలిఫోన్‌లో సంభాషించానని, అది సానుకూల ఫలితం అందించిందని అమెరికా అధ్యక్షుడుగా పగ్గాలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ప్రపంచ మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపింది. టారిఫ్‌ల పెంపు విషయంలో ట్రంప్ కాస్తంత సంయమనం పాటించి చర్చలకే మొగ్గు చూపవచ్చునన్న సంకేతంగా దీన్ని విశ్లేషకులు అభివర్ణించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లన్నీ లాభాల్లో ట్రేడ్ కావడం దేశీయ మార్కెట్లో సెంటిమెంట్ పెరగడానికి దోహదపడింది. దీంతో సెన్సెక్స్ 454.11 పాయింట్ల లాభంతో 77,073.44 వద్ద ముగియగా నిఫ్టీ 141.55 పాయింట్ల లాభంతో 23,344.75 వద్ద ముగిసింది.

బిట్‌కాయిన్ @ 1.09 లక్షల డాలర్లు

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ పగ్గాలు చేపట్టబోతున్న నేపథ్యంలో బిట్‌కాయిన్ విలువ సోమవారం దూసుకుపోయింది. దాని విలువ 1,09,000 డాలర్లను తాకింది. ఒకప్పుడు క్రిప్టో కరెన్సీలను తీవ్రంగా వ్యతిరేకించిన ట్రంప్ తదుపరి తన వైఖరి మార్చుకుని ఇప్పుడు క్రిప్టో అనుకూల వైఖరి అనుసరిస్తున్నారు. దీంతో అధికార పగ్గాలు చేపట్టగానే ఆయన డిజిటల్ కరెన్సీలను ప్రోత్సహించే చర్యలు తీసుకోవచ్చునన్న ఆశలు బిట్‌కాయిన్ పరుగులు తీయడానికి దోహదపడినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ తన క్యాబినెట్ సహచరులుగాను, నియంత్రణా సంస్థల అధిపతులుగాను క్రిప్టో మద్దతుదారులకే పట్టం కట్టడంతో శుక్రవారం 5% లాభపడిన బిట్‌కాయిన్ సోమవారం 9,000 డాలర్లకు పైగా దూసుకుపోయి 1,09,000 డాలర్లు పలికింది.

నా మొదటి సంపాదన రూ. 10,000


గౌతమ్ అదానీ

అహ్మదాబాద్: ప్రముఖ పారిశ్రామికవేత్త, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ తన వ్యాపార, పారిశ్రామిక ప్రస్థానాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. జీవిత అనుభవాలతోనే ఎవరికైనా వివేకం వస్తుందన్నారు. విజ్ఞానం మాత్రం బాగా చదివితేనే వస్తుందన్నారు. అహ్మదాబాద్‌లో అదానీ గ్రూప్ ఏర్పాటు చేసిన అదానీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ జీవిత సత్యాలు చెప్పారు. కాలేజీ మానేసి 16 ఏళ్ల వయసులో కేవలం రైలు టిక్కెట్‌కు సరిపడా డబ్బులతో ముంబై చేరిన తాను ఎన్ని కష్టాలు పడిందీ వివరించారు. చిన్న వయసులోనే బతుకుదెరువు కోసం ముంబై చేరడం, అక్కడ ఒక వజ్రాల ట్రేడింగ్ కంపెనీలో చేరి మూడేళ్లలోనే ఆ వ్యాపారంలోని మెళకువలు ఆకళింపు చేసుకుని వజ్రాల ట్రేడింగ్ కోసం సొంత బ్రోకరేజీ సంస్థను ఏర్పాటు చేసిన విధానాన్ని వివరించారు. ఈ బ్రోకరేజీ వ్యాపారంలో 1981లో 19 ఏళ్ల వయసులో తొలి ట్రేడింగ్‌లోనే రూ.10,000 కమీషన్ సంపాదించిన విషయాన్నీ ఆయన వెల్లడించారు. 'ఒక జపాన్ కొనుగోలుదారుడితో నేను జరిపిన మొదటి ట్రేడింగ్ నాకు ఇంకా గుర్తుంది. ఆ తొలి ట్రేడింగ్‌లోనే నాకు రూ.10,000 కమీషన్ లభించింది. అప్పుడు నా వయసు 19 సంవత్సరాలు. ఒక ఔత్సాహిక వ్యాపారవేత్తగా అది నా తొలి ప్రయాణం' అన్నారు.

అంచెలంచెలుగా ఎదిగా: ఆ తరువాత అహ్మదాబాద్‌కు తిరిగి వచ్చి తన అన్న కొనుగోలు చేసిన ఒక చిన్న పీవీసీ ఫిల్మ్ ఫ్యాక్టరీ నడపడంలో సహాయ పడడం, 1988లో సొంతంగా అదానీ ఎక్స్‌పోర్ట్స్ పేరుతో కమోడిటీస్ ట్రేడింగ్ సంస్థను ఏర్పాటు చేసి, అంచెలంచెలుగా ఎలా వివిధ వ్యాపారాల్లో ఎదిగిందీ అదానీ విద్యార్థులకు వివరించారు. జీవితంలో ఎన్ని అపజయాలు, ఎదురుదెబ్బలు తగిలినా ఎదగాలనే లక్ష్యం నుంచి నీరుగారి పోవద్దని విద్యార్థులను కోరారు. జీవితంలో ఎదగాలని కలలు కనడం సంపన్నులకు మాత్రమే పరిమితమైన సొత్తు కాదన్నారు.

హైదరాబాద్‌లో కంట్రోల్‌ఎస్ 600 మెగావాట్ల డేటాసెంటర్ పార్క్

చందన్‌వెల్లి పార్క్‌లో 40 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కంట్రోల్‌ఎస్ డేటాసెంటర్స్.. హైదరాబాద్‌లో కొత్త డేటా సెంటర్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్ సమీపంలో కొత్తగా అభివృద్ధి చేస్తున్న చందన్‌వెల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో 40 ఎకరాల విస్తీర్ణంలో 600 మెగావాట్ల ఐటీ లోడ్ సామర్థ్యంతో ఈ పార్క్‌ను నెలకొల్పాలని చూస్తున్నట్లు తెలిపింది. అయితే ఈ పార్క్ అభివృద్ధి కోసం ఎంత మేరకు పెట్టుబడులు పెడుతుందనే వివరాలను మాత్రం కంట్రోల్‌ఎస్ వెల్లడించలేదు. ఈ పార్క్ తొలి దశ కోసం ఇప్పటికే 250 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అనుమతులు లభించినట్లు పేర్కొంది. కాగా భవిష్యత్తులో ఈ డేటాసెంటర్ పార్క్‌కు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు 900 మెగావాట్ల వరకు డెడికేటెడ్ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్ (జీఐఎస్) ఉండేలా తీర్చిదిద్దుతున్నట్లు కంట్రోల్‌ఎస్ తెలిపింది. హై డెన్సిటీ, అల్ట్రా-హై డెన్సిటీ, ఏఐ రెడీ, డేటాసెంటర్ భవనాల అనుసంధానం వంటి ఫీచర్లను కంట్రోల్‌ఎస్ చందన్‌వెల్లి డేటాసెంటర్ పార్క్ కలిగి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం కంట్రోల్‌ఎస్.. హైటెక్‌సిటీలో ఒకటి, గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రెండు డేటా సెంటర్లను నిర్వహిస్తోంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	141
వరంగల్	125	గుంటూరు	137
కరీంనగర్	125	ఒంగోలు	137
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	107
కర్నూలు	125	నెల్లూరు	112
విశాఖపట్నం	132	అనంతపురం	112
గోదావరి	141		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)




	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,230 ▲	74,500 ▲	1,04,000 ▲
విజయవాడ	81,800 ▼	77,000 ▲	93,000 ▼
విశాఖపట్నం	79,280 ▼	72,670 ▼	91,520 ▼
రాజమండ్రి	81,270 ▼	74,500 ▲	93,500 ▼
ప్రొద్దుటూరు	80,150 ▼	74,220 ▼	93,000 ▼
ముంబై	79,345 ▲	72,680 ▲	90,200 ▼


చిత్రజ్యోతి
SINCE 1965

ఇకపై మంచి సినిమాలే చేస్తా

● రామ్‌గోపాల్ వర్మ భావోద్వేగ లేఖ



రామ్‌గోపాల్ వర్మ 1998లో తెరకెక్కించిన కల్ట్ క్లాసిక్ 'సత్య' చిత్రాన్ని ఇటీవలే రీ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనైన రామ్‌గోపాల్ వర్మ ఎక్స్‌లో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "ఇటీవలే 'సత్య' సినిమా చూశాను. 27 ఏళ్ల తర్వాత ఈ సినిమా చూస్తుంటే నా ప్రమేయం లేకుండానే కన్నీళ్లు వచ్చేశాయి... ఇలాంటి గొప్ప సినిమాను నేనే తీశానా అనే ఆనందంతో. ఒక సినిమా తీయడమంటే బిడ్డకు జన్మనివ్వడంలాంటిదే. 'సత్య' తర్వాత ఎన్నో సినిమాలు చేశాను. కానీ, వాటి ఫలితాలను పట్టించుకోకుండా ముందుకు సాగాను. ఎంతోమందికి స్ఫూర్తినిచ్చి.. ఎంతో మంది నమ్మకాన్ని గెలుచుకుందీ సినిమా. కానీ అందరి నమ్మకాన్ని నేను వమ్ము చేశాను. ఈ సినిమా విజయాన్ని ఓ కొలమానంగా మలుచుకోలేకపోయాను. నేను తాగుబోతుగా మారాను. నేను చేసిన సినిమాలు ఇచ్చిన విజయం, అహంకారంతో నా కళ్లు నెత్తికెక్కాయి. 'సత్య', 'రంగీలా' సినిమాలు ఇచ్చిన విజయాలతో నా కళ్లు మూసుకుపోయాయి. దీంతో ఇష్టమొచ్చిన రీతిలో సినిమాలు చేశా. ప్రేక్షకులను ఆశ్చర్యపరచాలని ఎన్నో జిమ్మిక్కులు చేశా. అసభ్యకరమైన సన్నివేశాలతో అర్థం పర్థం లేని రీతిలో సినిమాలు చేశా. సాధారణ కథతోనూ మంచి ఎలివేషన్ ఉన్న సినిమాలు తీయవచ్చనే విషయం మరిచాను. అయినప్పటికీ కొన్ని సినిమాలు సక్సెసయ్యాయి. కానీ 'సత్య' సినిమాలా ఉన్నతంగా అవి లేవు. పరిశ్రమ నాకు ఎన్నో అవకాశాలిచ్చింది. కానీ నేను ఉపయోగించుకోలేకపోయాను. నేను చేసిన తప్పులను ఎలాగో ఇప్పుడు సరిదిద్దుకోలేను. కానీ ఇకపై దర్శకుడిగా నన్ను మంచి స్థాయిలో నిలబెట్టే సినిమాలే తీస్తాను. 'సత్య' లాంటి సినిమాను నేను మళ్లీ తీయలేకపోవచ్చు. కానీ అలాంటి తరహా సినిమాల్ని మీ ముందుకు తీసుకురావడానికి మాత్రం నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఇకపై ప్రతీ సినిమాను తెరకెక్కించే ముందు 'సత్య' సినిమా తప్పక చూస్తాను. 'సత్య'పై చూపించినంత నిజాయితీ ఇక మీదట నేను చేయబోయే ప్రతీ సినిమాపై చూపిస్తాను. ఇప్పటివరకూ తీసిన చిత్రాలకు ఈ నియమాన్ని పాటించి ఉంటే నా సినిమాల్లో 90 శాతం తెరకెక్కి ఉండేవే కాదు. చివరగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా జీవితంలో ఇంకా సగభాగం మిగిలే ఉంది. ఈ మిగిలిన సమయాన్ని 'సత్య' లాంటి సినిమాలు తీయడానికి వెచ్చిస్తాను. ఇదే సత్యం. ఇది నా 'సత్య' సినిమాపై ప్రామిస్ వేసి మరీ చెబుతున్నాను" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.



శివుడి పాత్ర పోషించడం అదృష్టం

అక్షయ్‌కుమార్

మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో డా.మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో నటిస్తున్న పలువురు నటీనటుల ఫస్ట్ లుక్‌లను మేకర్స్ విడుదల చేశారు. తాజాగా, ఈ సినిమా నుంచి అక్షయ్‌కుమార్ పోషిస్తున్న పరమ శివుడి లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు భక్తికి మాత్రం దాసుడు' అని పేర్కొన్నారు. పోస్టర్‌లో ఆయన శివ తాండవం చేస్తున్నారు. 'ఇలాంటి ఓ అద్భుతమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఎంతో పవిత్రమైన ఆ పరమశివుడి పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ ప్రయాణంలో మనందరికీ శివుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నా. ఓం నమః శివాయ' అని అక్షయ్‌కుమార్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. ఏప్రిల్ 25న సినిమా విడుదల కానుంది. ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, ప్రీతి ముకుందన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ముగ్గురు స్నేహితుల కథ



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భైరవం'. అతిధి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై హీరోయిన్లు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఈ కథ వారాహి గుడి, ముగ్గురు స్నేహితుల చుట్టూ సాగుతుంది. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఈసారి మంచి కథా బలం ఉన్న సినిమాతో రావాలని నిర్ణయించుకునే వస్తున్నాం. అలా మంచి కథ కోసం మొదలైన వేటలో 'భైరవం' దొరికింది. ఈ సినిమా మమ్మల్ని మరో మెట్టు పైకి తీసుకెళ్తుందని కోరుకుంటున్నా' అని అన్నారు. మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఇది టీజర్ మాత్రమే. ట్రైలర్ అదిరిపోతుంది. సినిమా దుమ్ము లేచిపోతుంది. మీ అందరి బ్లెస్సింగ్స్ ఉంటాయని ఆశిస్తున్నా' అని అన్నారు. నారా రోహిత్ మాట్లాడుతూ 'ఇది నాకు బాగా గుర్తుండి పోయే చిత్రం అవుతుంది. థియేటర్లలో సినిమా చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.


హృదయాలను హత్తుకునే సినిమా



ప్రముఖ దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకురాలు. ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఎన్నో అవార్డులను దక్కించుకున్న ఈ చిత్రం ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకురాలు పద్మావతి మల్లాది మీడియాతో ముచ్చటించారు. 'నాకు స్వతహాగా పచ్చదనం, చెట్టు అంటే చాలా ఇష్టం. మొక్కల గురించి తదుపరి తరం వాళ్లకు చెప్పాలనే సంకల్పంతో ఈ కథ రాసుకున్నాను. ఒక అమ్మాయి అహింసవాదంతో ఊరిని, చెట్టును ఎలా కాపాడింది అనేది ఈ చిత్ర కథ. పూర్తి సందేశంతో పాటు కమర్షియాలిటీ ఉన్న సినిమా. తప్పకుండా అందరి హృదయాలను హత్తుకుంటుంది. ఈ కథ 1947లో గాంధీగారు చనిపోయినప్పుడు తాత నాటిన చెట్టుతో ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో అహింస గురించి చెప్పాను. మనుషుల మధ్య నేచర్ మధ్య అహింస చాలా అవసరం' అని అన్నారు.

నటుడు విజయ రంగరాజు మృతి

● చెన్నైలో అంత్యక్రియలు పూర్తి



నందమూరి బాలకృష్ణ నటించిన 'భైరవ ద్వీపం'లో మాంత్రికుడి పాత్రతో అందరి దృష్టినీ ఆకర్షించిన విజయ రంగరాజు (68) చెన్నైలో సోమవారం మృతి చెందారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక షూటింగులో గాయపడిన ఆయన్ని చెన్నైకు తీసుకొచ్చి, కొద్ది రోజుల పాటు ఇంటిపట్టునే ఉంచి వైద్యం చేయించారు. మూడు రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో గిండిలోని కలైంజర్ సెంటినరీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తూ వచ్చారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం వేకువజామున 3.30 గంటల సమయంలో తుదిశ్వాస విడిచినట్టు ఆయన రెండో కుమార్తె పద్మిని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సాయంత్రం స్థానిక నెసపాక్కం శ్మశానవాటికలో ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు ముగిశాయి. విజయ రంగరాజుకు భార్య కస్తూరి, కుమార్తెలు దీక్షిత, పద్మిని ఉన్నారు. విజయరంగరాజు అసలు పేరు రాజ్‌కుమార్. 1973లో వచ్చిన 'సీతాకల్యాణం' ఆయన తొలి చిత్రం. అప్పటి నుంచి వివిధ భాషల్లో నటుడిగా, ఫైటర్‌గా, ఫైట్ మాస్టర్‌గా ఐదు వేల చిత్రాలకు పని చేశారు. సుమన్ నటించిన 'నేటి భారతం' చిత్రంలో విలన్‌గా నటించిన రాజ్‌కుమార్ పేరునే కాకుండా నట జీవితాన్నే మార్చేసిన చిత్రం 'భైరవ ద్వీపం'. ఆ సినిమా నుంచే తన పేరుని విజయరంగ రాజుగా మార్చుకున్నారు రాజ్‌కుమార్. 'శ్రీకృష్ణార్జున విజయం' చిత్రంలో భీముడిగా నటించిన రంగరాజుకు 'యజ్ఞం' చిత్రం మరోసారి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత దాదాపు ఓ వంద సినిమాల్లో నటించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఇన్ ప్రోగ్రెస్

యాక్షన్ థ్రిల్లర్



టొవినో థామస్, త్రిష ప్రధాన పాత్రల్లో అఖిల్ పాల్, అనాస్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఐడెంటిటీ'. మలయాళంలో విడుదలై 2025లో తొలి హిట్‌గా నిలిచిన ఈ సినిమాని మామిడాల శ్రీనివాస్, చింతపల్లి రామారావు తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నెల 24న విడుదలవుతున్న ఈ చిత్రం తెలుగు ట్రైలర్‌ను సోమవారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మామిడాల శ్రీనివాస్ మాట్లాడుతూ 'దర్శకుడు ఎంతో జాగ్రత్తగా ఈ చిత్రాన్ని రూపొందించారు. మలయాళంలో విడుదలై రూ.40 కోట్లకు పైగా వసూలు చేసింది' అని చెప్పారు. చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'దర్శక ద్వయానికి ఈ చిత్రం ద్వారా తెలుగులో మంచి ఐడెంటిటీ వస్తుందని ఆశిస్తున్నా. యాక్షన్ థ్రిల్లర్ అయిన ఈ చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా వినోదపరుస్తుందని ఆశిస్తున్నా' అని అన్నారు.

రూ. వెయ్యి కోట్ల సినిమా.. తెలుగులో



హాంగ్ కాంగ్ సినీ చరిత్రలో రూ. వెయ్యి కోట్లు వసూలు చేసిన చిత్రం 'హాంగ్ కాంగ్ వారియర్స్'. లూయిస్ కూ, సమ్మో కామ్, బో హంగ్, రిచీ ప్రధాన పాత్రలు పోషించిన ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళంలో కూడా ఈ నెల 24న ప్రముఖ పంపిణీ సంస్థ ఎస్వీఆర్ సినిమా విడుదల చేస్తోంది. సోయ్ చీయాంగ్ ఈ సినిమాకు దర్శకుడు.

అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది



ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హత్య'. శ్రీ విద్యా బసవ దర్శకత్వంలో ఎస్.ప్రశాంత్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర దర్శకురాలు శ్రీవిద్య బసవ మాట్లాడుతూ 'ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. రవి చాలా అద్భుతంగా నటించారు. ఆయన పాత్రకు అందరూ కనెక్ట్ అవుతారు. సుధ పాత్రలో ధన్య అందరినీ ఆకట్టుకుంటుంది. నేను ఓ దర్శకురాలిగా మరిన్ని ఉమెన్ సెంట్రిక్ కథలు, క్యారెక్టర్లు రాయాలని అనుకుంటున్నా' అని అన్నారు.

పంత్‌కే 'లఖ్‌నవూ' పగ్గాలు



కోల్‌కతా: ఐపీఎల్ ఫ్రాంఛైజీ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నూతన కెప్టెన్‌గా రిషభ్ పంత్ వ్యవహరించనున్నాడు. జట్టు యజమాని సంజీవ్ గోయెంకా, మెంటార్ జహీర్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం కెప్టెన్ పరిచయ కార్యక్రమం జరిగింది. 'నా మీద నమ్మకం ఉంచినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు. జట్టు కోసం నేను 200 శాతం అంకితభావంతో ఆడతాను. మీ నమ్మకాన్ని వమ్ముచేయకుండా నా శక్తిమేర పోరాడతాను' అని పంత్ పేర్కొన్నాడు. గతేడాది జరిగిన ఆటగాళ్ల వేలంలో పంత్‌ను లఖ్‌నవూ జట్టు రూ.27 కోట్ల రికార్డు ధరకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

నైజీరియా సంచలనం

న్యూజిలాండ్‌పై విజయం

అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్



కౌలాలంపూర్: అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో పసికూన నైజీరియా చరిత్ర సృష్టించింది. తొలిసారిగా టోర్నీలో పాల్గొంటున్న ఈ ఆఫ్రికా జట్టు పటిష్ఠ న్యూజిలాండ్‌ను రెండు పరుగుల తేడాతో కంగుతినిపించింది. దీంతో వరుసగా రెండో ఓటమితో కివీస్ సూపర్ సిక్స్‌కు దూరమైంది. సోమవారం జరిగిన ఈ గ్రూప్ 'సి' పోరును వర్షం కారణంగా 13 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నైజీరియా 65/6 స్కోరు చేసింది. ఆ తర్వాత ఛేదనలో కివీస్ పోరాడినా నిర్ణీత 13 ఓవర్లలో 63/6 స్కోరు చేసి ఓడింది. ఉడే (3-0-8-1) ప్రత్యర్థిని కట్టడి చేసింది.
సమోవా 16 ఆలౌట్: మరో అరంగేట్ర జట్టు సమోవా.. దక్షిణాఫ్రికా ధాటికి కుదేలైంది. వీరి బౌలర్ల ధాటికి సమోవా 9.1 ఓవర్లలో కేవలం 16 పరుగులకే కుప్పకూలింది. అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితం కాగా, ఐదుగురు డకౌట్‌గా వెనుదిరిగారు. ఆ తర్వాత సౌతాఫ్రికా అమ్మాయిలు తమ ఛేదనను 1.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 17 పరుగులతో ముగించారు. పది వికెట్ల తేడాతో నెగ్గిన దక్షిణాఫ్రికా రెండు విజయాలతో సూపర్ 6కి అర్హత సాధించింది. అలాగే గ్రూప్ 'డి'లో బంగ్లాదేశ్‌పై గెలిచిన ఆస్ట్రేలియా నాలుగు పాయింట్లతో సూపర్ 6కి చేరగా, ఇదే గ్రూప్‌లో నేపాల్‌పై స్కాట్లాండ్ నెగ్గింది. ఇతర మ్యాచుల్లో ఐర్లాండ్‌పై అమెరికా, పాకిస్థాన్‌పై ఇంగ్లండ్ నెగ్గాయి. కాగా.. గ్రూప్-ఎలో భాగంగా డిఫెండింగ్ చాంప్ భారత్ తన రెండో మ్యాచ్‌ను మలేసియాతో మంగళవారం తలపడనుంది.



ప్రియా సరోజ్

ఎంపీతో రింకూ పెళ్లి ఖరారు

న్యూఢిల్లీ: టీమిండియా క్రికెటర్ రింకూ సింగ్ త్వరలో ఓ ఇంటివాడు కానున్నాడు. సమాజ్‌వాది పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో అతడి వివాహం ఖరారైనట్టు కుటుంబ వర్గాలు తెలిపాయి. ఈ నెల 16న రింకూ తండ్రితో పెళ్లి గురించి మాట్లాడినట్టు ప్రియ తండ్రి, ఎమ్మెల్యే తుఫానీ సరోజ్ చెప్పారు. పెళ్లికి ఇరు కుటుంబాలు సమ్మతి తెలియజేశాయన్నారు. 'ప్రియ, రింకూ మధ్య ఏడాదికిపైగానే పరిచయం ఉంది. కుటుంబ సభ్యుల అనుమతితో ఒకటి కావాలనుకొన్నార'ని తుఫానీ చెప్పారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత నిశ్చితార్థం, వివాహ ముహూర్తాన్ని నిర్ణయిస్తామన్నారు. రింకూ క్రికెట్ షెడ్యూల్‌కు కూడా ఇబ్బంది కలగకుండా కార్యక్రమాన్ని జరిపిస్తామని తెలిపారు. సింగ్ ఇంట్లో ఇరు కుటుంబాలు తాంబూలాలు కూడా మార్చుకొన్నాయి. కాగా, గత కొన్ని రోజులుగా రింకూ పెళ్లిపై ఊహాగానాలు వస్తున్న సంగతి తెలిందే.

కొడుకు కొనిచ్చిన బైక్‌పై రయ్..రయ్



రింకూ సింగ్ తండ్రి ఖన్‌చంద్ర సింగ్ అలీగఢ్ వీధుల్లో కవాసాకి నింజా స్పోర్ట్స్ బైక్‌పై రయ్.. రయ్ మంటూ దూసుకెళ్తున్నాడు. గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేసే ఖన్‌చంద్ర రూ. 5 లక్షల ఖరీదైన బైక్‌పై ఆఫీసుకు వెళ్తున్న వీడియో నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. అయితే, ఈ బైక్‌ను తన తండ్రికి రింకూ బహుమతిగా ఇచ్చాడట. తండ్రికి ఖరీదైన బైక్‌ను కొనిచ్చిన రింకూపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



ఖో-ఖో వరల్డ్‌కప్‌లో మనోడి మెరుపులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశానికి తొలి ఖో-ఖో వరల్డ్‌కప్‌ను అందించిన భారత పురుషుల జట్టులో తెలుగు తేజం పోతిరెడ్డి శివారెడ్డి అసామాన్య ప్రతిభ దాగి ఉంది. బాపట్ల జిల్లా ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన శివారెడ్డి ఈ టోర్నీ ప్రారంభం నుంచి ఫైనల్ వరకు జరిగిన మొత్తం ఏడు మ్యాచ్‌ల్లోనూ ఆల్‌రౌండర్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తొలి మ్యాచ్‌లో నాలుగు పాయింట్లు సాధించిన శివారెడ్డి బెస్ట్ ఎటాకర్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత కూడా ప్రతి మ్యాచ్‌లో నాలుగు పాయింట్లు తగ్గకుండా సాధించి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. కఠినమైన ప్రత్యర్థులైన నేపాల్, శ్రీలంక, దక్షిణాఫ్రికా జట్లపైనా శివారెడ్డి అద్భుత ప్రదర్శన కనబర్చడం భారత జట్టు విజయాలకు బాగా ఉపకరించింది. శివారెడ్డి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ జట్టు ఈనెల 28 నుంచి జరిగే జాతీయ క్రీడల్లో బరిలోకి దిగనుంది.

రైల్లో కింద కూర్చొని..: చిన్న రైతు కుటుంబం నుంచి వచ్చిన శివారెడ్డి కెరీర్ ప్రారంభంలో అనేక ఇబ్బందులు పడ్డాడు. శివారెడ్డి ప్రతిభను గుర్తించిన కోచ్ సీతారాంరెడ్డి అద్దంకిలోని ఎస్ఆర్ఆర్ ఖో-ఖో అకాడమీలో అతడిని తీర్చిదిద్ది జాతీయ స్థాయి క్రీడాకారుడిగా తయారు చేశారు. కెరీర్ తొలినాళ్లలో శివారెడ్డి జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర తరఫున ఆడేందుకు రైలులో జనరల్ బోగీలో కింద కూర్చొని 35 గంటలకు పైగా ప్రయాణం చేసి వెళ్లేవాడు. ఖో-ఖో ఆడి ఏం సాధిస్తావంటూ హేళన చేసిన వారికి ఈ వరల్డ్‌కప్ విజయమే సమాధానమని శివారెడ్డి ఇప్పుడు గర్వంగా చెబుతున్నాడు.

స్టార్ల జోరు క్వార్టర్స్ రంజు



సిన్నర్

ఆస్ట్రేలియన్ ఓపెన్

- సిన్నర్, స్వియటెక్, స్విటోలినా ముందుకు
- రిబకినా, కసట్కినా ఇంటిబాట



స్విటోలినా

మెల్‌బోర్న్: స్టార్లంతా దూకుడు ప్రదర్శిస్తుండడంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్స్ రంజుగా సాగనున్నాయి. టైటిల్ ఫేవరెట్లు కార్లోస్ అల్కారజ్, నొవాక్ జొకోవిచ్ రౌండ్-8లో అమీతుమీ తేల్చుకొనేందుకు సిద్ధమవగా..తాజాగా డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్‌తోపాటు మహిళల రెండో సీడ్ ఇగా స్వియటెక్ కూడా క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టారు. సోమవారం జరిగిన నాలుగో రౌండ్‌లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 6-3, 3-6, 6-3, 6-2తో 13వ సీడ్ రూన్ (డెన్మార్క్)పై విజయంతో క్వార్టర్స్‌కు చేరాడు. రౌండ్-8లో ఎనిమిదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)తో సిన్నర్ తలపడతాడు. మరో ప్రీక్వార్టర్‌ఫైనల్లో డిమినార్ 6-0, 7-6 (5), 6-3తో అలెక్స్ మిచెల్సన్ (అమెరికా)ని ఓడించాడు. 21వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) 7-6 (3), 6-7 (7), 7-6 (2), 1-0తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) గాయంతో వైదొలిగాడు. ఇంకో రౌండ్-16 పోరులో లోరెంజో సొనేగో (ఇటలీ) 6-3, 6-2, 3-6, 6-1 అమెరికా టీనేజర్ లెర్నర్ టీన్ జోరుకు బ్రేక్ వేశాడు. 19 ఏళ్ల అన్‌సీడెడ్ టీన్..రెండో రౌండ్‌లో ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్‌కు షాకిచ్చిన సంగతి తెలిసిందే. క్వార్టర్‌ఫైనల్లో షెల్టన్‌ను సొనేగో ఢీకొంటాడు.

రిబకినాకు కీస్ ఝలక్



నేటి కీలక మ్యాచ్
జొకోవిచ్ X అల్కారజ్
మ.,2.40 నుంచి

మహిళల సింగిల్స్‌లో ఆరో సీడ్ ఎలెనా రిబకినా (కజకిస్థాన్), తొమ్మిదో సీడ్ కసట్కినాకు చుక్కెదురైంది. 19వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-3, 1-6, 6-3తో రిబకినాను తిరుగుముఖం పట్టించింది. క్వార్టర్‌ఫైనల్లో ఎలీనా స్విటోలినాతో కీస్ తలపడనుంది. మరో ప్రీక్వార్టర్‌ఫైనల్లో 28వ సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్) 6-4, 6-1తో కుడెర్మెటోవా (రష్యా)పై నెగ్గింది. ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా) 6-4, 5-7, 7-5తో తొమ్మిదో సీడ్ కసట్కినా (రష్యా)పై విజయం సాధించింది. రెండో సీడ్ స్వియటెక్ (పోలెండ్) జోరు కొనసాగిస్తూ 6-0, 6-1తో ఇవా లిస్ (జర్మనీ)పై వరుస సెట్లలో నెగ్గి క్వార్టర్‌ఫైనల్స్‌లో అడుగుపెట్టింది. క్వార్టర్స్‌లో ఎమ్మా నవారోను స్వియటెక్ ఢీకొంటుంది.

స్ర్కూ లూజ్ సమస్యతో..



మెల్‌బోర్న్‌లో ఎండలు అదరగొడుతున్నాయి. భానుడి భగభగలతో ఉక్కపోతగా ఉంది. సోమవారం 32 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో గంటలకొద్దీ మ్యాచ్‌లు ఆడేందుకు ఆటగాళ్లు ఆపసోపాలు పడ్డారు. ఇక..రూన్‌తో మ్యాచ్ సందర్భంగా నెం.1 ర్యాంకర్ సిన్నర్ ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం చల్లటి టవల్‌తో పదేపదే ముఖం తుడుచుకుంటూ కనిపించాడు. అంతేకాదు మూడో సెట్‌లో 10 నిమిషాలు మెడికల్ టైమవుట్ కూడా తీసుకున్నాడు. ఇది చాలదన్నట్టు..నాలుగో సెట్‌లో జానిక్ కొట్టిన బంతి నెట్‌కు బలంగా తగిలింది. దాంతో నెట్‌ను కోర్టు నేలకు అనుసంధానం చేసే స్ర్కూ వదులైంది. ఫలితంగా దానిని మళ్లీ బిగించేందుకు సిబ్బంది 20 నిమిషాలు శ్రమించాల్సి వచ్చింది.

కార్ల్‌సన్‌కు తొమ్మిదేళ్ల బాలుడి షాక్!



ఢాకా: అవును..ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు బంగ్లాదేశ్ బాలుడొకరు చెక్ చెప్పాడు. ఓ ఆన్‌లైన్ టోర్నీలో ఇది చోటు చేసుకుందని బంగ్లాదేశ్‌కు చెందిన చెస్ కోచ్, ఫిడే మాస్టర్ నయీమ్ హక్ వెల్లడించాడు. ఢాకాలో మూడో తరగతి చదువుతున్న రషీద్ ముగ్ద, కార్ల్‌సన్ నడుమ ఈనెల 18న 'చెస్.కామ్' ఆధ్వర్యంలో బుల్లెట్ బ్రాల్ గేమ్ జరిగింది. బుల్లెట్ బ్రాల్ గేమ్‌లో ఆటగాళ్లు కేవలం నిమిషంలోనే ఎత్తులు వేసేయాలి. అయితే ఈ గేమ్ 20వ ఎత్తులో కార్ల్‌సన్ మౌస్‌ను క్లిక్ చేయడంలో పొరపడ్డాడు. దాంతో అతడి రాణి..తప్పుడు గడిలోకి వెళ్లిపోయింది. దరిమిలా ముగ్దకు సంచలన విజయం దక్కింది.

అర్జున్‌పై ప్రజ్ఞానంద గెలుపు

వికాన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసికి మూడో రౌండ్లో చుక్కెదురైంది. సోమవారం జరిగిన గేమ్‌లో అర్జున్‌ను భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద ఓడించాడు. ఇక, ప్రపంచ చాంపియన్ గుకేష్, పెంటేల హరికృష్ణకు డ్రాలు ఎదురయ్యాయి. మూడో రౌండ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా)తో గుకేష్, భారత్‌కే చెందిన లియాన్ లూక్ మెండోన్కాతో హరి గేమ్‌లు డ్రా చేసుకున్నారు. ఇక, అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో వ్లాదిమిర్ ఫెడోసివ్ (రష్యా), కీమెర్ విన్సెంట్ (పోలెండ్)తో వీ ఈ (చైనా) గేమ్‌లు కూడా డ్రాగా ముగిశాయి. మూడు రౌండ్ల అనంతరం ప్రజ్ఞానంద 2.5 పాయింట్లతో ఆధిక్యంలో కొనసాగుతున్నాడు.

నీరజ్ చోప్రా వివాహం.. అంత రహస్యంగా ఎలా?





న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఎంతో రహస్యంగా వివాహం చేసుకోవడం ఇప్పుడు అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. సోషల్ మీడియా యుగంలో ఓ మాదిరి సెలబ్రిటీలే తన వ్యక్తిగత విషయాలను బయటకు పొక్కకుండా దాచలేకపోతున్నారు. అలాంటిది కోట్లాది మంది అభిమానులున్న చోప్రా తన పెళ్లి విషయాన్ని ఇంత గుట్టుగా ఎలా ఉంచాడనేది అంతుబట్టడం లేదు. హరియాణాలో కాకుండా హిమాచల్ ప్రదేశ్‌లో హిమానితో చోప్రా వివాహం జరిగింది. పెళ్లి జరిగిన రెండు రోజుల తర్వాత అతడు సోషల్ మీడియాలో ఫొటోలను పోస్టు చేస్తే కానీ బయటి ప్రపంచానికి ఈ వార్త తెలియలేదు. అయితే, పెళ్లి గురించిన సమాచారాన్ని బయటకు తెలియకుండా చూడాలని నీరజ్ కోరినట్టు అతడి మేనమామ భీమ్ చోప్రా చెప్పాడు. 'కొన్ని నెలల ముందు నుంచే పెళ్లి అనుకుంటున్నా.. ఆ విషయాన్ని గుట్టుగా ఉంచాం. సుమారు రెండేళ్ల నుంచే హిమానితో చోప్రాకు పరిచయం ఉంది. అందరూ ఈ పెళ్లిని ప్రైవేటుగానే ఉంచాలని భావించార'ని భీమ్ చెప్పాడు. నీరజ్ వివాహం గురించి భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ)కు ముందుగానే సమాచారం ఉందని ఓ అధికారి తెలిపాడు. అతడి ఏకాంతానికి గౌరవం ఇచ్చినట్టు చెప్పాడు. ఈ నెల 16న హిమానితో చోప్రా వివాహం జరిగింది. సోనీపట్‌కు చెందిన హిమాని జాతీయస్థాయి టెన్నిస్ ప్లేయర్. ప్రస్తుతం ఆమె అమెరికాలో చదువుకొంటోంది.

గంభీర్ సమర్థుడు



ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్

కోల్‌కతా: భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అద్భుత నాయకుడని ఇంగ్లండ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ కొనియాడాడు. గతంలో తాను అతడితో కలిసి పనిచేశానని గుర్తు చేశాడు. 'ఐపీఎల్‌లో లఖ్‌నవూ, కోల్‌కతా జట్ల తరఫున గంభీర్ సాధించిన రికార్డులు గమనించాలి. ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ఆట తీరును వెలికితీయగల సామర్థ్యం గౌతీకి ఉంది. ఇక భారత్‌ను అడ్డుకునేందుకు మేం తగిన ప్రణాళికలతో ముందుకెళ్లాల్సి ఉంటుంది' అని మెకల్లమ్ తెలిపాడు.

టీమిండియా ప్రాక్టీస్ షురూ

రేపటి నుంచి ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్



కోల్‌కతా: ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టు సన్నాహకాలను ఆరంభించింది. దీనిలో భాగంగా సోమవారం ఈడెన్ గార్డెన్స్‌లో ఆటగాళ్లంతా నెట్స్‌లో చెమటోడ్చారు. ఇదే వేదికపై బుధవారం తొలి టీ20 జరుగనుంది. ఏడాది విరామం తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన వెటరన్ పేసర్ మహ్మద్ షమి రెండు గంటలపాటు బౌలింగ్ సాధన చేశాడు. అతడి ప్రాక్టీస్‌ను కోచ్ గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ నిశితంగా గమనించారు. దేశవాళీ టోర్నీల్లో షమి సత్తా చాటినా, అంతర్జాతీయ స్థాయిలో అతడి ఫిట్‌నెస్ ఎలా ఉండనుందో తేలాల్సి ఉంది. ఇక హార్దిక్, శాంసన్‌లతో కోచ్ గంభీర్ వేర్వేరుగా సంభాషించాడు. జట్టు వైస్ కెప్టెన్‌గా హార్దిక్ ఉండాలని కోచ్ గంభీర్ కోరుకున్నా..సెలెక్టర్లు అక్షర్ వైపు మొగ్గుచూపారని కథనాలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో గంభీర్ అర్ధగంటపాటు హార్దిక్‌తో మాట్లాడడం ఆసక్తి రేపుతోంది. మరోవైపు అభిషేక్, రింకూ, జురెల్, నితీశ్, తిలక్‌లతో బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ప్రాక్టీస్ చేయించాడు.

ముంబై రంజీ జట్టులో రోహిత్, జైస్వాల్

ముంబై: సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ దేశవాళీ క్రికెట్ ఆడబోతున్నాడు. రంజీ ట్రోఫీ కోసం ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) 17 మందితో కూడిన తమ జట్టును ప్రకటించింది. ఈనెల 23 నుంచి జమ్మూ కశ్మీర్‌తో తలపడే ఈ మ్యాచ్‌కు అజింక్యా రహానె నేతృత్వం వహించనున్నాడు. టీమ్‌లో రోహిత్, యశస్వి జైస్వాల్‌కు చోటు కల్పించారు. 2015లో రోహిత్ చివరి రంజీ మ్యాచ్ ఆడాడు. అయితే ఇటీవలి ఆసీస్ పర్యటనలో భారత జట్టు సిరీస్ ఓటమితో బోర్డు కఠిన ఆంక్షలు విధించింది. అందుబాటులో ఉన్న టీమిండియా ఆటగాళ్లు కచ్చితంగా దేశవాళీ మ్యాచ్‌లు ఆడాల్సిందేనని తేల్చి చెప్పింది. ఇక, విరాట్ కోహ్లీ కూడా రంజీల్లో ఆడేందుకు అంగీకరించినట్లు ఢిల్లీ జట్టు తెలిపింది. అయితే, ఈనెల 23న సౌరాష్ట్రతో జరిగే మ్యాచ్‌కు గాకుండా.. 30 నుంచి రైల్వేస్‌తో జరిగే పోరుకు అందుబాటులో ఉంటాడని ఢిల్లీ పేర్కొంది. తొలి మ్యాచ్ ఆ జట్టు చివరి మ్యాచ్‌గా ముంబై జట్టు శ్రేయాస్ అయ్యర్, శివమ్ దూబే, శార్దూల్ ఠాకూర్, తనుష్ కోటియన్‌లతో కలిపి అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది.

దీర్ఘకాలిక పని గంటలు..

ఎవరూ డిమాండ్ చేయలేరు..

- దానిపై చర్చించడం కాదు.. ఆత్మ పరిశీలన చేసుకోవాలి..
- ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ఎన్ నారాయణ మూర్తి

ముంబై: వారానికి 70 గంటలు పనిచేయాలంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు ఎన్ఆర్ఎన్ నారాయణ మూర్తి యువతరాన్ని ఉద్దేశించి గతంలో చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీర్ఘకాలిక పనిగంటలపై మూర్తి తాజాగా మరో ఆసక్తికర వ్యాఖ్య చేశారు. ఎవరూ ఎక్కువ గంటలు పనిచేయమని అడగలేరు. కానీ, ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకుని దాని అవసరాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఐఎంసీలో సోమవారం జరిగిన కిలాచంద్ స్మారక ప్రసంగ కార్యక్రమంలో వృత్తి-వ్యక్తిగత జీవిత సమతుల్యతపై అడిగిన ప్రశ్నకు మూర్తి పై విధంగా సమాధానమిచ్చారు. " నేను ఇన్ఫోసిస్‌లో 40 ఏళ్లకు పైగా వారానికి 70 గంటలు పనిచేశా. రోజూ ఉదయం 6.30 గంటలకే వెళ్లి రాత్రి 8.30 గంటలకు ఆఫీసు నుంచి బయలుదేరే వాడిని. అది తప్పని ఎవరూ చెప్పలేరు. దీర్ఘకాలిక పనిగంటలు చర్చించాల్సిన అంశం కాదు. ఇది ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకొని, అవసరాన్ని గ్రహించి, ఒక నిర్ణయానికి వచ్చాక వారు కోరుకున్నది చేయాల్సిన అంశ"మని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎంతసేపని భార్యని చూస్తూ కూర్చుంటారు.. వారానికి 90 గంటలు పనిచేయాలంటూ ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఈమధ్య తన ఉద్యోగులను ఉద్దేశించి వ్యాఖ్యానించడంతో వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై చర్చ మరింత ఉధృతమైంది. ఈ నేపథ్యంలో మూర్తి తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'గో ఫస్ట్' ఇక తెర మరుగు

లిక్విడేషన్‌కు ఎన్‌సీఎల్‌టీ ఆదేశం



న్యూఢిల్లీ: ఆర్థిక ఇక్కట్లతో రెండేళ్ల క్రితం విమాన సర్వీసులు నిలిపివేసిన గో ఫస్ట్ విమానయాన సంస్థపై దివాలా ప్రక్రియ చేపట్టాలని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సోమవారం ఆదేశించింది. 2023 మే నెలలో గో ఫస్ట్ విమానయాన సంస్థ స్వచ్ఛందంగా దివాలా దరఖాస్తు చేసింది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ డెటార్ గో ఎయిర్ (ఇండియా) లిమిటెడ్ దివాలా ప్రక్రియ ప్రారంభించాల్సిందిగా రుణదాతల కమిటీని (సీఓసీ) ఆదేశిస్తున్నట్టు ఎన్‌సీఎల్‌టీ సోమవారం నాడు జారీ చేసిన 15 పేజీల ఉత్తర్వులో తెలిపింది. కార్పొరేట్ డెటార్‌ను లిక్విడేట్ చేసే హక్కు చట్టపరమైన ఈ స్కీమ్‌లోని రుణదాతల కమిటీకి (సీఓసీ) ఉంటుందని సోమవారం నాటి ఉత్తర్వులో ఎన్‌సీఎల్‌టీ తెలిపింది. రిజల్యూషన్ ప్లాన్‌ను ధ్రువీకరించడానికి ముందు, సీఓసీ ఏర్పాటైన నాటి నుంచి ఎప్పుడైనా లిక్విడేషన్ ప్రక్రియ చేపట్టే అధికారం సీఓసీదేనని తేల్చిచెప్పింది. "లిక్విడేషన్ కోసం సీఓసీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకునే అధికారం ఎన్‌సీఎల్‌టీ వంటి చట్టపరంగా ఏర్పాటైన ఏ సంస్థకు లేదు. పైగా కార్పొరేట్ డెటార్‌ను లిక్విడేట్ చేయాలన్న తీర్మానాన్ని సీఓసీ 100 శాతం ఓటింగ్‌తో ఆమోదించింది. సీఓసీకి గల వాణిజ్యపరమైన అధికారాల్లో జోక్యం చేసుకునే అవకాశం ఎన్‌సీఎల్‌టీకి లేదు" అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

2019 ఏప్రిల్‌లో విమాన సర్వీసులు నిలిపివేసిన జెట్ ఎయిర్‌వేస్ లిక్విడేషన్‌కు గత ఏడాది నవంబరు 7వ తేదీన సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన రెండు నెలల వ్యవధిలోనే గో ఎయిర్ లిక్విడేషన్ ఉత్తర్వులు వెలువడడం విశేషం. ఒకప్పుడు గో ఎయిర్‌గా ఉండి 17 ఏళ్లకు పైగా విమాన సర్వీసులు నడిపిన సంస్థను 2023 మే 3వ తేదీన సంస్థను గో ఫస్ట్‌గా రీ బ్రాండింగ్ చేశారు. దినకర్ తిరువన్నదపురం వేంకటసుబ్రమణియన్‌ను సంస్థ లిక్విడేటర్‌గా నియమించారు. తదుపరి చర్యలు తీసుకోవాలని, కార్పొరేట్ డెటార్ ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తును కొనసాగించాలని లిక్విడేటర్‌ను ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. లిక్విడేషన్ సమయంలో పెండింగులో ఉన్న దరఖాస్తులపై తదుపరి చర్యలు తీసుకోవడంతో పాటు చట్టానికి అనుగుణంగా కార్పొరేట్ డెటార్ నుంచి బకాయిల రికవరీకి కూడా చర్యలు తీసుకోవలసి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

టీవీఎస్ కింగ్ ఈవీ మ్యాక్స్

ధర రూ.2.95 లక్షలు



న్యూఢిల్లీ: టీవీఎస్ మోటార్ కంపెనీ విద్యుత్ త్రి చక్ర రంగంలోకి ప్రవేశించింది. తొలి విద్యుత్ త్రీ వీలర్ కింగ్ ఈవీ మ్యాక్స్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఢిల్లీలో దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.95 లక్షలు. ఒకసారి చార్జింగ్ చేస్తే 179 కిలోమీటర్లు నడుస్తుంది. 2030 నాటికి టూ వీలర్లు, త్రీ వీలర్ విభాగం అంతా విద్యుత్ వాహన విభాగంగా మారిపోతుందని భావిస్తున్నట్టు కంపెనీ డైరెక్టర్, సీఈఓ కేఎన్ రాధాకృష్ణన్ చెప్పారు. ప్రస్తుతం ప్రయాణికుల కోసం దీన్ని విడుదల చేశామని, త్వరలో వస్తు రవాణా ఈవీని కూడా విడుదల చేస్తామని ఆయన తెలిపారు. అలాగే దీన్ని విదేశీ మార్కెట్లకు కూడా ఎగుమతి చేస్తామన్నారు.

గ్రీన్‌కో రూ.6,920 కోట్ల సమీకరణ!

ముంబై: జపాన్‌కు చెందిన ఫైనాన్షియల్ గ్రూప్ ఓరిక్స్ కార్పొరేషన్‌కు కంపెనీలో ఉన్న 20 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు గ్రీన్‌కో ఎనర్జీ హోల్డింగ్స్ వ్యవస్థాపకులు 80 కోట్ల డాలర్ల (రూ.6,920 కోట్లు) రుణ సమీకరణ యత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. గ్రీన్‌కో వ్యవస్థాపకులకు చెందిన ఏఎం గ్రీన్ పవర్ బీవీ ఈ నిధులను సమీకరించనుందని బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. ఇందుకోసం బార్‌క్లేస్ పీఎల్‌సీ, డాయిష్ బ్యాంక్ ఏజీని నియమించుకున్నట్లు సమాచారం. నెదర్లాండ్స్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఏఎం గ్రీన్ పవర్‌కు గ్రీన్‌కో ఎనర్జీలోని 20 శాతం వాటాను 140 కోట్ల డాలర్లకు విక్రయించేందుకు ఓరిక్స్ ఇప్పటికే అంగీకరించింది.

డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సైయెంట్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీకి చెందిన ప్రాంతీయ విమాన తయారీ సంస్థ డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాన్ని మరింతగా విస్తరించినట్లు సైయెంట్ వెల్లడించింది. 40 సీట్లతో కూడిన రీజినల్ టర్బోప్రాప్ డీ328ఎకో విమానానికి సంబంధించి కీలకమైన ఏవియేషన్ సిస్టమ్స్ రక్షణ సహా అడ్వాన్స్‌డ్ టెక్నికల్ డాక్యుమెంటేషన్ నిర్వహణ కోసం బహుళ సంవత్సరాల కాంట్రాక్ట్‌ను దక్కించుకున్నట్లు సైయెంట్ తెలిపింది.

బజాజ్ ఫైనాన్స్ ఎయిర్‌టెల్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: ఆర్థిక సేవల కోసం డిజిటల్ వేదిక రూపొందించడంలో సహకరించుకునేందుకు బజాజ్ ఫైనాన్స్, భారతి ఎయిర్‌టెల్ చేతులు కలిపాయి. ఈ భాగస్వామ్యం కింద ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌పై రిటైల్ ఫైనాన్షియల్ ఉత్పత్తులను బజాజ్ ఫైనాన్స్ అందుబాటులో ఉంచుతుంది. ఫైనాన్షియల్ ఉత్పత్తులు, సేవలు సమాజంలో లోతుగా చొచ్చుకుపోయేందుకు రెండు కంపెనీల డిజిటల్ ఆస్తులు సహాయకారి అవుతాయి.

ఏఐజీలో న్యూరో క్యాథ్ ల్యాబ్

» బ్రెయిన్ స్ట్రోక్ నిర్ధారణ, చికిత్స అన్నీ ఒకే చోట

» ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షవాత బాధితులకు సత్వర చికిత్స అందించడానికి ఏఐజీ ఆస్పత్రిలో ప్రత్యేకంగా న్యూరో క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల జబ్బు నిర్ధారణ, చికిత్స అందించడంలో జాప్యం తగ్గిపోతుంది. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో రూ.20 కోట్లతో ఏర్పాటు చేసిన న్యూరో క్యాథ్ ల్యాబ్‌ను ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. కేవలం స్ట్రోక్ బాధితుల కోసమే న్యూరో క్యాథ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. రోగికి ఒక చోట సిటీ స్కాన్, మరో చోట వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మరో చోట చికిత్స ఇలా కాకుండా ఈ న్యూరో క్యాథ్‌ల్యాబ్‌తో అన్నీ ఒకే చోట నిర్వహించి అక్కడిక్కడే అవసరమైన వైద్యం అందించే అవకాశముందని వివరించారు. ప్రత్యేకమైన న్యూరో ఐసీయూ, స్ట్రోక్ నిపుణుల నిరంతర పర్యవేక్షణ వల్ల న్యూరోవాస్కులర్ ఎమర్జెన్సీల నిర్వహణలో ఇది గొప్ప ముందడుగని పేర్కొన్నారు. దేశంలో ప్రతి ఏటా దాదాపు 18 లక్షల స్ట్రోక్ కేసులు నమోదు అవుతున్నట్లు వైద్యులు వివరించారు.

గవర్నర్ ప్రతిభా పురస్కారాల ప్రకటన

» ఈ నెల 26న గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు

హైదరాబాద్,జనవరి 20(ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రతిభా పురస్కారాలు 2024కు ఎంపికైన వారి జాబితాను గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ప్రకటించారు. రాజ్‌భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో వ్యక్తిగతంగా, సంస్థల పరంగా అత్యుత్తమ సేవలు అందించిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు వివరించారు. అవార్డు కింద రూ.2 లక్షల నగదు, జ్ఞాపికను అందించనున్నట్లు తెలిపారు. అవార్డులకు ఎంపికైన వారిలో పర్యావరణ విభాగంలో దూషర్ల సత్యనారాయణ, దివ్యాంగుల సంక్షేమ విభాగంలో ఎ.రఘు, క్రీడల విభాగంలో జీవాన్జి దీప్తి, సాంస్కృతిక విభాగంలో పి.బి. కృష్ణభారతి, ఎం.పాండురంగారావు ఉన్నారు. సంస్థల పరంగా ఇచ్చిన అవార్డుల్లో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ధుర్వాన్ష్ సంస్థ, వికలాంగుల సంక్షేమ విభాగంలో ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి, క్రీడల్లో ఆదిత్య మెహతా ఫౌండేషన్, సాంస్కృతిక విభాగంలో సంస్కృతి ఫౌండేషన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

పిటిషనర్లకే ఉద్యోగాలు ఇవ్వండి

» లైన్‌మెన్ పోస్టుల భర్తీపై హైకోర్టు స్పష్టత

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) పోస్టులను కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లతోనే భర్తీ చేయాలని దక్షిణ డిస్కంను హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికే స్తంభం ఎక్కే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికే ఆ ఉద్యోగాలు ఇవ్వాలని తెలిపింది. ఒకవేళ ఆ పరీక్ష నిర్వహించకుంటే వెంటనే దానిని జరపాలని స్పష్టం చేసింది. 2019లో దక్షిణ డిస్కం 2,500 జేఎల్ఎం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే వీటికి రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయడాన్ని సవాల్ చేస్తూ 110 మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. పిటిషనర్లకు అనుకూలంగా తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ డిస్కం డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ ధర్మాసనం విచారణ చేపట్టింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. ఆ ఖాళీలను పిటిషనర్లతో మాత్రమే భర్తీ చేయాలని తీర్పునిచ్చింది.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రణ!

» ఆర్థిక వ్యవహారాల విభాగానికి కేంద్ర ఆర్థిక శాఖ సూచన

న్యూఢిల్లీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరెన్సీ నోట్లపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని డాక్టర్ జేరిపోతుల పరుశురామ్ చేసిన అభ్యర్థనపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవహారాల విభాగానికి సూచించింది. కరెన్సీపై అంబేడ్కర్ ఫొటోను ప్రచురించాలనే డిమాండ్‌తో ఏర్పడిన కమిటీకి జాతీయ అధ్యక్షుడుగా ఉన్న పరుశురామ్ గతేడాది డిసెంబరు 17న తమకు లేఖ రాశారని ఆర్థిక మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ అరుణ్‌కుమార్ తెలిపారు. అయితే నిబంధనల ప్రకారం నాణేలు, కరెన్సీకి సంబంధించిన విషయాలు ఆర్థిక వ్యవహారాల విభాగం పరిధిలోకి వస్తాయని అందువల్ల పరుశురామ్ లేఖపై అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్థిక వ్యవహారాల విభాగాన్ని కోరామని ఆయన తెలిపారు.

పిల్లలకు కీహోల్, రోబోటిక్ శస్త్రచికిత్సలు

» కిమ్స్ కడల్స్ సదస్సులో సీనియర్ వైద్య నిపుణులు

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు కీహోల్, రోబోటిక్ శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయని, ఈ వైద్యవిధానాలు శిశువులకు రక్షగా ఉంటున్నాయని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ సర్జన్స్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రి ప్రాంగణంలో 2 రోజుల పాటు నిర్వహించిన తొమ్మిదో వార్షిక సదస్సు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సదస్సు చీఫ్ ప్యాట్రన్ టి.వి.మధుసూదనమూర్తి, చైర్మన్ హరీష్ జయరాం, నిర్వహణ కార్యదర్శి మందాకిని, సహాయ నిర్వహణ కార్యదర్శి ఎం.యోగనాగేందర్ మాట్లాడారు. సదస్సులో సీనియర్ వైద్యులు తమ అనుభవాలను వివరించారు. నవజాత శిశువుల్లో వచ్చే సమస్యలు తీవ్రంగా ఉంటాయని, వాటికి చికిత్సలు చేసేటప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తే ఫలితాలు ప్రభావవంతంగా ఉంటాయన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసై.. డబ్బు దురాశతో..

» డ్రగ్స్ తరలిస్తూ పోలీసులకు చిక్కిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

సంగారెడ్డి రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసై.. వచ్చే జీతం వాటికే ఖర్చయిపోతుండడంతో ఓ టెకీ రెండో ఆదాయ మార్గంగా డ్రగ్స్‌ను విక్రయించడం మొదలుపెట్టాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న జమ్మూకశ్మీర్‌కు చెందిన హర్జిత్ సింగ్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. ఈక్రమంలో తానే డ్రగ్స్ వ్యాపారిగా మారి తోటి ఉద్యోగులు, ఇతరులకు అమ్మడం మొదలుపెట్టాడు. సోమవారం పుణె నుంచి మిథైనిల్ డయాక్సీ మెటాఫిటమైన్ క్రిస్టల్స్‌ను తెస్తుండగా, సంగారెడ్డి డీటీఎఫ్ సిబ్బందితో కలిసి హైదరాబాద్ ఎక్సైజ్ పోలీసులు కొండాపూర్ మండలం మల్కాపూర్ వద్ద తనిఖీల్లో పట్టుపడ్డాడు. అతడి నుంచి రూ.21.06 లక్షల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.

ప్రేమ పెళ్లి వాయిదా పడటంతో ఒకరు.. ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కాలేదని మరొకరు

» బలవన్మరణానికి పాల్పడిన ఇద్దరు యువకులు

మహాముత్తారం/ మొగుళ్లపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కావడం లేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోగా, ప్రేమ పెళ్లి వాయిదా పడటంతో మరో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన రెండు వేర్వేరు ఘటనలు భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకున్నాయి. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని సింగపల్లికి చెందిన వాసం మహేశ్ (24) అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని బంధువుల ద్వారా ఆమె తల్లిదండ్రులకు మహేశ్ కబురు పంపగా యువతి తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన మహేశ్ ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మరో ఘటనలో ప్రేమించిన అమ్మాయితో పెళ్లి వాయిదా పడిందనే మనస్తాపంతో మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లికి చెందిన వంగ భరత్ కుమార్ (20) అనే యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇటీవల భరత్‌కుమార్ తల్లి మృతి చెంది ఉన్న నేపథ్యంలో సంవత్సరీకం తర్వాత పెళ్లి చేస్తానని తండ్రి అతనికి చెప్పాడు. దాంతో మానసికంగా కుంగిపోయిన భరత్‌కుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో పురుగుల మందు తాగాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పెండింగ్ కేసుల పరిష్కారంలో తెలంగాణ హైకోర్టు ముందంజ

వీడ్కోలు సమావేశంలో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గొప్ప సాంస్కృతిక, వారసత్వ సంపద కలిగిన తెలంగాణ రాష్ట్రం.. న్యాయపరమైన సంప్రదాయాలను పాటించడంలో సైతం ప్రత్యేక స్థానంలో నిలుస్తోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీపై వెళ్తున్న ఆయనను సోమవారం జడ్జీలు, న్యాయవాదులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు న్యాయమూర్తులందరి సమష్టి కృషితో పెండింగ్ కేసులతో పాటు, తాజా కేసుల పరిష్కారానికి కృషి చేసినట్టు తెలిపారు. ఈ విషయంలో ముందంజలో ఉన్నామని అన్నారు. ఎన్‌స్టెప్ వ్యవస్థ ద్వారా డిజిటల్‌గా వారంట్లు, సమన్లు అందజేస్తున్న రెండో ఉన్నత న్యాయస్థానంగా తెలంగాణ హైకోర్టు నిలిచిందని తెలిపారు. అనవసరంగా వాయిదాలు ఇచ్చే సంప్రదాయానికి ముగింపు పలికి, న్యాయవ్యవస్థ గౌరవాన్ని పెంపొందించడానికి ప్రయత్నం చేశామని చెప్పారు. ఈ క్రమంలో న్యాయవాదులు ఇబ్బందికి గురైఉంటే క్షమించాలని కోరారు. ఎక్కువశాతం మహిళా న్యాయమూర్తులు కలిగి, దేశంలోనే సరికొత్త హైకోర్టుల్లో ఒకటైన తెలంగాణ హైకోర్టుకు నేతృత్వం వహించడం తనకు గర్వకారణమన్నారు. సమావేశంలో సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తదితరులు ప్రసంగించారు. జస్టిస్ అరాధేను హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు సన్మానించారు.



బాంబే హైకోర్టుకు బదిలీ అయిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధేను సన్మానిస్తున్న హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు

మార్చిలో కాళేశ్వరంపై తుది నివేదిక!

(మొదటిపేజీ తరువాయి)

ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది. 12 అధ్యాయాలతో నివేదికను రూపొందించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ముడిపడిన ఫైళ్లను అధ్యయనం చేయడంతో పాటు పలువురు సాక్షులను ప్రశ్నించి సేకరించిన ఆధారాలతో ఈ నివేదికను కమిషన్ తయారు చేసింది. బ్యారేజీల నిర్మాణంతో పాటు ఇతర పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్టు కమిషన్ నిర్ధారణకు వచ్చినట్టు తెలిసింది. కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించడానికి బ్యారేజీల అంచనాలను ఏటేటా అడ్డగోలుగా పెంచడంతో పాటు జరగని పనులకూ రూ.కోట్లలో బిల్లులు జారీ చేసినట్టు కమిషన్ ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఒక బ్యారేజీకి సంబంధించి పనులు ప్రారంభించడానికి ముందే 25 శాతానికి పైగా నిధులు కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు కమిషన్ గుర్తించింది. భారీగానే అధికారులకు ముడుపులు అందాయని అంచనాకు వచ్చింది. బ్యారేజీలకిసంబంధించిన విధానపర నిర్ణయాలు, సాంకేతిక, ఆర్థికపర అంశాలపై విచారణ దాదాపుగా పూర్తి కావస్తోంది. ఈ నెలతో పాటు ఫిబ్రవరిలో రెండు పర్యాయాల్లో మరి కొందరు సాక్షులను ప్రశ్నిస్తే విచారణ పూర్తి కానుంది. శాసనసభ బడ్జెట్



సమావేశాల ప్రారంభానికి ముందే తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశముంది. బడ్జెట్ సమావేశాల్లో ఈ నివేదికపై చర్చించే అవకాశం ఉంది. కమిషన్ ఇప్పటివరకు 80 మందికి పైగా ఇంజనీర్లు, ఐఏఎస్, మాజీ ఐఏఎస్ అధికారులను ప్రశ్నించింది. మంగళవారం నుంచి మరో దఫా ప్రశ్నించే కార్యక్రమాన్ని చేపట్టనుంది. తొలిరోజు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ప్రశ్నించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాల సమీకరణ కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అనుమతుల జారీలో ఆర్థిక శాఖ కీలక పాత్ర పోషించింది. కాళేశ్వరం కార్పొరేషన్‌కు లేని ఆదాయన్ని కాగితాలపై చూపి రుణాలను సమీకరించినట్టు వచ్చిన ఆరోపణలపై ఆయన్ను కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ నేత వి.ప్రకాష్‌తో పాటు బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ ఒకటి రెండు రోజుల్లో ప్రశ్నించే అవకాశంఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆడిట్ నిర్వహించిన కాగ్ అధికారులను సైతం ప్రశ్నించనుంది. మాజీ ఈఎన్‌సీతో పాటు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేసిన మరో మాజీ ఐఏఎస్‌ను రెండోసారి ప్రశ్నించే అవకాశం ఉంది.

ఫిబ్రవరిలో నేతలకు పిలుపు

కాళేశ్వరంపై నిర్ణయాలు తీసుకున్న నాటి సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ను ప్రశ్నించడానికి కమిషన్ ఫిబ్రవరిలో పిలవనుంది. వీరికి సమన్లు జారీ చేయడానికి ముందు వారికి వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలను కమిషన్ సిద్ధం చేసుకుంటోంది. కేసీఆర్‌ను ప్రశ్నించడంతో విచారణ ముగుస్తుంది. ఆ తర్వాత నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తారు.

ఈటలకు నోటీసులు ఇస్తారా?
పీసీ ఘోష్ కమిషన్ లక్ష్యమేంటి?

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి ఆరోపణలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై బీజేపీ జాతీయ నాయకత్వం ఆరా తీసింది. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు లక్ష్యమేంటి? ఎవరెవరికి సమన్లు జారీ చేస్తోంది? ఏయే అంశాలపై కమిషన్ విచారణ జరుపుతోంది? వంటి వివరాలను తక్షణం తమకు అందించాలని రాష్ట్రపార్టీ నాయకత్వాన్ని ఆదేశించింది. మాజీ మంత్రి ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు నోటీసులు జారీ చేసే అవకాశముందంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశంపైనా నివేదిక ఇవ్వాలని సూచించింది. దీంతో, నాలుగు పేజీల అత్యవసర నివేదికను పార్టీ రాష్ట్ర నేతలు సోమవారమే జాతీయనాయకత్వానికి పంపించారు. ఈ నివేదికలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను వివరించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ వచ్చిన ఆరోపణల నిగ్గు తేల్చేందుకు పీసీ ఘోష్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్.. కాళేశ్వరం ప్రాజెక్టు పనులతో సంబంధమున్న నీటిపారుదల శాఖతో పాటు ఆర్థికశాఖ ఉన్నతాధికారులను విచారించింది. 2014-17 మధ్యలో కాళేశ్వరం పనులు జరిగినప్పుడు అప్పటి నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు, అప్పటి ఆర్థిక మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ సమన్లు జారీ చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం ఆ నివేదికలో పొందుపరచినట్లు తెలిసింది. మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు అప్పటి నీటిపారుదల, ఆర్థిక మంత్రులను విచారించే అవకాశం ఉందని రాష్ట్ర పార్టీ నివేదించినట్లు సమాచారం.

పెగాసస్ సాఫ్ట్‌వేర్ కొనుగోలుపైనా ఆరా..

పెగాసస్ సాఫ్ట్‌వేర్ కొనుగోలు అంశంపైనా బీజేపీ జాతీయ నాయకత్వం వివరాలు తీసుకుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ అవసరాలకు వినియోగించినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సాఫ్ట్‌వేర్ కొనుగోలులో అప్పటి ఆర్థిక మంత్రిగా ఈటల సంతకం చేశారా? ఎవరెవరి ఫోన్లను అప్పట్లో ట్యాప్ చేశారు వంటి వివరాలను బీజేపీ జాతీయ నాయకత్వం తీసుకుంది.

బీఆర్ఎస్ మహాధర్నా వాయిదా

» పోలీసుల అనుమతి నిరాకరణ

» హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్

» అనుమతి రాకపోవడంతో వాయిదా

» 27న విచారించనున్న హైకోర్టు

నల్లగొండ ప్రతినిధి/హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ నిర్వహించాలని నిర్ణయించిన మహాధర్నా వాయిదాపడింది. బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా విభాగం సోమవారం ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవ్వాల్సిన మహాధర్నాకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించింది. అయితే.. పోలీసులు అనుమతిని నిరాకరించడంతో వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. కాగా.. ప్రభుత్వం ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలను నిర్వహిస్తోందని, ఆ తర్వాత 26న గణతంత్ర వేడుకలకు బందోబస్తు నిర్వహించాల్సి ఉండడంతో మహాధర్నాకు అనుమతినివ్వలేమని డీఎస్పీ శివరాంరెడ్డి బీఆర్ఎస్ నేతలకు తెలిపారు. దాంతో బీఆర్ఎస్ వర్గాలు సోమవారం మధ్యాహ్నం హైకోర్టును ఆశ్రయించాయి. లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశాయి. మహాధర్నా నిర్వహణకు అనుమతించాలని ఆ పిటిషన్‌లో విజ్ఞప్తి చేశాయి. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక రూ.12 వేలే అని ప్రకటించి మోసం చేసిందని పేర్కొన్నాయి. సీఎం రేవంత్‌మోసపూరిత హామీలకు వ్యతిరేకంగా రైతులకు మద్దతుగా శాంతియుత ధర్నాకు తమ పార్టీ పిలుపునిచ్చిందని వివరించాయి. నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం ప్రసాదించిందని, అయితే.. పోలీసులు మహాధర్నాకు నిరాకరించడం అన్యాయమంటూ ఆవేదన వ్యక్తం చేశాయి. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో పోలీసులు మహాధర్నాకు అనుమతినివ్వలేదన్నాయి. బీఆర్ఎస్ తరఫున న్యాయవాది రూపేందర్ వాదనలను వినిపించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. తమ వైఖరిని తెలియజేయాలంటూ పోలీసులను ఆదేశిస్తూ.. విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది.

అమెరికాలో రాష్ట్ర యువకుడి హత్య

» ఫుడ్ డెలివరీ చేసి వస్తుండగా దుండగుల కాల్పులు

» మృతుడు ఉమ్మడి నల్లగొండ వాసి

నల్లగొండ, ఎల్బీనగర్, హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత చదువు పూర్తిచేసుకున్న కుమారుడు, త్వరలో మంచి కొలువు సాధించి, కుటుంబానికి వెన్నుదన్నుగా ఉంటాడని ఆశించిన ఆ తల్లిదండ్రులకు దిగ్భ్రాంతికరమైన వార్త చెవినపడింది! తమ కుమారుడు ఇక లేడని తెలియడంతో కంటికిమంటికీ ధారగా రోదిస్తున్నారు. మృతు డు నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన రవితేజ (27). తల్లిదండ్రులు సువర్ణ-చంద్రమౌళి గౌడ్. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చంద్రమౌళి కుటుంబం నల్లగొండ తిరుమలనగర్ కాలనీలో స్థిరపడింది. ఐదేళ్ల క్రితం చంద్రమౌళి, జీవనోపాధి కోసంతన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని చైతన్యపురికొచ్చి ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అక్కడ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు రవితేజతో పాటు కూతురు ఉంది. రవితేజ హైదరాబాద్‌లో బీటెక్ చేశాడు. క్యాబ్ డ్రైవర్‌గా తనకొచ్చే సంపాదన సరిపోకపోవడంతో చంద్రమౌళి తనకున్న భూమినంతా విక్రయిం చి కుమారుడిని 2022లో, కుమార్తెను2023లో ఎంఎస్ చదివేందుకు అమెరికా పంపాడు. రవితేజ అక్కడ మాస్టర్స్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. తాత్కాలికంగా ఓ చైనీస్ రెస్టారెంట్‌లో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగం గా భారత కాలమాన ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 5:30 గంటలకు ఫుడ్ డెలివరీ చేసేందుకు కారులో ఓ కస్టమర్ ఇంటికి వెళ్లాడు. ఇద్దరు దుండగులు రవితేజపై కాల్పులు జరిపి, ఆయన కారును అపహరించుకుపోయారు. ఇక్కడ తెల్లవారుజామునే లేచి ఉదయం నడకలో ఉన్న రవితేజ తండ్రి చంద్రమౌళికి అమెరికాలోని సమీపబంధువు నుంచి ఫోనొచ్చింది. అమెరికాలో దుండగుల కాల్పులకు రవితేజ చేతులకు బుల్లెట్ గాయాలయ్యాయని, ఎలాంటి ప్రమాదం లేదని ఆయన చెప్పాడు. ఇది విని.. చంద్రమౌళి తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అమెరికాలోనే ఉన్న కుమార్తెకు ఫోన్ చేసి వివరాలు అడిగాడు. అన్నయ్యకు ఏమీ కాలేదని, తాను అక్కడికే వెళ్తున్నానంటూ చెప్పి తండ్రిని ఓదార్చేప్రయత్నం చేసినా, కొద్దిసేపటికే జరిగిన ఘోరం ఆయనకు తెలిసిపోయింది. మృతదేహాన్ని త్వరగా హైదరాబాద్‌కు తీసుకువచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహ కరించాలని చంద్రమౌళితో పాటు ఆయన సమీప బంధువులు కోరారు. సోమవారం ట్రంప్ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో రవితేజ మృతదేహం తరలింపు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. రవితేజ మృతదేహం తరలింపునకు, ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులు నిధులు సేకరిస్తున్నారు.

బండి సంజయ్ పరామర్శ

రవితేజ కుటుంబాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మాట్లాడారు. కుటుంబాన్ని ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.


సూర్యాపేట జిల్లా రామోజీతండా వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

పొలాలు ఎండుతున్నాయ్.. నీరివ్వండి

» సూర్యాపేట జిల్లాలో 200 మంది రైతుల రాస్తారోకో

ఆత్మకూర్(ఎస్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ కాల్వ ద్వారా గోదావరి జలాలు రాకపోవడంతో తమ పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారబందీ ప్రకారం ఎండుతున్న పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని నసీంపేట, తిప్పాలగూడెం, రామోజీతండా, శెట్టిగూడెం గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు చివ్వెంల-ముకుందాపురం ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా గోదావరి జలాలతో పంటలు పండించుకుంటున్నామని, ఈ యాసంగి సీజన్‌లో పొలాలు నాటు పెట్టామన్నారు. నాట్లు వేయకముందు వారబందీ చొప్పున నీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం నీళ్ల నిలిపివేయడంతో పొలాలు ఎండిపోతున్నాయన్నారు. తక్షణమే గోదావరిజలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మంత్రి ఉత్తమ్ జిల్లాలోనే సాగునీటికి కటకట

» సీఎం సహా మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయ్

» హరగోపాల్ అరెస్టును ఖండిస్తున్నాం: హరీశ్‌రావు



హైదరాబాద్, జనవరి20(ఆంధ్రజ్యోతి): సాగు నీటి కోసం రైతన్నలు రోడ్డెక్కడం కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని, సాగునీటిశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంతజిల్లాలోనే సాగు నీటికి కట కటగా ఉందని మాజీమంత్రి తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రుల మాటలు కోటలు దాటుతుంటే ఆచరణ గడప దాటడం లేదని సోమవారం ఎక్స్ వేదికగా హరీశ్ విమర్శించారు. నాట్లదశలోనే సాగునీటికి గోసపడితే, పంట పూర్తయ్యేవరకు అన్నదాతల పరిస్థితి ఎలాగని ఆయన ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, మైలారంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన పౌరహక్కులనేత ప్రొఫెసర్ హరగోపాల్‌ను అరెస్టుచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్ చెప్పారు. ప్రజల తరపున పోరాడుతున్న ప్రజాసంఘాల నాయకుల గొంతునొక్కడం అమానుషమన్నారు. హరగోపాల్ సహా అరెస్టయిన ప్రజాసంఘాల నాయకులను తక్షణం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, మహిళల హక్కులను కాపాడేందుకు ఏర్పాటు చేసిన మహిళా కమిషన్ సభ్యులకు ఏడాది నుంచి రేవంత్ ప్రభుత్వం జీతాలు ఇవ్వడంలేదని తాజాగా తన దృష్టికి వచ్చిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. వెంటనే వారి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, ఇకపై ఒకటోతేదినే వారికి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఎం, డిప్యూటీ సీఎంలను డిమాండ్ చేశారు.

3 నెలలుగా జీతాల్లేవని ఏఈఈల నిరసన

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని నీటిపారుదల శాఖలోని 130 మందిఅసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఏఈఈలు) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం జలసౌధకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా వీరికి పోస్టింగులు ఇచ్చి, వేతన సమస్యను పరిష్కరించాలని హైదరాబాద్ ఇంజనీర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాపోలు రవీందర్, చక్రధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

రైతు ఆత్మహత్యలపై అధ్యయన కమిటీ

» 9 మంది సీనియర్ నేతలతో ఏర్పాటు: కేటీఆర్

» ప్రధాన ప్రతిపక్షంగా సర్కారుకు దిశానిర్దేశం చేస్తామని వెల్లడి



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభపరిస్థితులపై అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో 9 మందితో ఏర్పాటుచేసిన ఈ కమిటీలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ ఉన్నట్లు తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా రెండు వారాలపాటు విస్తృతంగా పర్యటించి రైతు ఆత్మహత్యలకు గల కారణాలను గుర్తిస్తుందని చెప్పారు. ఏడాదిలో వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను తయారు చేస్తుందని వివరించారు. క్షేత్రస్థాయి దుర్భర పరిస్థితులను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయశాఖ మంత్రికి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నివేదికను అందజేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనలో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని ఇప్పటికే 400 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకోవడం ఆందోళనకరమన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలన్న సదుద్దేశంతోనే ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ వెల్లడించారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రశ్నిస్తూ.. రేవంత్‌రెడ్డికి చుక్కలు చూపించాలని, ఒక కార్మికునికి కష్టం వస్తే అందరూ కలిసి ఉద్యమించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. క్యాలెండర్‌ను తేదీలు మారేదిగా కాకుండా.. పోరాటాలు చేసేలా విధంగా ఉపయోగించాలన్నారు. మే 1 కార్మిక దినోత్సవం వరకు ప్రభుత్వం తమహామీలు అమలు చేసేలా 15 రోజులకో కార్యక్రమాన్ని రూపకల్పన చేసుకొని ఉద్యమించాలని సూచించారు.

రైతులపై కేటీఆర్‌ది మొసలి కన్నీరు

» దృష్టి మళ్లించేందుకే రోజుకో షో: ఆది శ్రీనివాస్

» ఈటల.. కేటీఆర్‌పై మాట్లాడరా?: చనగాని

» భగవత్‌పై కేసులు పెట్టాల్సిందే: వీహెచ్

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు సంబంధించి హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు చెబుతుంటే.. దీక్షల పేరుతో రైతుల పట్ల కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. పదేళ్ల అధికారంలో ఉండి.. రైతుల్ని పట్టించుకోలేదన్నారు. ఫార్ములా ఈ రేసు కేసు లొట్టపీసు కేసన్న కేటీఆర్.. సుప్రీంకోర్టులో కేసు వెనక్కు తీసుకున్నారంటేనే ప్రభుత్వం నైతికంగా గెలిచినట్లేనని స్పష్టమవుతోందని చెప్పారు. సోమవారం సీఎల్పీ మీడియా హాల్లో మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో రోజుకో రైతు ఆత్మహత్య చేసుకున్నారని, 2014 నుంచి 2020 మధ్య కాలంలో దేశంలో కెల్లా అత్యధికంగా 6,121 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే కేటీఆర్ రోజుకో షో చేస్తున్నాడని విమర్శించారు. రామచంద్రు నాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రైతు ఆత్మహత్యలపై కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. కేటీఆర్ అవినీతిపై ఎందుకు మాట్లాడట్లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. ప్రభుత్వంపై అర్థం లేని ఆరోపణలు చేయడం ఈటల స్థాయికి తగదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని తక్కువ చేసి మాట్లాడిన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌పై, అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షాపై కేసులు పెట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రూ.1.63 లక్షల కోట్లు ఇప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

వినతిపత్రాన్ని ఇచ్చారు. హైదరాబాద్ చుట్టూ చేపడుతున్న రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు 2016లో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని కిషన్‌రెడ్డికి గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లని.. దీని భూసేకరణ కోసం 50 శాతం మేర ఖర్చును భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఔటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగు రోడ్డు వరకూ అభివృద్ధి చేయాలనుకుంటున్న 10 గ్రీన్ ఫీల్డ్ (కొత్త) రేడియల్ రోడ్లకు రూ.45,000 కోట్లు అవసరమని, వీటిని మంజూరు చేయించాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ కింద 76.4 కిలోమీటర్ల మేర కొత్త కారిడార్లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని, ఇందుకుగాను రూ.24,269 కోట్లు కావాలని విజ్ఞప్తి చేశారు. మూసీ నది తీరాభివృద్ధి ప్రాజెక్టు కింద.. మూసీ నది పునరుజ్జీవ చర్యలు, బాపుఘాట్ వద్ద గాంధీ సరోవర్ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఈ ప్రాజెక్టుకు రూ.14,100 కోట్లు అవసరమని తెలిపారు. గోదావరి నుంచి 5 టీఎంసీల నీటిని మళ్లించి మూసీ నదిని శుద్ధి చేయాలని నిర్ణయించామని, దీనికి రూ.7,440 కోట్లు కావాలని వివరించారు. హైదరాబాద్ మహా నగరంలో 7,444 కిలోమీటర్ల పొడవునా సీవరేజ్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించామని, ఈ ప్రాజెక్టు వ్యయం రూ.17,212.69 కోట్లు అని తెలిపారు. వరంగల్ నగరంలో భూగర్భ మురికినీటి వ్యవస్థను అభివృద్ధి చేయడానికి రూ.4,170 కోట్లతో ప్రణాళికను రూపొందించామన్నారు. బందరు పోర్ట్ నుంచి హైదరాబాద్ డ్రై పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలని ప్రతిపాదించామని.. దానికి అవసరమైన రూ.17,000 కోట్లను ఇప్పించాలని కోరారు. రాష్ట్రంలోని గోదావరి లోయ బొగ్గు బ్లాక్‌లను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించాలన్నారు. ఇలా అన్ని ప్రాజెక్టులకూ కలిపి మొత్తం రూ.1,63,559.31 కోట్లు అవసరమని.. ఈ నిధులను కేంద్రం నుంచి మంజూరు చేయించాలని కిషన్‌రెడ్డిని కోరారు. అలాగే.. సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అన్నిరకాల అనుకూలతలూ హైదరాబాద్‌కు ఉన్నాయని.. కాబట్టి, హైదరాబాద్‌ను కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇండియా సెమీకండక్టర్ మిషన్'లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

ఒక్క రైతూ నష్టపోకూడదు

- రైతుభరోసా సర్వేపై వ్యవసాయాధికారులతో తుమ్మల

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా సర్వే పకడ్బందీగా చేయాలని.. ఏ ఒక్క రైతూ నష్టపోకూడదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. సాగుకు అనువుగాని భూములను గుర్తించి, మంగళవారం నుంచి జరిగే గ్రామసభల్లో ఆ భూముల వివరాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. సోమవారం ఆయన వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కలిసి అన్ని జిల్లాల వ్యవసాయాధికారులతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా.. రైతుభరోసా పథకం అమలుకోసం చేపట్టిన సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. 26వ తేదీ నుంచి పథకాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో.. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, ఈ క్రమంలో సాంకేతిక సమస్యలేవైనా ఎదురైతే వెంటనే తమకు తెలియజేయాలని సెక్రటరీ రఘునందన్ సూచించారు. అలాగే, మార్కెటింగ్ శాఖ ద్వారా చేపట్టిన వివిధ పనుల పురోగతిపై సోమవారం ఆయన రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్కెట్లవారీగా పనుల పురోగతి, పత్తి, మిర్చి పంటల కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ విభాగంలో చేపట్టిన పనుల పురోగతి అంత ఆశాజనకంగా లేదని, ప్రతి నెలకోకసారి పనుల పురోగతిని సమీక్షించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

'స్థానికత'పై సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం

- స్టే మంజూరుకు ధర్మాసనం నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎంబీబీఎస్ కోర్సు చదివిన వారిని మెడికల్ పీజీ సీట్ల భర్తీలో స్థానికులుగా పరిగణించాలన్న హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిని విచారణకు స్వీకరించిన ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వడానికి మాత్రం నిరాకరించింది. ఎటువంటి వాదనలు వినకుండా స్టే ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. తెలంగాణ మెడికల్ కాలేజీల(పీజీ), పీజీ (ఆయుష్) కోర్సుల నిబంధనలు 2021ను సవరిస్తూ గతేడాది అక్టోబర్ 28న రాష్ట్ర ప్రభుత్వం జీఓలు 148, 149 జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు.. తెలంగాణలో ఎంబీబీఎస్ కోర్సు చదివిన వారిని మెడికల్ పీజీ సీట్ల భర్తీలో స్థానికులుగా పరిగణించాలని తేల్చిచెప్పింది. తెలంగాణ వెలుపల ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులకు రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం 'స్థానికత' వర్తింపజేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును డిసెంబర్ 18న తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. హైకోర్టు వివరణాత్మక తీర్పు ఇచ్చిందని, మెరిట్స్‌లోకి వెళ్లకుండా స్టే ఇవ్వడం సరికాదని అభిప్రాయపడింది. తదుపరి విచారణను 29కి వాయిదా వేసింది.

'తిరుపతి' బాధితులకు చెక్కుల అందజేత

నిజాంపేట్, సరూర్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో గాయపడిన కృష్ణారెడ్డి, బుచ్చమ్మను టీటీడీ సభ్యులు పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి టీటీడీ తరపున రూ.2లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా నిజాంపేట్, బండారి లే-అవుట్‌లో నివాసం ఉంటున్న సావిత్రి, సాంబశివరెడ్డిలకు చెరో రూ. 2 లక్షల చెక్కులను ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భవిష్యత్‌లో ఇటువంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాలల ఒత్తిడికి తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం

- కమిటీల పేరుతో వర్గీకరణపై జాప్యం: మంద కృష్ణ మాదిగ

వడ్డెపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, మాలల ఒత్తిడికి తలొగ్గిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం వేల గొంతులు.. లక్ష డప్పుల సన్నాహక కార్యక్రమాన్ని హనుమకొండలో మంద కృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం తమ వైపు ఉందని అన్నారు. రెడ్ల కాంగ్రెస్‌ను మాల ఎమ్మెల్యేలు శాసిస్తున్నారని పేర్కొన్నారు. మాదిగల ధర్మ పోరాటానికి సబ్బండ వర్గాలు సంఘీభావం తెలుపుతున్నాయని పేర్కొన్నారు. కేవలం వర్గీకరణను వివేక్ వెంకటస్వామి కుటుంబమే అడ్డుకుంటున్నదని దుయ్యబట్టారు. మాలల ఒత్తిడి తలొగ్గితే మాదిగల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికావలసి వస్తుందని హెచ్చరించారు.

గ్రామసభలు నేటి నుంచి

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీల్లో కార్యదర్శుల సమక్షంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోల సహకారంతో సర్వే నిర్వహించారు. నాలుగు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో ప్రజల ముందు వెల్లడిస్తారు. అక్కడ వచ్చే అభ్యంతరాలు, అభ్యర్థనలను ఆధారంగా చేసుకొని తుది అర్హుల జాబితాను సిద్ధంచేయనున్నారు. సాగుకు యోగ్యమైన భూమికి ఎకరాకు ఏడాదికి రైతుభరోసా కింద రూ.12వేలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని ఉపాధి కూలీలకు ఏటా రూ.12వేలు రెండు విడతల్లో అందించనున్నారు. నిరుడు కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీ పనులు చేసిన వారికే ఇందిరమ్మ భరోసా పథకం వర్తించనుంది. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందనున్నాయి. ప్రజాపాలన, కులగణన సర్వేతోపాటు 2014నుంచి ఇప్పటివరకు కొత్తరేషన్ కార్డులకోసం మీసేవ ద్వారా సమర్పించిన దరఖాస్తులను సాంకేతిక సమాచారం ద్వారా అర్హులను గుర్తించారు. వాటి ఆధారంగా ఆ కుటుంబాల వద్దకువెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. గ్రామ, వార్డు సభల్లో ఆమోదం తర్వాత కొత్తకార్డుల జారీకి చర్యలు చేపట్టనున్నారు. ఇదిలాఉండగా.. సర్వేలో పేర్లు రానివారు తిరిగి గ్రామసభల్లో దరఖాస్తులు సమర్పించొచ్చునని అధికారులు చెబుతున్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని ప్రజలకు వారు భరోసా కల్పిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారంభం

నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో మంత్రి దామోదర చర్చలు సఫలం

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పది రోజులుగా నిలిచిపోయిన రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు సోమవారం రాత్రి పునఃప్రారంభమయ్యాయి. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులతో సర్కారు జరిపిన చర్చలు సఫలం కావడంతో.. సేవలను యథావిధిగా కొనసాగించనున్నట్లు ఆస్పత్రులు ప్రకటించాయి. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం ప్రతినిధులతో సోమవారం చర్చలు జరిపారు. ప్రతినెలా విధిగా ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులను చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, ఐదారు నెలల్లో బకాయిలను పూర్తిగా చెల్లిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఇక ప్రైవేటు ఆస్పత్రుల ఎంప్యానెల్ ఎంవోయూ, ప్యాకేజీ ధరల పెంపునకు సంబంధించిన సమస్యలపై ఒక కమిటీ వేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఇతర సమస్యలపై చర్చించేందుకు ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్యశ్రీ సీఈవోతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాగా, దంత వైద్యశాలలకు సంబంధించి 18 నెలల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు మంత్రి దృష్టికి తీసుకువచ్చాయి. దీంతో వాటిని కూడా వీలైనంత త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. మంత్రితో చర్చల అనంతరం తెలంగాణ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిల చెల్లింపుపై మంత్రి దామోదర స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. రానున్న 4-5 నెలల్లో బకాయిలు చెల్లిస్తామని చెప్పారని, నెలవారీగా బిల్లులు చెల్లిస్తామన్నారని వెల్లడించారు. మంత్రి హామీతో సోమవారం రాత్రి పది గంటల నుంచే ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలను యథావిధిగా అందిస్తామని నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ తెలిపారు. వైద్యశాఖ మంత్రి స్వయంగా తమతో చర్చలు జరపడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున రూ.50 కోట్ల వరకు విడుదల చేయగా, ప్రస్తుతం నెలకు రూ.100 కోట్ల వరకు ఇస్తున్నారని, ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకొంటున్నామని చెప్పారు.

మళ్లీ జన్మంటూ ఉంటే... తెలుగువాడిగానే పుడతా

- 2047 నాటికి నం.1గా తెలుగుజాతి
- జ్యూరిక్‌లో పారిశ్రామికవేత్తల భేటీలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్య
- రాష్ట్ర పునర్నిర్మాణానికి కలిసిరావాలని ప్రవాసాంధ్రులకు నారా లోకేశ్ పిలుపు


జ్యూరిక్ విమానాశ్రయంలో ముచ్చటిస్తున్న చంద్రబాబు, రేవంత్

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగుజాతిలోనే పుట్టాలని భగవంతుడిని కోరుకుంటున్నానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావో‌స్‌కు వెళ్తూ.. మధ్యలో జ్యూరిక్‌లో తెలుగు పారిశ్రామికవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1990ల్లో యూరోప్‌లో తెలుగువారు ఎక్కువగా ఉండేవారు కాదని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు 12 దేశాల్లో తెలుగువారు ఉన్నారని.. వారికి అక్కడ బోలెడు అవకాశాలున్నాయని పేర్కొన్నారు. గతంలో అన్ని దేశాల్లో యూదులు ఉండేవారని.. ఇప్పుడు వారి స్థానాన్ని భారతీయులు ఆక్రమిస్తున్నారని వ్యాఖ్యానించారు. "ఏ దేశంలోనైనా కూర్చొని ఏపీని అభివృద్ధి చేయండి. కర్మ భూమికి సహకరించాలి. అయితే, జన్మభూమిని మరిచిపోకండి." అని పిలుపునిచ్చారు. సంపదను సృష్టించడం కష్టం కాదన్న ఆయన.. 2047 నాటికి చాలా శక్తివంతమైన జాతిగా తెలుగువారు ఉండాలనేది తన సంకల్పమన్నారు. 2004లో వచ్చిన పాలకులు తాను నిర్మించిన సైబరాబాద్‌ను కూల్చలేదని.. 2019లో నవ్యాంధ్రలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మాత్రం ప్రజావేదికను కూల్చేసిందని, పోలవరాన్ని ధ్వంసం చేసిందని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పుడు తాను వాటన్నింటినీ సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నానని.. ఏపీని వర్క్ ఫ్రమ్ హోమ్ హబ్‌గా చేయాలన్నదే తన కోరిక అని తెలిపారు. ఇంటికొకరు ఏఐ నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాగా.. జ్యూరిక్‌లో సీఎం చంద్రబాబు రోజంతా బిజీగా గడిపారు. పలువురు పెట్టుబడిదారులతో ఆయన సమావేశమయ్యారు. అలాగే.. జ్యూరిక్ ఎయిర్‌పోర్టు నిర్మాణ సంస్థ ప్రతినిధులు విమానాశ్రయంలో చంద్రబాబును కలిశారు. ప్రపంచంలో తొమ్మిదికిపైగా అతిపెద్ద విమానాశ్రయాలను ఈ సంస్థే నిర్మించింది. ఈ నేపథ్యంలో.. జ్యూరిక్ తరహా విమానాశ్రయాన్ని ఏపీలో నిర్మించాలంటూ వారిని చంద్రబాబు కోరారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, అనుసరిస్తున్న పాలసీల గురించి వివరించారు. చంద్రబాబు ప్రతిపాదనలపై సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జ్యూరిక్ ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా సీఎం చంద్రబాబును కలిశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్,టీజీ భరత్, తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వారి వెంట ఉన్నారు.

పెట్టుబడులు పెట్టండి..

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని.. మాన్యుఫాక్చరింగ్, ఆర్‌అండ్‌డీ కేంద్రాలు, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ముఖ్యమైన పరికరాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ స్విస్ పారిశ్రామికవేత్తలను కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ రంగాల్లో అధునాతన ఆవిష్కరణల కోసం ఏపీ విశ్వవిద్యాలయాలతో కలిసి స్విస్ పరిశోధన సంస్థలు పనిచేయాలని ఆహ్వానించారు.. స్విస్ వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ మోడల్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం జ్యూరిక్‌లో స్విస్ పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. ఏపీలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాల గురించి లోకేశ్ వారికి వివరించారు. అలాగే.. జ్యూరిక్‌లో లోకేశ్‌తో స్టోన్ క్రాఫ్ట్ గ్రూపు స్ట్రాటజిక్ గ్లోబల్ అడ్వయిజర్ ఫణి శ్రీపాద, సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు.

జ్యూరికా.. జువ్వలపాలెమా?

జ్యూరిక్‌లో తెలుగువారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న లోకేశ్.. ఏపీ ఆర్థిక వ్యవస్థలో ప్రవాసాంధ్రులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. "ఇక్కడి పరిస్థితులను చూస్తుంటే జ్యూరిక్‌లో ఉన్నానా లేక జువ్వలపాలెంలో ఉన్నానా అన్న సందేహం కలుగుతోంది. జ్యూరిచ్‌లో ఇంతమంది తెలుగువారిని ఒకే చోట కలవడం చాలా ఆనందంగా ఉంది" అని హర్షం వెలిబుచ్చారు. ఎన్నికల సమయంలో ప్రవాసాంధ్రులు సెలవులు పెట్టి మరీ ఏపీకి వచ్చి కూటమి విజయానికి కృషి చేశారని కొనియాడిన లోకేశ్.. అదే స్ఫూర్తితో రాష్ట్ర పునర్నిర్మాణానికి కలిసి రావాలని, ఐదేళ్లలో ప్రపంచానికి ఏపీ అంటే ఏమిటో చూపిద్దామని పిలుపునిచ్చారు. "ప్రవాసాంధ్రులకు సహాయ సహకారాలు అందించేందుకు ఏపీ ప్రభుత్వం, టీడీపీ సంయుక్తంగా ఎక్స్‌పోర్టు, ఇంపోర్టు సెల్‌ను ఏర్పాటు చేయబోతున్నాయి. యూరప్‌లో అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన వనరులను ఇది అందుబాటులోకి తెస్తుంది"అని పేర్కొన్నారు.

దావోస్‌లో బాబు, రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

జ్యూరిక్ విమానాశ్రయానికి చేరుకోవడంతో.. ఇద్దరు సీఎంలు అక్కడే కొద్దిసేపు భేటీ అయ్యారు. వీరితోపాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు, ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై ఇరువురు సీఎంల మధ్య చర్చ జరిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం రాత్రి 'ఎక్స్'లో పేర్కొంది. కాగా, ఈ నెల 24 వరకు జరగనున్న ఈ సమావేశాల్లో వివిధ దేశాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభుత్వ అధినేతలు, పారిశ్రామిక దిగ్గజాలు పాల్గొంటున్నారు. తొలిరోజు గ్రాండ్ ఇండియా పెవిలియన్ ఘనంగా ప్రారంభమైంది. సీఎం రేవంత్‌తోపాటు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ ఆవిష్కరణలకు గ్లోబల్ హబ్ భారత్

- అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి: డబ్ల్యూఈఎఫ్

దావోస్, జనవరి 20: ఈ సాంకేతిక యుగంలో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా, స్టార్టప్‌లు, డిజిటల్ ఆవిష్కరణలకు గ్లోబల్ హబ్‌గా ముందంజలో ఉందని ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) పేర్కొంది. భారత్‌తో తమ భాగస్వామ్యం 40 ఏళ్లకు పైగా నాటిదని తెలిపింది. సోమవారం దావోస్‌లో సదస్సు ప్రారంభం నేపథ్యంలో భారత్‌లోని సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ (సీ4ఐఆర్), డబ్ల్యూఈఎఫ్ అనుసంధాన కార్యాలయం గత ఆరేళ్ల ప్రయాణానికి సంబంధించిన నివేదికను విడుదల చేశాయి. నాలుగు దశాబ్దాలకు పైగా కాలంలో భారత్‌తో తమ అనుబంధం బలపడిందని డబ్ల్యూఈఎఫ్ వెల్లడించింది. కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, కీలక పారిశ్రామికవేత్తలు, నిపుణుల చొరవతో సంయుక్తంగా అనేక రకాల కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొంది. నేడు సీ4ఐఆర్ అనేది కేవలం ఆవిష్కరణలకు కేంద్రం మాత్రమే కాదు తమ ప్రధాన కార్యక్రమని తెలిపింది. సీ4ఐఆర్ తర్వాతి దశలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఇప్పటివరకు అధిగమించిన కీలక మైలురాళ్లను నివేదికలో వివరించింది.

సిగ్గుండాలె..దుర్మార్గపు మాటలొద్దు

- మీ హయాంలో చేసింది శూన్యం
- బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్ ఫైర్



హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అర్హత ఉన్న వారందరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. కొత్త రేషన్‌కార్డుల జారీ, పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేరికపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. 'దుర్మార్గపు మాటలు మాట్లాడొద్దు. పదేళ్లలో మీరు 40 వేల మందికే కార్డులిచ్చారు. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులుంటే అందులో సభ్యులు 2.81 కోట్ల మంది ఉన్నారు. కొత్తగా రేషన్ కార్డుల జారీ, పాత కార్డుల్లో సభ్యుల చేరికతో రాష్ట్రంలో 40లక్షల మందికి మేలు జరుగుతుందని భావిస్తున్నాం. దీనివల్ల ఏటా రూ.11వేల కోట్ల భారం పడే అవకాశం ఉన్నా ఈ నిర్ణయం తీసుకున్నాం" అని ప్రకటించారు. సచివాలయంలో మంత్రి పొన్నంతో కలిసి ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. 26వ తేదీన రేషన్ కార్డుల జారీ ఉంటుందని, అర్హులందరికీ కార్డులు ఇచ్చే దాకా నిరంతరంగా ఇది కొనసాగుతుందని పేర్కొన్నారు. దేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్) ద్వారా సన్న బియ్యం ఇచ్చే రాష్ట్రంగా తెలంగాణ నిలవనుందని ఉత్తమ్ చెప్పారు. సమాజానికి, రాష్ట్రానికి మంచి జరిగే కార్యక్రమం చేపడితే పిచ్చి పిచ్చి విమర్శలేంటని, అసలు మీకు సిగ్గుందా అని ఉత్తమ్ మండిపడ్డారు. రేషన్ కార్డుల వివరాల పరిశీలనకు సామాజిక ఆర్థిక సర్వే ఆధారంగా వివరాలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కొత్తగా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో, గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. కాగా, కృష్ణా జలాలను రాష్ట్రాల వారీగా పంచాలని తీర్పు వస్తే... అందులో కూడా వారి పాత్ర ఉందని ప్రచారం చేసుకుంటున్నారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల కృష్ణా జలాలు బచావత్ ట్రైబ్యునల్ కేటాయిస్తే... రాష్ట్ర అవతరణ అనంతరం 2015లో తమకు 299 టీఎంసీలు చాలని అంగీకారం తెలుపుతూ కేసీఆర్, హరీశ్‌రావు సంతకాలు చేయలేదా...? అని ప్రశ్నించారు.

దావోస్‌లో చలి పులి!

- నాడు ఆర్థికసదస్సులకు వెళ్లని జగన్
- 2014-19 మధ్య ఏటా వెళ్లిన బాబు
- జగన్ అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"మీకు తెలుసా!? ఈ సమయంలో దావోస్‌లో మైనస్ 5, మైనస్ 10 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. అంత చలి ఉంటే స్నానం చేస్తామా?"... జగన్ హయాంలో ఏపీ పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గుడివాడ అమర్‌నాథ్ అన్న మాటలివి. 'మీరు దావోస్ ఆర్థిక సదస్సులో ఎందుకు పాల్గొనడం లేదు' అనే ప్రశ్నకు ఆయన చెప్పిన సమాధానమిది. దావోస్‌లో ఏటా ప్రపంచ ఆర్థిక సదస్సు జరిగే విషయం తెలిసిందే. పెట్టుబడులను ఆకర్షించేందుకు.. 'బ్రాండ్ ప్రమోషన్‌కు ఇదో అద్భుతమైన వేదిక! 'మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి' అని ఒక్కో దేశానికీ తిరగాల్సిన అవసరం లేకుండా.. ప్రపంచ దేశాలకు చెందిన దిగ్గజ సంస్థల అధిపతులు, వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధులంతా అక్కడ అందుబాటులో ఉంటారు. వారికి మన పారిశ్రామిక విధానాలను వివరించేందుకు అదో చక్కటి అవకాశం! అందుకే... పెట్టుబడుల వేటలో ఉన్న వారు ఈ సదస్సుకు తప్పనిసరిగా హాజరవుతారు. గుడివాడ అమర్‌నాథ్ అక్కడి చలి గురించి ఒక సాకుగా చెప్పినప్పటికీ.. ఈ సమయంలో అక్కడ చలి విపరీతంగా ఉండేమాట నిజమే. కానీ చలికి భయపడి ఆగిపోతే.. రాష్ట్రాన్ని ప్రమోట్ చేసుకునే అవకాశాన్ని కోల్పోయినట్టే. అందుకే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆ చలిని సైతం లెక్కచేయక దావోస్‌కు వెళ్తుంటారు. 2014-19 మధ్యకాలంలో చంద్రబాబు కూడా క్రమం తప్పకుండా దావోస్ పర్యటనకు వెళ్లారు. ఆ తర్వాత జగన్ అధికారంలోకి వచ్చాక అంతా మారిపోయింది. ఆయన ఒకే ఒకసారి దావోస్ సదస్సుకు హాజరయ్యారు. ఈ ఏడాది కూడా.. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు ఏపీ, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల సీఎంలు, మంత్రులు హాజరయ్యారు. వారిలో నారా లోకేశ్ సహా అంతా చలిని తట్టుకునే జాకెట్లు వేసుకున్నారు. 74ఏళ్ల వయసున్న చంద్రబాబు మాత్రం ఏపీలో ఎప్పుడూ ఎలా కనిపిస్తారో దావోస్‌లోనూ అదే ఆహార్యంతో కనిపించడం విశేషం.

వికసించిన భారతీయత

రాజకీయాలను పక్కనపెట్టి పెవిలియన్ల ఏర్పాటు

దావోస్, జనవరి 20: వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సులో భారతీయత వెల్లివిరిసింది. కేంద్రం, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు రాజకీయాలను పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేస్తున్నాయి. పక్కపక్కనే పెవిలియన్లు ఏర్పాటు చేశాయి. ప్రఖ్యాత ప్రొమనేడ్ వీధిలో దగ్గరగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం రెండు పెవిలియన్లను ఏర్పాటు చేసింది. మొదటి పెవిలియన్‌లో తెలంగాణ, కేరళ, ఉత్తరప్రదేశ్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, రెండో దాంట్లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక సమావేశాలు ఏర్పాటు చేశాయి. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు, సీఐఐ సంస్థలు కూడా పెవిలియన్లు ఏర్పాటు చేశాయి. కేంద్ర మంత్రులకు స్విట్జర్లాండ్‌లో భారత్ రాయబారి జ్యూరిచ్‌లో స్వాగతం పలికారు. టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రతో పాటు పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో ఈ పెవిలియన్లు కళకళలాడుతున్నాయి.

రివెంజ్ పాలిటిక్స్ ఎవరికీ మంచిది కాదు

అలాంటి రాజకీయాలు చేసినోళ్లు.. అధికారం పోయాక బాధపడతారు

- రాష్ట్ర ప్రజల రక్తంలో కక్ష సాధింపు లేదు
- అలాంటి రాజకీయాలకు నేను వ్యతిరేకం
- నాకు నష్టం చేసినా తిరిగి నష్టం చేయను
- రాజకీయంగా మాత్రం పోరాడతాను
- చంద్రబాబు, వైఎస్, రోశయ్య, కిరణ్.. కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడలేదు
- దేనికోసం పోరాడి అధికారంలోకి వచ్చామో దాన్ని అమలు చేయాలి: జగ్గారెడ్డి
- నాతో సహా పైసలు ముట్టుకోని రాజకీయ నేత.. ఏ పార్టీలోనైనా ఉన్నాడా? అని ప్రశ్న

హైదరాబాద్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కక్ష సాధింపు రాజకీయాలు ఏ పార్టీకీ మంచిది కాదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజల రక్తంలో కక్ష సాధింపు గుణం ఉండదని చెప్పారు. కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడిన వాళ్లు అధికారం కోల్పోయాక బాధపడాల్సి వస్తుందని అభిప్రాయ పడ్డారు. ఉమ్మడి రాష్ట్రానికి సీఎంలుగా చేసిన చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు చేయలేదని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను కక్ష సాధింపు రాజకీయాలకు వ్యతిరేకమని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తనకు ఎవరైనా నష్టం చేస్తే.. తిరిగి వారికి నష్టం చేసే గుణం తనకు లేదన్నారు. కానీ వారితో రాజకీయంగా యుద్ధం మాత్రం చేస్తానని పేర్కొన్నారు. యుద్ధం వేరు.. కక్ష సాధింపు వేరని ఆయన చెప్పారు. అధికారం అనేది ఏ రాజకీయ పార్టీకీ శాశ్వతం కాదని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతీకార రాజకీయాలు చేస్తే ఆ తర్వాత పశ్చాత్తాపం పడాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పోరాటం వేరు.. పాలన వేరని అభిప్రాయపడ్డారు. దేనికోసం పోరాటం చేసి అధికారంలోకి వచ్చామో దానిని అమలు చేయాలని సూచించారు. తనతో సహా ఏ పార్టీకి చెందిన నాయకుడైనా.. పైసలు ముట్టుకోకుండా రాజకీయం చేయగలుగుతాడని ఎవరైనా చెప్పగలరా అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.

సంగారెడ్డిలో నా ఓటమికి హరీశ్ కసిగా పనిచేశారు

సంగారెడ్డిలో తన ఓటమికి కారణం హరీశ్‌రావేనని జగ్గారెడ్డి వెల్లడించారు. సిద్దిపేటలో గెలవడానికి హరీశ్ ఎంత కష్ట పడ్డారో.. సంగారెడ్డిలో తనను ఓడగొట్టడానికి కూడా అంతే కష్టపడ్డారని చెప్పారు. ప్రతి సారీ ఎన్నికలకు మూడు రోజుల ముందు.. సంగారెడ్డిలో తాను నిర్వహించే సభను.. గత ఎన్నికల ముందు నిర్వహించకుండా హరీశ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారని చెప్పారు. సంగారెడ్డిని గెలిచి తన మామ కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలని హరీశ్ అనుకున్నారని, అందుకే అయన కసిగా పనిచేశారని వెల్లడించారు. అయితే తనను ఎన్ని ఇబ్బందులు పెట్టినా అధికారం ఉంది కదా అని కక్ష సాధింపు చర్యలు చేపట్టబోనని, రాజకీయంగానే కొట్లాడతానని చెప్పారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యేనే



ఫస్ట్ ప్రోటోకాల్ అని చెప్పారు. అధికార పార్టీ అయినా సరే.. కార్పొరేషన్ ఛైర్మన్‌గా తన భార్య నిర్మలది ప్రోటోకాల్‌లో ఆ తర్వాతి స్థానమేనని అన్నారు.

ఎన్టీఆర్ ఘాట్‌కు మరమ్మతులు

» పనులు చేపట్టాలని హెచ్ఎండీఏ కమిషనర్ ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, జనవరి20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌ను పరిశీలించి మరమ్మతులు వెంటనే చేపట్టాలంటూ హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సోమవారం అధికారులకు ఆదేశాలిచ్చారు. 25 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ ఘాట్ నిర్మితమైనప్పటి నుంచి నిర్వహణ బాధ్యతలను హెచ్ఎండీఏ చూసుకుంటోంది. జయంతులు, వర్ధంతుల సందర్భంగా పూలతో అలంకరణ ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నిర్వహణలో లోపాలు కనిపించాయి. దీంతో ఏపీ మంత్రి నారా లోకేశ్‌తోపాటు.. ఎన్టీఆర్ కుటుంబీకులు, ప్రముఖులు, అభిమానులు అసంతృప్తి వ్యక్తంచేశారు. లోకేశ్ తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్.. ఎన్టీఆర్ ఘాట్‌కు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

317 జీవో స్పౌజ్ బాధితుల్లో 834 మంది బదిలీ

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవో 317 బాధితులను తిరిగి వారి సొంత జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీచేశారు. ఈ అంశంపై ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం సూచనల మేరకు తాజా నిర్ణయం తీసుకున్నారు. తమకు న్యాయం చేయాలని దరఖాస్తు చేసుకున్న 317 జీవో బాధితుల వివరాలను అధికారులు పరిశీలించారు. సుమారు 834 మంది స్పౌజ్ ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేశారు.

బస్సుల మార్పుతో డ్రైవర్లు రోడ్డుపాలు

» ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్

డీజిల్ బస్సులను విద్యుత్(ఈవీ) బస్సులుగా మార్చాలనే ఆర్టీసీ యాజమాన్యం విధానాన్ని టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఖండించింది. ఈమేరకు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 డిసెంబరు నాటికి హైదరాబాద్ నగరంలో 2,800 సాధారణ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులు తెస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో నడుస్తున్న డీజిల్ బస్సుల్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న వేలాది మంది డ్రైవర్ల ఉద్యోగాలు పోగొట్టి రోడ్డుపాలు చేసే ఈ ప్రతిపాదనను ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

క్షేమంగానే దామోదర్?

» ఒడిసా సరిహద్దుల్లో.. ఇద్దరు నక్సల్స్ కాల్చివేత

చర్ల/ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని మారేడుబాక అడవుల్లో ఈ నెల 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే దామోదర్ అలియాస్ చొక్కారావు క్షేమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన మృతిచెందినట్లు దక్షిణ బస్తర్ కమిటీ కార్యదర్శి గంగా పేరుతో లేఖ విడుదలైనా.. పోలీసులు, ఇంటెలిజెన్స్ వర్గాలు మాత్రం ధ్రువీకరించలేదు. అయితే.. గంగా పేరిట లేఖ పంపిందెవరనేది ఇప్పటికీ మిస్టరీగా ఉంది. కాగా.. ఛత్తీస్‌గఢ్-ఒడిసా సరిహద్దుల్లో సోమవారం ఉదయం పోలీసులు-నక్సల్స్‌కు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఓ జవాన్ గాయపడ్డట్లు తెలిసింది.

ఎమ్మెల్సీల నియామకంపై.. ఫిబ్రవరి 12న తుది వాదనలు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి ఫిబ్రవరి 12న తుది వాదనలు వింటామని సుప్రీంకోర్టు మరోమారు స్పష్టం చేసింది. కేసీఆర్ సర్కారు హయాంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా.. అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. దీంతో.. శ్రవణ్, సత్యనారాయణ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు గత ఏడాది జనవరి 13న కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్ పేర్లను ప్రభుత్వం ప్రతిపాదించగా.. గవర్నర్ ఆమోదించడం.. దీనిపై శ్రవణ్, సత్యనారాయణ మరోమారు హైకోర్టును ఆశ్రయించడం.. కోర్టు ఆ నియామకాలను రద్దుచేయడం తెలిసిందే.! ఆ తర్వాత ప్రభుత్వం మరోమారు కోదండరాం, ఆమిర్ అలీఖాన్ పేర్లను పంపంగా.. గవర్నర్ ఆమోదించడంతో వారిద్దరూ ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ గత ఏడాది ఆగస్టు 4న శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ గవర్నర్ కార్యాలయం సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఈ రెండు పిటిషన్లపై తుది వాదనలను ఫిబ్రవరి 12న వింటామని స్పష్టం చేసింది.

48 రోజుల్లో రూ. 4.17కోట్ల ఆదాయం

» యాదగిరీశుడి హుండీ కానుకల లెక్కింపు

భువనగిరి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయ ఖజానాకు 48 రోజుల్లో రూ.4.17కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. గత ఏడాది డిసెంబరు 3 నుంచి ఈ నెల 19వ తేదీవరకు నృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన మొక్కు కానుకలను సోమవారం లెక్కించారు. కానుకల్లో మిశ్రమ బంగారం, వెండి, అమెరికా డాలర్లు కూడా ఉన్నట్లు ఈవో తెలిపారు.



దేవతావాహనంతో పట్నం, అగ్నిగుండాలు దాటుతున్న భక్తులు

కొమురవెల్లి మల్లన్న ఆలయం.. బండారుమయం!

చేర్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్నకు పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలను ఘనంగా నిర్వహించారు. దేవదేవుడి ఆవాహనంతో షైమరిచిన శివసత్తులు, పోతరాజులు, భక్తులు పెద్దపట్నం ఎక్కి అగ్నిగుండాలు దాటారు. పట్నం రచించిన అనంతరం పోలీసుల బందోబస్తు నడుమ ఆలయ అర్చకులు గర్భాలయం నుండి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి ఆవాహనం చేశారు. పసుపుతో ఆలయ పరిసరాలన్నీ బండారుమయమయ్యాయి.

'సిరిసిల్ల'కు 4.24 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లు

» ఆర్డర్ కాపీని అందించిన టెస్కో జీఎం

సిరిసిల్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందిరా మహిళ శక్తి చీరల పథకంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే చీరల ఆర్డర్లను సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు అందించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో 63 లక్షల మంది మహిళలు ఉండగా.. వీరికి రెండు చీరల చొప్పున 1.30 కోట్ల చీరలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. చీరల డిజైన్లను కూడా పరిశీలించి ఆమోదం తెలిపారు. 1.30 కోట్ల చీరలకు రూ.650 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. చీరల ఉత్పత్తిని సిరిసిల్ల మరమగ్గాలపైనే చేపట్టే దిశగా ఇక్కడి 129 మ్యాక్స్ సొసైటీలకు మొదటి విడతలో 4.24 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లను అందించారు. మొదటి దశలో రూ.325 కోట్లతో 65 లక్షల చీరలు ఉత్పత్తి చేయనున్నారు. ఇందులో తొమ్మిది మీటర్ల (గోచీ) చీరలు, ఇతర మహిళలు ధరించే బ్లౌజ్‌తో కలిపి 6.30 మీటర్ల చీరలకు సంబంధించిన ఆర్డర్లను సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు ఇచ్చారు. ఈ చీరలను ఏప్రిల్ 30 వరకు ఉత్పత్తి పూర్తి చేసి అందించనున్నారు.

బొగ్గు, గనుల రంగంలో సంస్కరణలు తెచ్చాం

» గనుల వేలానికి రాష్ట్రప్రభుత్వాల మద్దతు అవసరం: కిషన్‌రెడ్డి

» రెండేళ్లలో 32 ఖనిజ బ్లాకుల వేలం.. తెలంగాణలో సమృద్ధిగా నిక్షేపాలు: భట్టి



న్యూఢిల్లీ, హైదరాబాద్, కొత్తగూడెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బొగ్గు, గనుల రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 2015కు ముందు బొగ్గు, గనుల రంగం తీవ్ర సంక్షోభంలో ఉండేదని, గనుల కేటాయింపులో న్యాయపరమైన సమస్యలు ఉండేవని.. ప్రభుత్వానికి ఆదాయం కూడా కూడా అంతంత మాత్రంగానే ఉండేదని ఆయన గుర్తుచేశారు. సోమవారం ఒడిశాలోని కోణార్క్‌లో జరిగిన వివిధ రాష్ట్రాల బొగ్గు, గనుల మంత్రుల జాతీయ సదస్సులో కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. దేశ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో భాగంగా ఎలక్ట్రానిక్ వాహనాలు, క్లీన్ టెక్నాలజీ కోసం లిథియం, కోబాల్ట్, కాపర్ వంటి ఖనిజాలకు డిమాండ్ పెరుగుతోందని.. అందువల్ల బొగ్గు, గనుల రంగంలో ఆత్మ నిర్భరత సాధించడం అత్యంత అవసరమని అన్నారు. దేశ జీడీపీలో బొగ్గు, గనుల రంగం వాటా రెండు శాతమని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో 72 శాతం విద్యుదుత్పత్తి బొగ్గు ద్వారానే జరుగుతోందని.. విద్యుత్ డిమాండ్లకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. 2024లో దేశవ్యాప్తంగా 997 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని, 2014తో పోల్చుకుంటే ఉత్పత్తి ఏకంగా 76 శాతం మేర పెరిగిందని వెల్లడించారు. 2030 నాటికి 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో ఈ లక్ష్యాన్ని చేరుకోగలుగుతామనే నమ్మకం ఉందని కిషన్‌రెడ్డి ఆశాభావం వెలిబుచ్చారు. వేలం వ్యవస్థను తీసుకురావడం వల్ల గనుల రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం వచ్చిందని, ఇప్పటివరకు దాదాపు 442 బ్లాకులకు వేలం జరిగిందని.. ఈ సంస్కరణల కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలకు అదనపు ఆదాయం వస్తోందని ఆయన గుర్తుచేశారు. 2015 నుంచి ఇప్పటివరకు వేలం ప్రీమియం, రాయల్టీ రూపంలో దాదాపు రూ.2.69 లక్షల కోట్లు రాష్ట్రప్రభుత్వాల ఖజానాకు వెళ్లాయని.. 2004-2014 మధ్య కాలంలో ఈ ఆదాయం రూ.55,636 కోట్లు మాత్రమేనని తెలిపారు. గనుల వేలం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు ముఖ్యమన్నారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, లైసెన్స్ జారీ వేగవంతం చేయాలని కోరారు.

రాష్ట్రంలో సమృద్ధిగా..

తెలంగాణలోని 32 ఖనిజ నిక్షేపాల బ్లాక్‌లను వచ్చే రెండేళ్లలో వేలం వేయాలన్న ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు.. ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో లైమ్‌స్టోన్, ఐరన్ ఓర్, మాంగనీసు, క్వార్ట్జ్, గ్రానైట్, రోడ్డు మెటల్, డోలమైట్ తదితర ఖనిజ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. మైనింగ్ రాయల్టీ, సీనరేజీ చార్జీల ద్వారా 2015 నుంచి ఇప్పటివరకు రూ.5,537 కోట్లను వసూలు చేశామన్నారు. ఈ నిధిని ప్రభుత్వ పాఠశాలలతో పాటు పలు ప్రాధాన్య రంగాలకు వినియోగిస్తున్నామని వివరించారు. కాగా, ఒడిసాలోని నైనీ బ్లాకులో మార్చి నుంచి సింగరేణి ఆధ్వర్యంలో బొగ్గు ఉత్పత్తికి శ్రీకారం చుట్టనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అక్కడికి దగ్గర్లో ఉన్న జర్పాడా, తుకుడా, హండప్పా, బనినాలి ప్రాంతాల్లో ఏదో ఒక చోట స్థలం కేటాయిస్తే 1200 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్‌ను నిర్మిస్తామని వెల్లడించారు. ఈ మేరకు ఒడిసా సీఎం మోహన్‌చరణ్ మాంజీకి ఆయన వినతిపత్రం అందజేశారు.

40-50 కిలోమీటర్లకో టోల్‌ప్లాజా

(మొదటి పేజీ తరువాయి)



సలహా సంస్థల(కన్సల్టెంట్లు) ఎంపిక కోసం ప్రభుత్వం ఇటీవల టెండర్లను పిలిచింది. టెండర్ నోటీసులో సలహా సంస్థలకు చేసిన పలు సూచనల ద్వారా ఆర్ఆర్ఆర్ స్వరూపం ఎలా ఉండబోతోందో తెలుస్తోంది. దాని ప్రకారం ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం రహదారి చౌటుప్పల్-ఆమనగల్-సంగారెడ్డి మధ్య 200 కిలోమీటర్ల పొడవున ఉండనుంది. ఇందులో 40 లేదా 50 కిలోమీటర్ల దూరానికి ఒకటి చొప్పున 4 నుంచి 5 టోల్ ప్లాజాలు వస్తాయి. టోల్ ప్లాజాల దగ్గరే రోడ్డుకు ఇరువైపులా ఐదేసి ఎకరాల్లో వాహనదారుల కోసం రెస్ట్‌రూమ్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. వే సైడ్ ఎమినిటీస్‌గా పేర్కొనే ఈ సౌకర్యాల్లో భాగంగా చిన్న వాహనాల పార్కింగ్, పెద్ద వాహనాల పార్కింగ్, విశ్రాంతి గదులు, రెస్టారెంట్లు ఉంటాయి. టోల్‌ప్లాజాలు, వేసైడ్ ఎమినిటీస్ ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో కన్సల్టెంట్లు సూచించాల్సి ఉంటుంది. భవిష్యత్‌లో పెరగబోయే ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని టోల్‌ప్లాజాల ఏర్పాటు ప్రాంతాలను ఖరారు చేస్తారు. చేయాల్సి ఉంటుంది. టోల్ ప్లాజాల దగ్గర ఎక్స్‌ప్రెస్ వే మీదకు వాహనాలు ఎక్కి దిగేందుకు వీలుగా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్ల డిజైన్‌ను కూడా కన్సల్టెంట్లు సూచించాల్సి ఉంటుంది. గ్రామాల నుంచి వచ్చే వాహనాలు క్షేమంగా ఎక్స్‌ప్రెస్ వే మీదకు వచ్చి ట్రాఫిక్‌లో సురక్షితంగా కలిసిపోయే విధంగా సర్వీస్ రోడ్లు డిజైన్ చేయాల్సి ఉంటుంది. కంచె వేయాల్సిన అవసరం ఉన్న ప్రాంతాలను సలహా సంస్థ సూచించాలి. ఆర్ఆర్ఆర్ పొడవునా అండర్ పాస్‌లు, కల్వర్టులు, వంతెనలకు సంబంధించి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అంచనాలు రూపొందించాలి. వీటి విషయంలో చిన్న పొరపాటు జరిగినా తరువాత చాలా ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. రోడ్డు పైకి ఎక్కి దిగే చోట నిర్మించే మేజర్ రోడ్లు, క్రాసింగ్‌ల మధ్య కనీస దూరం ఐదు కిలోమీటర్లు ఉంటుంది. ఇంటర్ ఛేంజ్‌ల ఆకృతులను బట్టి ఎంత భూమి అవసరమవుతుందో అంచనా వేసి సేకరించాల్సిన భూమి వివరాలను కూడా సలహా సంస్థే చెప్పాలి. రహదారి మధ్యలో వచ్చే కొండలు, గుట్టలు, ఇతరత్రా వివరాలను 3డీ రూపంలో ఇవ్వాలి. రహదారి మార్గం(అలైన్‌మెంట్) దగ్గరి నుంచి రోడ్డు నిర్మాణ విధానం సహా పలు అంశాలన్నీ సమగ్ర ప్రాజెక్టు నివేదికలో తేలనున్నాయి. అండర్ పాస్, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, క్రాసింగ్ జంక్షన్ల లెక్క డీపీఆర్‌లోనే తేలుతుంది. రహదారి వెళ్లే మార్గంలో గ్రామాలుంటే ఎన్ని ఇళ్లు తొలగించాలి? వాటిలో ఎంతమంది నివసిస్తున్నారు? చెరువులు, కుంటలు ఎన్ని? సాగు చేసుకుంటున్న భూములు? అటవీభూములు లెక్కలు వేయాలి. సేకరిస్తున్న భూముల వివరాలతో పాటు నిర్మాణ వ్యయ అంచనాలు కూడా పేర్కొంటారు. రహదారిని ఏ పద్ధతిలో నిర్మించాలి, ఏ విధానంలో నిర్మిస్తే లాభదాయకం చర్చిస్తారు. నివేదిక వచ్చాక డీపీఆర్‌ను ఖరారు చేసేది మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే.

రాష్ట్ర ప్రభుత్వమే ఎందుకు?

రాష్ట్రానికి రీజినల్ రింగు రోడ్డు మంజూరైనప్పుడు కేంద్రం దానిని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించింది. ఉత్తరభాగం నిర్మాణానికి అనుమతులు ఇవ్వడమే కాకుండా నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత దక్షిణ భాగాన్ని తామే నిర్మించాలని భావించింది. మళ్లీ ఆ నిర్ణయాన్ని మార్చుకుని దక్షిణభాగం పనులనూ చేపట్టండంటూ కేంద్రానికి లేఖ రాసింది. దాని ప్రకారం డీపీఆర్ సహా అన్నీ కేంద్రమే చూసుకోవాలి. అయితే, రాష్ట్ర ప్రభుత్వమే డీపీఆర్ తయారీకి సలహా సంస్థల ఎంపికకు టెండర్లు పిలిచింది. తొలుత కేంద్రం ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ప్రాథమిక అలైన్‌మెంట్‌ను ఖరారు చేసినపుడు చౌటుప్పల్-ఆమనగల్- సంగారెడ్డి మధ్య 189 కిలోమీటర్ల పొడవున నిర్మించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం తానే చేపట్టాలని నిర్ణయించినపుడు ప్రాథమిక అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులు చేసింది. 11 కిలోమీటర్లు పెరిగి 200 కిలోమీటర్లు అయ్యింది. తాజా టెండర్లలో 200 కిలోమీటర్లనే పేర్కొన్నారు. డీపీఆర్‌ను రూపొందించి, కేంద్రానికి ఇచ్చి దాన్నే ఖరారు చేయాలని, దాని ప్రకారమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయనుంది. అందుకోసమే డీపీఆర్ టెండర్లు పిలిచారు. బిడ్‌లను ఫిబ్రవరి 11న తెరుస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసి ఇచ్చిన డీపీఆర్‌ను కేంద్రం ఆమోదిస్తుందా? మొదటగా నిర్ణయించిన 189 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రకారమే ముందుకు వెళ్తుందా? అన్నది తెలియాల్సి ఉంది.

సినిమా టాకీస్‌కూ 'రైతు బంధు'

ఫంక్షన్ హాళ్లు, వాణిజ్య సముదాయాలు..

ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకూ

సుల్తానాబాద్‌లో నలభై ఎకరాల గుర్తింపు

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): అది అరక పట్టి దున్ని.. విత్తనాలు చల్లే సాగు భూమి కాదు.. ఓ సినిమా హాల్. పక్కా కమర్షియల్ ప్రాపర్టీ!! అయినా దానికి రైతుబంధు పథకం వర్తింపజేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలో ఇలా ఓ సినిమాటాకీస్‌కు పెట్టుబడి సాయం కింద రైతుబంధు సాయం అందించారు. ఇక్కడ ఇంకొన్ని వాణిజ్య సముదాయాలకూ రైతుబంధు ఇచ్చారు. సాగుకు యోగ్యం కాని భూములకు రైతుభరోసా నిలిపి వేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు సర్వే చేపట్టారు. సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకొచ్చాయి. గుంట స్థలం కూడా సాగుకు నోచుకోని ఫంక్షన్ హాల్స్, సినిమా టాకీసు, రైస్‌మిల్లులు, వాణిజ్య సముదాయాలు, రియల్ ఎస్టేట్ వెంచర్ల యజమానులు రైతుబంధు ద్వారా లబ్ధిపొందుతున్నారు. పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్, పెరికెగిద్దె అంజనేయ స్వామి ఆలయం సమీపంలోని శ్రీరామా సినిమా టాకీస్, ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతుబంధు నిధులు జమవుతున్నాయని గుర్తించామని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, వ్యవసాయాధికారి స్వప్న తెలిపారు. ఇప్పటి వరకు ఇలా సుల్తానాబాద్ పట్టణంలో అక్రమంగా రైతుబంధు నిధులు పొందుతున్న నలభై ఎకరాలను గుర్తించి, అనర్హులుగా నమోదు చేశామని చెప్పారు.

నేడు కృష్ణాబోర్డు భేటీ

» సాగర్‌ను అప్పగించాలని తెలంగాణ పట్టు

» సాగర్, శ్రీశైలం ప్రాజెక్టును.. కృష్ణాబోర్డుకు అప్పగించాలని ఏపీ విజ్ఞప్తి

» ఏపీ వాటాకు రక్షణ కల్పించాలి

» బోర్డును విజయవాడకు తరలించాలి

» ఏపీ సాగు నీటి వినియోగదారుల సమాఖ్య

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశం కీలకమైన అజెండాలతో మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. జాతీయ ఆనకట్టల భద్రత చట్టం(ఎన్‌డీఎస్ఏ)-2021లోని సెక్షన్ 16(1ఏ) ప్రకారం నాగార్జునసాగర్ భద్రతకు సంబంధించిన నిఘా, 16(1బీ) ప్రకారం తనిఖీలు, 16(1సీ) ప్రకారం నిర్వహణ, పర్యవేక్షణ వంటి కార్యకలాపాలు తెలంగాణ పరిధిలోనే ఉండాలని.. ఆయా బాధ్యతలను తమకే అప్పగించాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. సాగర్, శ్రీశైలంలోని అన్ని కాంపోనెంట్లను కృష్ణాబోర్డుకు అప్పగించాలని, ప్రాజెక్టుల రక్షణ సీఆర్‌పీఎఫ్‌కు కట్టబెట్టాలనే ఏపీ కోరుతోంది. ఈ రెండు అంశాలు అజెండాగా కృష్ణాబోర్డు భేటీ జరగనుంది. 2024-25 వాటర్ ఇయర్‌లో నీటి పంపకాలపై బోర్డు సమావేశంలో చర్చించనున్నారు.

ఏపీ వాటా రక్షణకు డిమాండ్

కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ వాటా(512 టీఎంసీ)కు రక్షణ కల్పించాలని ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య విజ్ఞప్తి చేసింది. సోమవారం ఈ మేరకు కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్‌కు సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు వినతిపత్రం సమర్పించారు. కృష్ణాబోర్డు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలోని ఇబ్రహీంపట్నానికి తరలించాలని కోరారు. సాగర్ ఎడమకాల్వ కింద 3వ జోన్‌కు డిసెంబరు, జనవరి నెలల్లో 12 టీఎంసీలను విడుదల చేయాలనే ఉత్తర్వులున్నా.. ఇప్పటి వరకు 2.9 టీఎంసీలే విడుదలయ్యాయని, ఈ జోన్‌లో మామిడి, పొగాకు, జొన్న, పత్తి, మిర్చి, మినుము, పెసర, ఆయిల్‌పామ్ వంటి ఆరుతడి పంటలు ఉన్నాయని వివరించారు. ఈ పంటలకు కావాల్సిన నీటిని విడుదల చేయాలని కోరారు. సాగర్ కుడికాల్వను తెలంగాణ నుంచి ఏపీకి అప్పగించాలని కుడికాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు కోరారు. ఈ అంశాలపై మంగళవారం జరిగే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

తుపాకులతో పోలీసుల విధులు

» హైదరాబాద్ నగరంలో అమలు

» వరుస ఘటనలతో ప్రభుత్వ నిర్ణయం

బోయిన్‌పల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అఫ్జల్‌గంజ్‌లో కాల్పుల కలకలం నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెడ్డీగ్యాంగ్‌లు, దారిదోపిడీ ముఠాలు కూడా మారణాయుధాలతో తిరుగుతుండడంతో.. పోలీసులు తప్పనిసరిగా తుపాకులతో విధులు నిర్వర్తించాలని ఆదేశించింది. నగరంలో 'గన్ కల్చర్' విస్తరించకుండా.. హైదరాబాద్‌ను సేఫ్‌సిటీగా కొనసాగించాలని పోలీసు శాఖకు స్పష్టం చేసింది. దీంతో సోమవారం నగరంలోని కూడళ్లలో పోలీసులు ఆయుధాలతో విధులు నిర్వర్తించడం కనిపించింది.

గుట్ట కోసం ప్రాణాలైనా ఇస్తాం

» మైనింగ్ మాత్రం జరగనివ్వం

» స్పష్టం చేసిన మైలారం గ్రామస్థులు

» పురుగు మందు డబ్బాలతో ఆందోళన

» ఆత్మహత్యాయత్నం.. అడ్డగింత

» ప్రొఫెసర్లు హరగోపాల్, లక్ష్మణ్ అరెస్టు



పురుగు మందుతో ఆత్మహత్య చేసుకుంటామంటూ గ్రామస్థుల ఆందోళన


బల్మూరు/వెల్దండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): "గుట్ట కోసం ప్రాణాలైనా ఇస్తాం. మైనింగ్‌ను జరగనివ్వబోం" అంటూ నాగర్‌కర్నూలు జిల్లా బల్మూరు మండలం మైలారం గ్రామస్థులు తేల్చిచెప్పారు. రోడ్డుపై ముళ్ల కంచె వేసి.. పురుగు మందు డబ్బాలతో సోమవారం ఆందోళనకు దిగారు. ఈదమ్మ, చంద్రమౌళి అనే ఇద్దరు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధపడ్డారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. గుట్టవద్ద మైనింగ్ వద్దంటూ మైలారం గ్రామస్థులు కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. ఇదే అంశంపై ఇటీవలి పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించారు. హైకోర్టులో కేసు నడుస్తుండగా.. సంబంధిత కాంట్రాక్టర్ గుట్టను తవ్వే పనులు చకాచకా చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. తవ్వకాలను ఆపేందుకు వెళ్తే అరెస్టులు చేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ గ్రామస్థులతో మైనింగ్ విషయం మాట్లాడటానికి సోమవారం వచ్చేందుకు నిర్ణయించుకున్నారు. విషయం తెలిసిన పోలీసులు గ్రామానికి ఉదయం 6 గంటలకే చేరుకొని ముఖ్య నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ సందర్భంగా గ్రామస్థులు ఒకేసారి ఐక్యంగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రామస్థులు రోడ్డు మీద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

ఆందోళనలు ఆపలేరు: ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాస్వామ్యంలో తమ సమస్యలపై ఉద్యమించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అణచివేతలతో ఆందోళనలను ఆపలేరని పౌర హక్కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్, అన్నారు. మైలారం గ్రామానికి వెళుతున్న వారిని వెల్దండ పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సుమారు రెండు గంటలకుపైగా పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఖనిజసంపద దోచుకునేవారు ఎక్కువయ్యారన్నారు. మైలారంలో మైనింగ్ పనులపై ప్రభుత్వం పునరాలోచించాలని హరగోపాల్ కోరారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మైలారం రైతులను నిర్బంధించడం తగదని అన్నారు. గతంలో ప్రజాహక్కులను బీఆర్ఎస్ కాలరాసిందన్న సీఎం రేవంత్‌రెడ్డి తన పాలనలో నిర్బంధాలు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.

రాష్ట్రంపై మళ్లీ చలి పంజా

సిర్పూర్‌లో 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత



యాదాద్రి భువనగిరిలో ముత్యాల హారాన్ని తలపిస్తున్న సాలె గూడుపై మంచు బిందువులు

హైదరాబాద్/ కోహీర్/ ఆదిలాబాద్/ ఆసిఫాబాద్/ హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని రోజులపాటు తగ్గిన చలి తీవ్రత మళ్లీ తన తడాఖా చూపిస్తోంది. కొన్ని జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు ఏకంగా సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. ఆదివారం రాత్రి ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, ఆదిలాబాద్ జిల్లా బేలలో 8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 8.9 డిగ్రీలు, నిర్మల్ జిల్లా పంబిలో 9.3 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో 9.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే మెదక్ జిల్లా శివనూరులో 12.2 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా కొండపాకలో 10.9 డిగ్రీలు, హైదరాబాద్ పటాన్‌చెరులో 10.4 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో 11.2 డిగ్రీలు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో 15 డిగ్రీలు, నల్లగొండ జిల్లాలో 16 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఓ వైపు రాత్రి పూట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ స్థాయికి పడిపోతుంటే, కొన్ని జిల్లాలో పగటి పూట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు మించి నమోదవుతుండడం విశేషం. ఆదివారం 19 జిల్లాల్లో 35 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, ఉదయం 7 గంటల వరకు ప్రధాన రహదారులను పొగమంచు కప్పేయడంతో వాహనదారులు దారి కనిపించక తిప్పలు పడుతున్నారు. చలిగాలులకు చిన్నపిల్లలు, వృద్ధులు ఆస్తమా వ్యాధిగ్రస్తులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి నేపథ్యంలో వీలైనంత మేరకు ప్రజలు ఇంటికే పరిమితం కావాలని, అత్యవసర పనులుంటే తగిన జాగ్రత్తలు తీసుకొని బయటికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని, శివరాత్రి వరకు చలి తీవ్రత ఇదే విధంగా కొనసాగే అవకాశముందని వాతావరణశాఖ పేర్కొంది.

కుంభమేళాకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ప్రారంభం

ఫిబ్రవరి 15న మరో రైలు

హైదరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 'మహా కుంభమేళా పుణ్యక్షేత్ర యాత్ర' పేరుతో భారత్ గౌరవ్ పర్యాటక రైలును సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి సోమవారం ప్రారంభమైంది. ఈ రైలును యాత్రికుల్లో ఒకరైన తపన్ చంద్ర(77) ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) గ్రూప్ జనరల్ మేనేజర్ పి. రాజ్ కుమార్ సమక్షంలో జెండా ఊపి ప్రారంభించారు. ప్రయాణికులు ఈ రైలు ద్వారా వారాణసీ-ప్రయాగ్‌రాజ్-అయోధ్యలోని తీర్థ స్థలాలను సందర్శించవచ్చు. కాగా.. ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమయ్యే మరో 'మహా కుంభమేళా పుణ్యక్షేత్ర యాత్ర' భారత్ గౌరవ్ రైలు పర్యాటక ప్యాకేజీని ప్రకటించింది. ఈ రైలు ప్రయాగ్‌రాజ్‌లోని ప్రసిద్ధ త్రివేణి సంగమం, వారాణసీలోని కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణా దేవి, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి, హనుమాన్ గరి దేవాలయాలను సందర్శించే అవకాశాన్ని కల్పిస్తుంది. తెలంగాణలో సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, వైజాగ్(పెందుర్తి), విజయనగరం వంటి ముఖ్యమైన స్టేషన్లలో ప్రయాణికులు ఈ రైలు ఎక్కేందుకు/దిగేందుకు సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ యాత్ర మొత్తం 7 రాత్రులు/8 పగళ్లు వ్యవధిలో సాగుతుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.